

శతారుణ గీతాంజలి
రూ॥180/-
పేజీలు:180
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


మే రెండోవారంలో భారత్‌కు ఎస్-400 ట్రియంఫ్ నాలుగో యూనిట్

మోదీ ప్రాయశ్చిత్తం చేసుకునే తరుణమిది

ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు : కేంద్రం 05


సంపుటి 09, సంచిక: 149 | బుధవారం | 29-04-2026 | మహబూబ్‌నగర్ | Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00




## నేడు టెన్త్ ఫలితాలు

● మధ్యాహ్నం 2.30 గంటలకు విడుదల
● అధికారిక 'మీ సేవ' వాట్సాప్ నెంబర్ ద్వారా ఫలితాలు పొందొచ్చు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో పదో తరగతి పరీక్షా ఫలితాలు బుధవారం మధ్యాహ్నం 2:30 గంటలకు విడుదల కానున్నాయి. అధికారిక 'మీ సేవ' వాట్సాప్ నంబర్ 8096958096 ద్వారా ఫలితాలను పొందేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెంబర్ సేవ్ చేసుకొని వాట్సాప్‌లో ఎస్ ఎస్ సి రిజల్ట్ అని టైప్ చేయాలి. మెనులో ఒపెన్ సర్వీస్ ఎంపికపైన క్లిక్ చేయాలి. విద్యార్థులు హాల్ టికెట్ నంబర్‌ను సమర్పించిన వెంటనే మార్కుల మెమో వాట్సాప్ ద్వారా అందుతుంది. పదో తరగతి పరీక్షా ఫలితాలను హైదరాబాద్‌లోని ఎస్‌సిఇఆర్‌టి క్యాంపస్‌లోని గోదావరి ఆడిటోరియంలో ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు విడుదల చేయనున్నారు. ఈ విద్యా సంవత్సరం పరీక్షలు ముగిసిన 15 రోజుల్లోపు ఫలితాలను విడుదల చేస్తున్నారు.

**రిజల్ట్స్ అందుబాటులో ఉండే వెబ్‌సైట్స్ :**
https://results.bsetelangana.org,
https://results.bse.telangana.gov.in,
https://bse.telangana.gov.in,
https://schooledu.telangana.gov.in

# గణపతీ.. జనంలోకి రండి

## మీ ప్రాణాలకు ప్రభుత్వానిదే బాధ్యత
## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మరోసారి పిలుపు





● ప్రభుత్వపరంగా అవసరమైన వైద్య సేవలు అందిస్తామని హామీ ● ఫ్యూచర్‌సిటీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి ● భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా విలసిల్లుతుంది ● సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారం ● అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలి ● రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీరాఖాన్ పేట సమీపంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయానికి శంకుస్థాపన

ప్రజాపక్షం/రంగారెడ్డి

అజ్ఞాతంలో వృద్ధాప్యంతో ఉన్న మావోయిస్టు అగ్ర నేత గణపతి జనజీవన స్రవంతిలోకి రావాలని మరోసారి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వపరంగా అవసరమైన వైద్య సేవలు అందిస్తామని, ఆయన ఆరోగ్యం బాధ్యత ప్రభుత్వం చూసుకుంటుందని, ఆయన ప్రాణాలకు మాదీ బాధ్యతని గణపతి వెంటనే జనజీవన స్రవంతిలో కలవాలని సిఎం సూచించారు. అడవిలో ఇంకెవరైనా ఉన్నా, వారు కూడా ఆయుధాలు వీడాలన్నారు. ఇటీవల లొంగిపోయిన మావోయిస్టుల్లో 20 మంది యువతకు గిరి దర్శక్ పేరుతో టూరిజం ప్రాంతాల్లో వారి సేవలు వినియోగించుకునే విధంగా ఉపాధి అవకాశాలు కల్పించచామన్నారు. గిరిజన ప్రాంతాలకు చెందిన వారికి హిందీ, ఇంగ్లీష్‌ను నేర్పించేందుకు స్టయిఫండ్‌తో కూడిన ఆరు నెలల శిక్షణ సర్టిఫికెట్లు అందజేయాలని సంబంధిత అధికారులకు సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీరాఖాన్ పేట సమీపంలో ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ కార్యాలయ నిర్మాణానికి సిఎం రేవంత్‌రెడ్డి, ఐటి పరిశ్రమల శాఖ, జిల్లా ఇంచార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో అక్కడి ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలకు అద్భుత నగరంగా ఫ్యూచర్ సిటీ విలసిల్లుతుందని పేర్కొన్నారు. సర్పంచ్‌లు, కార్పొరేటర్లు ప్రభుత్వానికి సహకరిస్తేనే సమస్యలు వేగంగా పరిష్కారమవుతాయన్నారు. ప్రభుత్వ అధికారిక కార్యక్రమం జరిగితే ఫ్యూచర్ సిటీ పరిధి గ్రామాల ప్రజాప్రతినిధులకు పాస్ పంపాలని పోలీసులకు సూచించారు. కొంతమంది తమ గ్రామాలను ఫ్యూచర్ సిటీలో కలపాలని గ్రామస్థులు

తరువాయి 2లో



## డిజిపిగా సివి ఆనంద్

ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పోలీస్ విభాగానికి కొత్త డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి)గా సీనియర్ ఐపిఎస్ అధికారి సివి ఆనంద్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం జీఓ ఆర్టీ నం.553 జారీ చేసింది. ప్రస్తుతం హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేస్తున్న ఆనంద్‌ను బదిలీ చేసి, ఎంపిక ప్రక్రియ అనంతరం డిజిపిగా నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. యుపిఎస్‌సి మార్గదర్శకాల ప్రకారం ఎంపానెల్ కమిటీ సిఫార్సుల ఆధారంగా ఈ నియామకం జరిగినట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణరావు వెల్లడించారు. 1968 జూన్ 5న హైదరాబాద్ పాతబస్తీలోని పేట్లబుర్జ్

తరువాయి 2లో



## పెట్రోల్ , డీజిల్ సరఫరా 126% పెంపు

● నిల్వలకు రాష్ట్రంలో ఎలాంటి కొరత లేదు : స్టీఫెన్ రవీంద్ర ● మూడోరోజూ మూతపడ్డ పలు పెట్రోల్ పంపులు ● నిల్వలు ఉన్నచోట భారీగా వాహనదారుల లైన్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రజలకు ఇబ్బంది లేకుండా పెట్రోల్, డీజిల్ సరఫరాను పౌర సరఫరాల శాఖ 126 శాతానికి పెంచింది. అకస్మాత్తుగా పెరిగిన డిమాండ్ వల్ల స్థానిక పెట్రోల్ బంకుల్లో తలెత్తిన రద్దీని తగ్గించడానికి అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు. పెట్రోల్ బంకుల దగ్గర ఇలా ఊహించని రద్దీ పెరగడానికి పరిశ్రమలకు వాడే డీజిల్ ధరను ఇటీవల లీటరుకు రూ. 150 కు పెరగడంతో వ్యాపారులు పెద్దమొత్తంలో కొనుగోలు చేయడం, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల్లో కొరత ఏర్పడడం,

తరువాయి 12లో



## భానుడు ఉగ్రరూపం

● తెలంగాణలో 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు
● ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్‌లకు రెడ్ అలర్ట్
● రాబోయే నాలుగైదు రోజుల్లో వర్షాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా భానుడు ఉగ్రరూపాన్ని ప్రదర్శిస్తున్నాడు. ఇప్పటికే 45 డిగ్రీలకు పైగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్‌తో పాటు నిజామాబాద్ జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఈ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. వడగాల్పుల తీవ్రత అధికంగా ఉంటుందన్నారు. ద్రోణి, క్యుములోనింబస్ మేఘాల ప్రభావంతో రాగల నాలుగైదు రోజుల పాటు ఉరుములు మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వడంగడ్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం ఉత్తర తెలంగాణలో

తరువాయి 2లో



## జూన్ 1 నాటికి బహిరంగ మార్కెట్‌లోకి పాఠ్యపుస్తకాలు

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 81% ప్రభుత్వ పాఠ్యపుస్తకాల పంపిణీ 03

## పారిశ్రామిక హబ్‌గా మిర్యాలగూడను మారుస్తాం

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



ప్రజాపక్షం/మిర్యాలగూడ

రానున్న రోజుల్లో మిర్యాలగూడను ఒక ప్రధాన పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫి శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణంలో భాగంగా హైస్పీడ్ ట్రైన్, నేషనల్ హైవేలు, డ్రైపోర్టులు, గ్రీన్ హైవేల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధమయ్యాయని తెలిపారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు సమీపంలో రూ.500కోట్లతో ట్రైన్ హబ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన డీపీఆర్ ఈ ఏడాది నవంబర్ నాటికి పూర్తవుతుందని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పర్యటనలు కేవలం రాష్ట్ర భవిష్యత్తు, అభివృద్ధి, నిధుల కోసమేనని అన్నారు. నేషనల్ హైవేపై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి తక్షణమే రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వానికి కూడా అధికారికంగా లేఖ రాశామని, జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ల నిర్మాణ పనులను వేగవంతం చేస్తామనీ అన్నారు. హరీష్‌రావు, కేటీఆర్‌లు పనిలేక ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలో తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వమే వస్తుందనిజోస్యం చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమయ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చాలా బలంగా ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో సైతం జిల్లాలోని 12 స్థానాలను క్లీన్ స్వీప్ చేస్తామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

## సిఎం ఇంటికి పాదయాత్ర

# విద్యార్థి నేతల అరెస్ట్






ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా 15 లక్షల మంది విద్యార్థులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.9 వేల కోట్ల ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ డిమాండ్ చేశారు. విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో 'ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఐఎస్ఎఫ్ నాయకులు విద్యార్థులు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫీజుల బకాయిలను విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్‌ను కాపాడాలని నినదించారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం నుంచి సిఎం ఇంటికి ర్యాలీగా బయలుదేరిన ఎఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు మధ్యలో అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్యఒక్కసారిగా తీవ్ర తోపులాట చోటు చేసుకుంది. పోలీసుల తీరును నిరసిస్తూ ఎఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థుల అక్కడే బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. అప్పటికే అక్కడికి పెద్దఎత్తున చేరుకున్న పోలీసులు ఎఐఎస్ఎఫ్ నాయకులను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. అరెస్టు అయిన వారిలో ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బానోతు రఘురాం, గ్యార నరేష్, బాలసాని లెనిన్, రాజు, సోతుకు ప్రవీణ్ , కౌన్సిల్ సభ్యులు చైతన్య యాదవ్, ఎండి.అన్వర్, రామగల్ల నరేష్,

తరువాయి 12లో

## నేడు బెంగాల్‌లో తుదిదశ దంగల్

● 142 స్థానాల్లో పోలింగ్
● 1,448 మంది అభ్యర్థుల భవితవ్యం తేల్చనున్న 21.73 లక్షల మంది ఓటర్లు

**కోల్‌కతా :** పశ్చిమ బెంగాల్‌లో నేడు శాసనసభ ఎన్నికల రెండవ, చివరి దశలో బుధవారం 142 స్థానాలలో పోలింగ్ జరగనుంది. ఈ స్థానాల్లో సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాకి తెరపడింది. రెండవ దశలో మొత్తం 1448 మంది అభ్యర్థులు పోటీ చేస్తుండగా 3కోట్ల 21లక్షల 73వేల మంది ఓటర్లు వారి భవితవ్యాన్ని తేల్చనున్నారు. ఇందులో 1,64,35,627 మంది పురుషులు, 1,57,37,418 మంది మహిళలు, 792 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. ఇందుకోసం కేంద్ర ఎన్నికల సంఘం 41వేల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అన్ని కేంద్రాల్లోనూ వెబ్‌క్యాస్టింగ్ సౌకర్యాన్ని కల్పించింది. అటు మొత్తంగా 142 మంది సాధారణ పరిశీలకులు, 95 మంది

తరువాయి 12లో



అంతర్జాతీయ మీడియా ప్రకటన

వాళ్ళకి అణ్వాయుధాన్ని దక్కనీయం : మార్కో రుబియో

ఇరాన్ ఆయిల్ పంపింగ్ త్వరలో కుప్పకూలిపోతుంది : బెస్సెంట్

48 గంటల్లో మూడోసారి అరాఘ్చి పాకిస్థాన్ పర్యటన

## ఇరాన్ ప్రతిపాదనకు ట్రంప్ అసంతృప్తి

**వాషింగ్టన్:** ఇరాన్ ప్రతిపాదించిన మూడు దశల చర్చలు,పరిష్కార ప్రయత్నాల ప్రతిపాదనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అంగీకరించే అవకాశంలేదు. ఈ ప్రతిపాదనలను ట్రంప్ యంత్రాంగం సమ్మతించడానికి సిద్ధంగా లేదని అంతర్జాతీయ మీడియా ప్రకటించింది. సిట్యుయేషన్ రూమ్‌లో మంగళవారం జరిగిన చర్చల సారాంశాన్ని ట్రంప్ సలహాదారు వివరించిన ప్రకారం,పర్షియన్ గల్ఫ్‌లో అమెరికా దిగ్బంధనాన్ని ఉపసంహరించాలని ఇరాన్ కోరింది, అణు చర్చలు వాయిదా వేసి,యుద్ధం ముగించి, హోర్ముజ్‌ను తెరవాలని ఇరాన్ చేసిన ప్రతిపాదనలపట్ల "ట్రంప్ హ్యాపీగా లేరు" అని మీడియా పేర్కొంది. యుద్ధం ముగిసిన తర్వాత అణు శుద్ధిపై చర్చలను పక్కకు పెట్టాలని ఇరాన్ కోరినట్లు సంప్రదింపుల వివరాలు తెలిసిన అధికారులు చెప్పారని న్యూయార్క్ టైమ్స్ పత్రిక పేర్కొంది. ఈ ప్రతిపాదనలన్నీ ఇరాన్‌కు అనుకూలంగా ఉన్నాయిగానీ, అమెరికా లక్ష్యాలకు అనుగుణంగా లేవని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ,అమెరికన్ శాటిలైన్ న్యూస్ ఛానెల్ సిఎన్ఎన్ (కేబుల్ న్యూస్ నెట్‌వర్కర్) ప్రకటించింది. అదేవిధంగా

తరువాయి 2లో

# ఆధిపత్యం కోల్పోతున్న పాశ్చాత్యదేశాలు: పుతిన్

## గ్లోబల్‌సౌత్‌లో కొత్త వృద్ధి కేంద్రాలకు మార్గాలు



**మాస్కో:** పాశ్చాత్యదేశాలు క్రమంగా తమ ఆధిపత్యం కోల్పోతున్నాయని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు. మాస్కోలో జరిగిన ''ఓపెన్ డైలాగ్'' అంతర్జాతీయ వేదికపై మంగళవారం ఆయన మాట్లాడుతూ, పాశ్చాత్యదేశాలు తమ ఆధిపత్యం కోల్పోవడంద్వారా గ్లోబల్ సౌత్‌లో సరికొత్త బహుళధృవ కేంద్రాలు ఏర్పడేందుకు, వాటి వృద్ధికి మార్గాలు ఇస్తున్నాయని, ఆ అవకాశాలు పెరగుతున్నాయని చెప్పారు. నాటో కూటమి విచ్ఛిన్నం అంచున ఉండటం, యూరప్ దేశాల్లో ఆర్థిక సంక్షోభం, విద్యుత్, మార్కెట్ సంక్షోభాలు,విభేదాలు, అమెరికాకు దూరంగా జరిగి సొంత సైనిక వ్యవస్థను అభివృద్ధి చేసుకునేందుకు, కొత్త ప్రపంచ మార్కెట్లను వెతుక్కునేందుకు తంటాలు పడుతూ ఉండటం వంటి పరిణామాల మధ్య పుతిన్ పైవిధంగా వ్యాఖ్యానించారు. పాశ్చాత్యదేశాలు తమ నాయకత్వ పాత్రను కోల్పోతున్నాయి, దీనివల్ల ఆధిపత్యం తగ్గిపోతోంది, పాశ్చాత్యదేశాలు అనుసరిస్తున్న చర్యలవల్ల వ్యాపారపరంగా, అంతర్జాతీయంగా ఇప్పటివరకూ ఉన్న సంబంధాలలో మార్పులు సంభవిస్తున్నాయి, సుస్థిరమైన నిబంధనలు, నియమాలు క్రమంగా మందగించి కనుమరుగవుతున్నాయి అన్నారు. అభివృద్ధి దశలో దేశాలు వివిధ రంగాలలో తమ జాతీయ సార్వభౌమాధికారాన్ని గుర్తించి, అర్థం చేసుకుని సంక్లిష్ట ప్రపంచంలో తమ సొంత మార్గాలను ఎంచుకుని ముందుకు వెళుతున్నాయని, బహుళధృవ ప్రపంచ నిర్మాణం స్థాపితమవుతోందని అన్నారు. ఏ ఒక్క దేశం కూడా ఇతర దేశాలకు నష్టం కలిగించి అభివృద్ధి చెందాలనుకోదని, ఐతే ఆధునిక ప్రపంచంలో ఎదురవుతున్న సవాళ్ళకు ఒక ఉమ్మడి స్పందన,సామూహిక ప్రయత్నాలు చేయడం ఎంతో అవసరమని అన్నారు.

# ఇరాన్ ప్రజల ధైర్యానికి పుతిన్ ఫిదా

### వీరోచితంగా పోరాడుతున్నారని ప్రశంస
### మొజ్తాబా ఖమేనీ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్ష
### ఇరాన్‌మంత్రి అరాఘ్చితో భేటీలో వెల్లడి



**సెయింట్ పీటర్స్‌బర్గ్:** పశ్చిమాసియా యుద్ధంలో ఇరాన్ చూపించిన ధైర్యసాహసాలకు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఫిదా అయ్యారు. ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి సోమవారం రష్యాలో పర్యటించి ముఖాముఖీ సమావేశం జరిపిన సందర్భంగా ఇరాన్ తెగువను కొనియాడారు. పశ్చిమాసియాలో యుద్ధం ముగించేందుకు, శాంతిసాధనకు రష్యా తన శక్తిమేరకు కృషి చేసేందుకు సిద్ధంగా ఉందని అరాఘ్చితో పుతిన్ చెప్పారు. సార్వభౌమాధికార రక్షణకు ఇరాన్ ప్రజలు ఎంతో వీరోచితంగా పోరాటం చేస్తున్నారని కొనియాడారు. గతవారం ఇరాన్ సర్వోన్నత నాయకుడు మొజ్తాబా ఖమేనీ తనకు ఒక సందేశం పంపించారంటూ అందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఇరాన్ ప్రజలు ఈ కష్టకాలం నుండి బయట పడతారని, దేశంలో శాంతి నెలకొంటుందని అన్నారు. ఆయన ఆరోగ్యాన్ని, శ్రేయస్సును ఆకాంక్షించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేయాలని అరాఘ్చిని కోరారు. ఇరాన్‌లో ద్వైపాక్షిక సంబంధాలను కొనసాగించి వృద్ధి చేసుకోవడానికి తామెంతో ఇష్టపూర్వకంగా ఉన్నామన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ ఉమ్మడిగా చేసిన దాడులను తట్టుకుంటూ తీవ్రమైన ఒత్తిడుల మధ్య శత్రువులను ఎదిరించి పోరాడుతూ కాళ్ళు నిలదొక్కుకుని దౌత్య చర్చల్లో అలవికాని డిమాండ్లకు తలొగ్గకుండా ఇరాన్ పోరాటం చేస్తోంది. ఈ సందర్భంగా అరాఘ్చి స్పందిస్తూ, పాకిస్థాన్‌లో జరిగిన మొదటి విడత చర్చలు విఫలం కావడానికి పట్టువిడుపులు లేని అమెరికా మొండి వైఖరే కారణమని అన్నారు. రష్యా–ఇరాన్ మధ్య సంబంధాలు వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేస్తాయని, ఈ బంధం మరింత బలోపేతమవుతుందని అన్నారు. సమావేశం తర్వాత టాస్ వార్తాసంస్థతో అరాఘ్చి మాట్లాడుతూ, పుతిన్‌ను కలుసుకోవడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇరాన్ నేత మొజ్తాబా ఖమేనీ, అధ్యక్షుడు పెజెష్కియన్‌లకు పుతిన్ తన శుభాకాంక్షలు తెలియజేశారని చెప్పారు. ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్‌కు మద్దతు ఇచ్చినందుకు పుతిన్‌కు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

## గత నెల 33వేల రష్యా డ్రోన్లు కూల్చేశాం: ఉక్రేన్



**కీవ్:** గతనెలలో రష్యాకు చెందిన 33,000 డ్రోన్లను కూల్చివేసినట్లు ఉక్రేన్ ప్రకటించింది. రెండు నెలలుగా రష్యా–ఉక్రేన్ మధ్య పరస్పర దాడులు భారీగా పెరిగాయి. ఇరు దేశాల్లో నష్టాలు కూడా అధికంగానే జరుగుతున్నాయి. మార్చినెలలో రికార్డుస్థాయిలో 33 వేల రష్యా డ్రోన్లు కూల్చివేసినట్లు ఉక్రేన్ రక్షణమంత్రి మైఖైలో ఫెడోరోవ్ మంగళవారం చెప్పారు. అదేవిధంగా రష్యా ఒక ప్రకటన చేస్తూ వారం రోజుల వ్యవధిలో తమ భూభాగంపై ఉక్రేన్ చేసిన దాడుల్లో ఇద్దరు పిల్లలు సహా ఇరవైమంది పౌరులు మరణించారని, మరో 174 మంది గాయపడ్డారని పేర్కొంది. అదేవిధంగా నల్లసముద్రంవద్ద ఉన్న రష్యా ఆయిల్ రిఫైనరీపై కూడా ఉక్రేన్ సొంతంగా తయారు చేసిన దీర్ఘశ్రేణి క్షిపణులు దాడిచేసి విధ్వంసం సృష్టించాయి. ప్రస్తుతం ఉక్రేన్ ఎదురుదాడి శక్తి గతంకంటే బాగా మెరుగుపడిందని మైఖైలో ఫెడోరోవ్ చెప్పారు. గతంకంటే తమ దేశ దళాల సంఖ్య కూడా పెరిగిందని చెప్పారు. ప్రస్తుతం ఉక్రేన్ దళాలు 630 కి.మీ దూరంలో ఉన్న సైనిక లక్ష్యాలను కూడా ధ్వంసంచేయగలస్థాయిలో ఉన్నాయని చెప్పారు. దాదాపు 1,750 కి.మీ దూరంలో ఉన్న లక్ష్యాలను కూడా ఇప్పుడు దెబ్బతీస్తామన్నారు.

# 12 పట్టణాలు, గ్రామాలు ఖాళీ చెయ్యండి

### ద.లెబనాన్ ప్రజలకు ఇజ్రాయెల్ సైన్యం ఆదేశం



**బీరూట్:** దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ తన ఆక్రమణ చర్యలను ఉద్ధృతం చేసింది. 12 పట్టణాలు,గ్రామాలను ఖాళీ చేసి ఉత్తర ప్రాంతంవైపు వెళ్ళిపోవాలని ఇజ్రాయెల్ సైన్యం ప్రజలకు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. దీంతో ప్రజల్లో తీవ్ర ఆందోళన,గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ప్రాంతంలో అనివార్యంగా హెజ్బొల్లా సైన్యాలపై దాడులు జరుగుతాయని, ఖాళీచేసి వెళ్ళిపోవాలని ఆదేశించింది. కాల్పుల విరమణ ఒప్పందాన్ని హెజ్బొల్లా సైన్యం ఉల్లంఘించి తమ దేశంపైకి రాకెట్ దాడులు చేసిన ఫలితంగానే ఈ పరిస్థితి వచ్చిందని కూడా ఐ.డి.ఎఫ్ ప్రకటించింది. హెజ్బొల్లా సైన్యం లెబనాన్‌కు ద్రోహం చేసిందని ఆ దేశాధ్యక్షుడు జోసెఫ్ ఔన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమకు ఎంతమాత్రం సంబంధంలేని ఇరాన్–ఇజ్రాయెల్ యుద్ధంలోకి లెబనాన్‌ను బలవంతంగా హెజ్బొల్లా ఈడ్చుకువెళ్ళి ద్రోహం చేసిందని విమర్శించారు. ఇరాన్ నిధులు,అండదండలతో లెబనాన్‌లో పెరిగి ఎంతో బలంగా వేళ్ళూనుకున్న హెజ్బొల్లా సైన్యం ఇరాన్‌పై ఫిబ్రవరిలో దాడులు ప్రారంభమైన తర్వాత ఆగ్రహించి ఉత్తర ఇజ్రాయెల్‌పైకి లెబనాన్ భూభాగం నుండి రాకెట్లు ప్రయోగించి విధ్వంసం సృష్టించింది. దీంతో ఇజ్రాయెల్ సైన్యం మార్చి రెండో తేదీన లెబనాన్‌పై యుద్ధం ప్రకటించింది. ఇజ్రాయెల్ సైనికులు లెబనాన్‌లోకి ప్రవేశించి అప్పటి నుండి విధ్వంసం సృష్టించడం ప్రారంభించారు. హెజ్బొల్లా స్థావరాలను ధ్వంసం చేస్తూ, వారిని సమూలంగా నిర్మూలించేవరకూ లెబనాన్‌ను వదిలివెళ్ళేదిలేదని ప్రతిజ్ఞ చేశారు. హెజ్బొల్లా చర్యలను లెబనాన్ అధ్యక్షుడు ఔన్‌తోపాటు ప్రధానమంత్రి నవాఫ్ కూడా వ్యతిరేకిస్తున్నారు. ఇజ్రాయెల్‌లో చర్చలకు లెబనాన్ సిద్ధపడగా, ఈ ముఖాముఖీ చర్చలను హెజ్బొల్లా నాయకుడు నయీమ్ ఖాస్సిమ్ మరోసారి తీవ్రంగా వ్యతిరేకించారు. హెజ్బొల్లాను ఇజ్రాయెల్ ఎన్నటికీ నిరాయుధులను చేయలేదని ప్రతిహెచ్చరిక చేశారు. ఇదిలా ఉండగా, మంగళవారం దక్షిణ లెబనాన్‌లో ఇజ్రాయెల్ చేసిన తాజా దాడుల్లో మరో నలుగురు మరణించారు. దీంతో లెబనాన్‌లో కాల్పుల విరమణ ప్రకటించిన తర్వాత మరణించినవారిసంఖ్య 42కు చేరుకుంది.

## ఇండోనేసియాలో రైళ్ళు ఢీ

### 15 మంది మృతి



**జకర్తా:** ఇండోనేసియాలో రెండు రైళ్ళు ఢీకొనడంతో 15 మంది ప్రయాణికులు మరణించారు. మరో 84 మంది గాయపడ్డారు. రాజధాని జకర్తా తూర్పుప్రాంతంలోని బెకాసీ తిమూర్ స్టేషన్ సమీపంలో సోమవారం అర్ధరాత్రి దాటాక ఈ ప్రమాదం సంభవించింది. దాదాపు 12 గంటలసేపు సహాయ సిబ్బంది కష్టపడి ప్రయాణికులను వెలికితీసి ఈ ప్రాంతాన్ని క్లియర్ చేశారు. శిథాలాలను పూర్తిగా తనిఖీచేసి మృతదేహాలను వెలికితీశామని నేషనల్ సెర్చ్ అండ్ రెస్క్యూ ఏజన్సీ అధిపతి మహ్మద్ శ్యాఫిల్ మంగళవారం జకర్తాలో మీడియాకు చెప్పారు. బోగీల్లో చిక్కుకుపోయిన అనేకమందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని చెప్పారు. ప్రమాదంలోంచి బయటపడిన చికిత్స పొందుతున్న సౌసన్ సరీఫా మాట్లాడుతూ, తాను చనిపోతాననే అనుకున్నానని, అదృష్టవశాత్తూ సురక్షితంగా బయటపడ్డానని చెప్పారు. అర్ధరాత్రి నిద్రలో ఉండగా, అందరూ రైలు దిగపోవడానికి సిద్ధంగా ఉండాలని ఒక ప్రకటన రెండుసార్లు వినిపించిందని, అంతలోనే పెద్ద శబ్దాలు వినిపించాయని, దిగడానికి సమయమే లేదని చెప్పారు.

## డిజిపిగా సివి ఆనంద్

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ ఆసుపత్రిలో జన్మించిన ఆనంద్, విద్యారంగంలోనే కాక క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, నిజాం కాలేజ్‌లో చదివిన ఆయన, ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించారు. యువకుడిగా హైదరాబాద్ అండర్19 క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. 1991 బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన ఆయన, కెరీర్ ప్రారంభంలోనే నక్సలైట్ ప్రభావిత జిల్లాల్లో ధైర్యవంతమైన ఆపరేషన్లతో గుర్తింపు పొందారు. వరంగల్ ఎఎస్‌పి, బెల్లంపల్లిలో అదనపు ఎస్‌పిగా, నిజామాబాద్ ఎస్‌పిగా పనిచేసిన సమయంలో నక్సలిజాన్ని అదుపులోకి తీసుకువచ్చినందుకు ప్రెసిడెంట్ గ్యాలెంట్రీ మెడల్ అందుకున్నారు. హైదరాబాద్ నగరంలో డిసిపిగా పనిచేసిన సమయంలో గణేష్ నిమజ్జన నిర్వహణలో వినూత్న మార్పులు తీసుకువచ్చారు. ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా ఈచలాన్, డ్రంక్ డ్రైవింగ్ నియంత్రణ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వంటి పద్ధతులను ప్రవేశపెట్టి ట్రాఫిక్ నిర్వహణలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. సైబరాబాద్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేసిన సమయంలో మహిళల భద్రత కోసం 'షీ టీమ్స్', సిసిటివి విస్తరణ వంటి కీలక చర్యలు చేపట్టారు. యాంటీ కరప్షన్ బ్యూరో (ఎసిబి) డిజిగా, సివిల్ సప్లైస్ కమిషనర్‌గా ఉన్నప్పుడు రేషన్ వ్యవస్థలో ఈపాస్ యంత్రాలు, జిపిఎస్ ట్రాకింగ్ అమలు చేసి పారదర్శకతను పెంచారు. కేంద్ర డిప్యూటేషన్‌లో సిఐఎస్‌ఎఫ్‌లో ఐజిగా పనిచేసి దేశవ్యాప్తంగా విమానాశ్రయ భద్రతను పర్యవేక్షించారు. అనంతరం హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి నగరంలో శాంతి భద్రతలను సమర్థంగా నిర్వహించారు. నార్కోటిక్స్, సైబర్ క్రైమ్ నియంత్రణలో కీలక పాత్ర పోషించారు. 2025లో దుబాయ్‌లో జరిగిన వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో నార్కోటిక్స్ నియంత్రణలో ఉత్తమ ప్రతిభకు అంతర్జాతీయ అవార్డు అందుకున్నారు. ఇటీవల హోం శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీగా పనిచేసిన ఆయన, ఇప్పుడు రాష్ట్ర అత్యున్నత పోలీస్ హోదా డిజిపిగా బాధ్యతలు చేపట్టనున్నారు. మొత్తంగా 35ఏళ్ల సుదీర్ఘ సేవలో సాంకేతికత, పారదర్శకత, కఠిన పరిపాలనతో ముందుకు సాగే అధికారిగా సి.వి.ఆనంద్ పేరు పొందారు. 2028 జూన్‌లో ఆయన పదవీ విరమణ పొందనున్నారు.

## కుప్పకూలిపోయే దశలో ఇరాన్
# అందుకే హోర్ముజ్ తెరవమంటోంది:ట్రంప్



**వాషింగ్టన్ :** ఇరాన్ కుప్పకూలిపోయే దశలో ఉందని, అందుకే వీలైనంత త్వరగా హోర్ముజ్ జలసంధిని తెరవమని అడుగుతోందని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అన్నారు. తాము చేసిన మూడు దశల ప్రతిపాదనను అంగీకరిస్తే ఇస్లామాబాద్‌లో రెండో దశ చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా సోమవారం సందేశం పంపిన తర్వాత ట్రంప్ మొదటిసారి మంగళవారం పైవిధంగా స్పందించారు. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో సోమవారం ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి సమావేశం సందర్భంగా, అమెరికాకు కొత్త ప్రతిపాదనలు పంపిన విషయాన్ని ప్రస్తావించారు. చర్చలు పునఃప్రారంభించాలని అమెరికా ఎప్పుడు విజ్ఞప్తి చేస్తుందా? అని సమాధానం కోసం తాము ఎదురు చూస్తున్నామని అన్నారు. ఐక్యరాజ్యసమితికి కూడా అనేక డజన్లసంఖ్యలో దేశాలు తక్షణం హోర్ముజ్ జలసంధిని తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశాయి. దీంతో సమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ ఒక ప్రకటన చేస్తూ పరిస్థితి తీవ్రతను, దాని తక్షణ అవసరాన్ని కూడా అమెరికా, ఇరాన్ దృష్టికి తీసుకువచ్చారు. సత్వరం సమస్య పరిష్కరించుకోవాలని కోరారు. ప్రపంచ ఆహార అవసరాలు సంక్షోభంలో పడుతున్నాయని ఆయన హెచ్చరిక చేశారు. ఇరాన్ చేసిన ప్రతిపాదనలపట్ల ట్రంప్ ఎంతమాత్రం సంతోషంగా లేరని వైట్‌హౌస్ నుండి ఇప్పటికే అంతర్జాతీయ మీడియాకు సమాచారం అందింది. తమ జాతీయ భద్రతా బృందం ఈ ప్రతిపాదనలను ఇంకా పరిశీలిస్తోందని, అధ్యక్షుడు తర్వాత స్పందిస్తారని వైట్‌హౌస్ అధికారిక ప్రకటన చేసింది. ఈ దశలోనే గతంకంటే భిన్నంగా ఇరాన్ మంత్రి అరాఘ్చి మిత్రదేశాల మద్దతు కూడగట్టేందుకు తన దౌత్యచర్యలను మరింత ఉద్ధృతం చేశారు. ఇదిలాఉండగా మరోవైపు ఏప్రిల్ 17వ తేదీన ఇజ్రాయెల్–హెజ్బొల్లా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమలులోకి వచ్చిన తర్వాత కూడా మారణహోమం కొనసాగుతోంది.ఇప్పటికే లెబనాన్‌లో మృతులసంఖ్య 2,500పైగా దాటిపోగా, కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత మారణహోమంలో మరో 40 మంది మరణించారు.

## భానుడు ఉగ్రరూపం

(మొదటి పేజీ తరువాయి)

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, ఆదిలాబాద్ ప్రాంతంలో గత రెండ్రోజుల నుంచి 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారి తెలిపారు. 45.3 డిగ్రీలు దాటి వేడిగాలుల స్థాయిని మించి రికార్డు అవడంతో సోమవారం నుంచే తాము అలర్ట్ ప్రకటించామన్నారు. మగళవారం ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, నిజామాబాద్, నిర్మల్ వంటి జిల్లాల్లో వేడిగాలుల తీవ్రత కొనసాగుతోంది. దీంతో వాటికి తాము రెడ్ అలర్ట్ పెట్టినట్లు తెలిపారు.

**ఉత్తర జిల్లాల్లో ఉపరితల ఆవర్తనం :** అవి కాకుండా మిగిలిన ఉత్తర తెలంగాణ జిల్లాలు ఆరెంజ్ అలర్ట్‌లో ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. మధ్య జిల్లాలైన సిద్దిపేట, జనగాం, వరంగల్ వంటి వాటిల్లో 36 డిగ్రీల నుంచి 40 డిగ్రీల ఉష్ణోగ్రతలున్నాయన్నారు. మిగిలిన అన్నీ జిల్లాల్లో 41 డిగ్రీల వరకు ఉన్నట్లు తెలిపారు. ఉత్తర తెలంగాణ మీద ఉపరితల ఆవర్తనం కేంద్రికృతమై ఉంది. మరొక ద్రోణి కూడా రాయలసీమ, తమిళనాడు మీదుగా కొనసాగుతోంది. వీటివల్ల మనకు తేమ గాలులు వేడిగా ఉన్న భూమిపైకి ప్రవేశిస్తే రాగల నాలుగు రోజుల్లో థండర్ స్ట్రోమ్ కొనసాగనుందని వెల్లడించారు. 'ఒక్కోసారి క్యములోనింబస్ మేఘాల ఉధృతి నెట్టివేయడంతో అక్కడక్కడా వడగళ్ల వాన పడుతుంది. నగరాల్లో కాంక్రిటైజేషన్ ఎక్కువగా ఉండటం కారణంగా రాత్రి సమయాల్లో రీరేడియేషన్ ఎక్కువగా ఉంటుంది. దానివల్ల తీవ్రమైన ఉక్కపోత వేడిని ప్రస్తుతం చూస్తున్నాం' శ్రీనివాసరావు తెలిపారు. రాబోయే రోజుల్లో వర్షాలు కురిసినప్పటికీ ఉష్ణోగ్రతల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. చాలా వరకు జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ కొనసాగుతుందన్నారు. మరికొన్ని జిల్లాల్లో వర్షాలు ఉన్నప్పటికీ మళ్లీ ఆరెంజ్ అలర్ట్‌లోనే ఉంటాయని స్పష్టం చేశారు. ఈ వర్షాల వల్ల ఉష్ణోగ్రతల్లో పెద్దగా మార్పు కనిపించదని పేర్కొన్నారు. తేమ శాతం మాత్రం పెరుగుతుందన్నారు.

## జనంలోకి రండి

(మొదటి పేజీ తరువాయి)

విజ్ఞప్తి చేశారని, ఆయా గ్రామాల్లో సభలు పెట్టి తీర్మానాలు చేసి కలెక్టర్, మంత్రికి పంపాలని తెలిపారు. ఆయా గ్రామాలను ఫ్యూచర్ సిటీలో భాగం చేసే చర్యలు చేపడతామని, ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు.

**జూన్ 2లోగా పూర్తి కావాలి**

నాలుగో నగరంగా ఫ్యూచర్‌సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నామని, ఆదర్శ నగరాలతో పోటీపడేలా ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలని సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఫ్యూచర్ సిటీకి వచ్చే పెట్టుబడుల ఒప్పందాలు ఇక్కడే జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 2లోగా ఫ్యూచర్ సిటీ కార్యాలయం ప్రారంభించేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీలో నిర్వహించిన గ్లోబల్ సమిట్ ద్వారా ప్రపంచానికి విశ్వాసం కలిగిందన్న సిఎం సైబరాబాద్, హైటెక్ సిటీ, ఓఆర్‌ఆర్, విమానాశ్రయ నిర్మాణం మన కళ్ల ముందే అభివృద్ధి చెందాయని గుర్తుచేశారు. అభివృద్ధి ప్రాంతాలుగా తీర్చిదిద్దిన ఆనాటి నాయకులను కొంతమంది అవహేళన చేశారని అన్నారు.

**అద్భుతమైన నగరానికి పునాదులు**

దేశంలో ఏ నగరానికి లేనివిధంగా 160 కిలోమీటర్ల మేర ఓఆర్‌ఆర్ నిర్మించారని సిఎం గుర్తుచేశారు. ఫ్యూచర్ సిటీకి భూములిచ్చే రైతులను ఆదుకునే బాధ్యత తీసుకోవాలని అధికారులకు సూచించారు. చట్టపరంగా నోటిఫికేషన్లు, న్యాయపరమైన ప్రక్రియ ఇప్పటికే పూర్తి అయ్యిందన్న ఆయన భూమి ఇవాళ కాకపోతే రేపు అయినా ప్రభుత్వానికి బదిలీ అవుతుందని తెలిపారు. భూమి బదిలీ ఆగే అవకాశం లేదని, తాత్కాలికంగా వాయిదా పడవచ్చని చెప్పారు. ప్రభుత్వం తరఫున ప్రక్రియ జరిగినపుడే పరిహారం డబ్బులు తీసుకుంటే మరో చోట తక్కువ ధరకు భూములు వచ్చేవని రైతులనుద్దేశించి సిఎం అన్నారు. ఆలస్యమైతే ఎకరాల్లో భూసేకరణ జరిగితే పరిహారం డబ్బులతో గజాల్లో కూడా వేరే చోట భూమి రాదని పేర్కొన్నారు. బాధితుల పిల్లలకు స్కిల్స్ వర్సిటీలో నైపుణ్య శిక్షణ ఇచ్చే బాధ్యత తీసుకుంటామని, ప్రజాప్రతినిధులు బాధితులతో మాట్లాడి అభద్రతా భావాన్ని తొలగించాలన్నారు. అభివృద్ధికి భూములిచ్చిన రైతులను గౌరవించాలని, స్థానికులు సహకరిస్తే ప్రపంచంలోనే అద్భుత నగరానికి పునాదులు వేగంగా పడతాయని పునరుద్ఘాటించారు. ఫ్యూచర్ సిటీకి అత్యంత సమీపంలో రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌తో పాటు మూడు బుల్లెట్ ట్రైన్‌లు కూడా శంషాబాద్ నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లే విధంగా ట్రైన్ హాబ్‌తోపాటు బస్సు టెర్మినల్ తెచ్చుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రావిర్యాల ఓఆర్‌ఆర్ నుండి నుండి ఫ్యూచర్ సిటీ మీదుగా కంట్రోల్ ఎక్స్‌ప్రెస్ గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మించుకుంటున్నామని ఇది బెంగళూరుకు దూరం తగ్గించడంతోపాటు మరికొన్ని అణువుగా ఉంటుందని సిఎం రేవంత్ రెడ్డి వివరించారు. 'ఫ్యూచర్ సిటీని అధనాతనంగా అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దాలనేదే ఈ ప్రభుత్వ లక్ష్యం. చరిత్ర గురించి ఆలోచన చేసినప్పుడు హైదరాబాద్ నగరాన్ని కుతుబ్‌షాహీలు మొదలు పెట్టి అదే విధంగా గొల్కొండ యాదవ రాజులు, నిజాం సర్కార్ ఆ తర్వాత బ్రిటీష్ వారితో కలిసి నిర్మించిన సికింద్రాబాద్, మనం నిర్మించుకున్న సైబరాబాద్ ఈరోజు భారత్ ఫ్యూచర్ సిటీని తీర్చిదిద్దాలనుకుంటున్నాం. ప్రపంచంలో అభివృద్ధి చెందిన నగరాలను మనం ఆదర్శంగా తీసుకుంటున్నాం. ఎవరైతే అభివృద్ధి చెంది ఆదర్శంగా ఉంటారో వారితోనే పోటీ పడాలనేది మన ప్రభుత్వ విధానం' అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి, ఎస్ఐబి చీఫ్ సుమతి, ఎంఎల్‌ఏలు మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆర్కపూడి గాంధీ, ఫ్యూచర్ సిటీ డెవలప్మెంట్ అథారిటీ కమిషనర్ శశాంక, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి, ఫ్యూచర్ సిటీ కమిషనర్, జి సుధీర్ బాబు, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## ట్రంప్ అసంతృప్తి

(మొదటి పేజీ తరువాయి)

ఫాక్స్‌న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమెరికా విదేశీ వ్యవహారాల మంత్రి మార్కో రుబియో, ఇరాన్ ప్రతిపాదనలను తోసిపుచ్చినట్లు కనిపించారని పి.టి.ఐ వార్తాసంస్థ పేర్కొంది. ఐతే, ఇరాన్ కొత్తగా పంపించిన ప్రణాళికను ట్రంప్ జాతీయ భద్రతా బృందం పరిశీలిస్తోందని, ఈ సమస్యను ట్రంప్ తర్వాత పరిష్కరిస్తారని వైట్‌హౌస్ పేర్కొంది. మౌలికమైన అణు సమస్య ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉందని, 'రెడ్‌లైన్స్' అలాగే ఉండిపోయాయని మార్కో రుబియో అన్నారు. ''భవిష్యత్తు ఇరాన్‌లో కూడా మతఛాంధస ప్రభుత్వం అధికారస్థానంలో కొనసాగితే, ఏదో ఒక సందర్భంలో ఖచ్చితంగా వాళ్ళు అణ్వాయుధాన్ని కోరుకుంటారు,నాకు ఎలాంటి సందేహం లేదు'' అన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ వారికి అణ్వాయుధాన్ని దక్కనీయబోమన్నారు. మధ్యవర్తి పాకిస్థాన్ ద్వారా ఇరాన్ కొత్త ప్రతిపాదన అమెరికాకు చేరిందని అల్–మయాదీన్ శాటిలైట్ న్యూస్ ఛానల్ మొదట తెలియజేసింది.

ఇరాన్ అణ్వాయుధం తయారు చేయడానికి వీల్లేదని, ఇరాన్ వద్ద అణుపదార్థం ఉండకూడదని అమెరికా మొదటినుండీ వాదిస్తోంది. అణుపదార్థాన్ని తయారు చేసే హక్కు తమకు ఉందని, ఈ హక్కును వదులుకునేది లేదని ఇరాన్ వాదిస్తోంది. మొదటినుండీ ఇదే వారిమధ్య ప్రధాన వివాదంగా కొనసాగుతుండగా, యుద్ధ మొదలైన తర్వాత హోర్ముజ్ జలసంధి, అంతర్జాతీయ నౌకా వాణిజ్యం ప్రధానాంశంగా ముందుకు వచ్చి ఆ స్థానాన్ని ఆక్రమించింది. కానీ అణుపదార్థాన్ని తయారు చేసుకునే హక్కు విషయంపై చివరి అంశంగా మూడోదశలో చర్చించాలని ఇరాన్ చేసిన ప్రతిపాదన ట్రంప్‌కు నచ్చలేదని విశ్వసనీయ వర్గాలను పేర్కొంటూ సిఎన్ఎన్ పేర్కొంది. ఒమన్‌దేశంతో చర్చల అనంతరం ఇరాన్ విదేశీ వ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి ఈ ప్రతిపాదన చేశారు. హోర్ముజ్ జలసంధిని నౌకా వాణిజ్య రాకపోకలకోసం తెరవడం, ఇరాన్‌పై భవిష్యత్తులో శాశ్వత ప్రాతిపదికపై ఎలాంటి దాడులు జరగకుండా భద్రతా హామీ ఇవ్వడం మొదటి దశ చర్చలో షరతు కాగా, ఒమన్‌తో కలిసి హోర్ముజ్ జలసంధిని ఉమ్మడిగా నిర్వహించడం, అందుకు కొన్ని విధివిధానాలు రూపొందించడం రెండో దశ చర్చల అంశం. ఇరాన్ అణ్వాయుధం, యురేనియం తయారీ హక్కుల గురించి మూడోదశలో చర్చించాల్సి ఉంటుంది. ఇరాన్ అణుకార్యక్రమానికి సంబంధించిన సమస్యను తుది విడత చర్చలకు నెట్టివేయడంతో ట్రంప్ దీనిని సమ్మతించే అవకాశం లేదని సిఎన్ఎన్ పేర్కొంది. కాగా పశ్చిమాసియా పరిణామాలు, చర్చలపై ఫ్రాన్స్ విదేశీ వ్యవహారాలమంత్రి జీన్ నోయెబ్ బారో మాట్లాడుతూ, యుద్ధం ముగిసిపోవాలంటే, ఇరాన్ భారీస్థాయిలో రాయితీలు అమెరికాకు ఇచ్చుకోవాల్సిందేనన్నారు.

ఇదిలా ఉండగా ఇరాన్ విదేశీవ్యవహారాలమంత్రి అబ్బాస్ అరాఘ్చి మంగళవారం మరోసారి పాకిస్థాన్‌లో పర్యటించారు. దీంతో కేవలం 48 గంటల వ్యవధిలో ఆయన మూడుసార్లు పాకిస్థాన్‌లో పర్యటించినట్లయింది. అమెరికా–ఇరాన్ మధ్య ఏకైక అధికారిక మధ్యవర్తిగా గుర్తింపు పొందిన పాకిస్థాన్ ద్వారా అమెరికాకు తన డిమాండ్లను తెలియజేస్తున్నారు. ఒమన్ దేశ పర్యటనకు ముందుగా ఒకసారి, పర్యటన తర్వాత ఒకసారి, రష్యాలో పర్యటించి పుతిన్‌తో సమావేశం జరిపిన తర్వాత మరోసారి అబ్బాస్ అరాఘ్చి పాకిస్థాన్ వెళ్ళి ఆ దేశ ప్రధానమంత్రి, సైన్యాధిపతులతో చర్చలు జరిపారు.

**ఇరాన్ ఆయిల్ పంపింగ్ కుప్పకూలిపోతుంది: స్కాట్ బెస్సెంట్**

ఇరాన్‌లో చమురు బయటకు తీసే ఆయిల్ పంపింగ్ వ్యవస్థ త్వరలోనే కుప్పకూలిపోతుందని అమెరికా ఆర్థికమంత్రి స్కాట్ బెస్సెంట్ జోస్యం చెప్పారు. దిగ్బంధనం కారణంగా ఇరాన్ చమురు పరిశ్రమ తీవ్ర ఆర్థిక సంక్షోభంలో పడుతుందని అన్నారు. చర్చల్లో మంకుపట్టుతో ఉన్న ఇరాన్‌తో మెరుగైన ఒప్పందం చేసుకోవాలంటే ఆర్థికంగా ఆ దేశాన్ని దెబ్బ తీయాలని, వారు దిగొచ్చేదాకా ఎంతకాలమైనా హోర్ముజ్ జలసంధిలో ఇరాన్ ఓడరేవులను దిగ్బంధనం చేస్తామని స్కాట్ బెస్సెంట్ వారం రోజుల క్రితమే ప్రకటించారు. ఈ వ్యూహంలో భాగంగా ఆయన సరికొత్త హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్ విమానయాన సంస్థలతో ఎలాంటి లావాదేవీలు పెట్టుకోవద్దని, తమ మాటను ఉల్లంఘిస్తే ఆంక్షలకు గురికావాల్సి వస్తుందని ఎక్స్ వేదికగా ఆయన విదేశీ కంపెనీలకు హెచ్చరించారు. ఇప్పటివరకూ 40 నౌకలను హోర్ముజ్‌లోకి వెళ్ళకుండా, రాకుండా తరిమికొట్టామని చెప్పారు. దీనివల్ల ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోతుందని, అమెరికాకు వచ్చే నష్టమేమీ లేదని, ఐఆర్‌జిసి నాయకులు,సైనికులు మురుగునీటి పైపులో ఎలుకల్లా చిక్కుకుపోయారని, ఇరాన్ కూడా తన చమురు ఉత్పత్తిని స్తంభింపజేయడం ప్రారంభించిందని అన్నారు.

ఇదిలా ఉండగా, ఇరాన్ చమురు ఎగుమతులకు అతిముఖ్య కేంద్రమైన హోర్ముజ్‌కు సమీపంలో ఉన్న అతిచిన్న ఖర్గ్ ద్వీపం చమురు నిల్వలతో నిండిపోతోంది. ఈ ద్వీపం నుండి చమురు ఎగుమతులు గడచిన 15 రోజులుగా స్తంభించిపోయాయి. దీంతో ఒకవైపు ఉత్పత్తి జరుగుతుంటే, మరోవైపు ఓడలలోకి ముడి చమురు డ్రమ్ములను ఎగుమతి చేసే కార్యక్రమం మొన్నటివరకూ చకచకా కొనసాగేది. ఇప్పుడు ఎగుమతులు,ట్యాంకర్ల కదలిక నిలిచిపోవడంతో చమురు డ్రమ్ములతో ఖర్గ్ ద్వీపం నిండిపోతోంది. పోనీ చమురు వెలికి తీసే కార్యక్రమాన్ని నిలిపివేద్దామంటే అది జరిగేపనికాదు, ఎందుకంటే చమురు వెలికితీయడాన్ని ఆపేస్తే, భూగర్భంలో మార్పులతో ఆ తర్వాత కొత్త సమస్యలు తలెత్తుతాయి. అందువల్ల ''ఫ్లోటింగ్ స్టోరేజీ'' విధానం అమలు చేయాలని ఇరాన్ నిర్ణయించింది. సూపర్ ట్యాంకర్‌లను రప్పించి వాటిల్లోనే తాత్కాలికంగా నిల్వచేసే చర్యలకు పూనుకుంది. ఈ మేరకు 'నషా' సూపర్ ట్యాంకర్ ఖర్గ్ ద్వీపానికి చేరుతోంది.

స్కాట్ బెస్సెంట్ హెచ్చరికలపై ఇరాన్ ఉపాధ్యక్షుడు ఇస్మాయిల్ సాఘబ్ ఎస్ఫహానీ తీవ్రంగా స్పందించారు. తమ చమురు బావులకు నష్టం జరిగితే, గల్ఫ్‌దేశాలకు రెట్టింపు నష్టం కలగజేస్తామని హెచ్చరించారు.పార్లమెంటు స్పీకర్ ఘాలిబాఫ్ కూడా స్పందిస్తూ, హోర్ముజ్‌తోపాటు బాబ్ ఎల్ మండేబ్, ఇతర పైపులైన్లను కూడా మూసివేయగల సామర్థ్యం ఇరాన్‌కు ఉందని అన్నారు.

### తెలంగాణ టూరిజానికి కొత్త దిశ..

# వీకెండ్ కల్చరల్ షోలతో గ్లోబల్ హబ్ లక్ష్యం

## పర్యాటక సలహా కమిటీ సమావేశంలో మంత్రి జూపల్లి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ పర్యాటక రంగానికి కొత్త ఊపు తీసుకురావడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులకు స్పష్టమైన దిశా నిర్దేశం చేశారు.

బేగంపేట టూరిజం ప్లాజాలో మంగళవారం జరిగిన పర్యాటక సలహా కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పర్యాటక ప్రాజెక్టుల అభివృద్ధికి నిర్దిష్ట కాలపరిమితితో కూడిన ప్రణాళికలు సిద్ధం చేయాలని, అమలులో ఆలస్యం లేకుండా ప్రతి ప్రాజెక్టుకు బాధ్యత వహించే నోడల్ అధికారులను నియమించాలని సూచించారు. దేశీ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేందుకు హైదరాబాద్‌లో నవంబర్ లేదా డిసెంబర్ నెలల్లో భారీ స్థాయిలో కార్నివాల్ నిర్వహణపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు.

ప్రారంభంలో ప్రభుత్వమే ఈ కార్యక్రమాన్ని చేపట్టినా, తరువాత ప్రైవేట్ భాగస్వామ్యంతో స్వయం సమృద్ధిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, తాత్కాలిక వసతి గదులు, టెంట్లు, గ్లాస్ హౌస్‌లు, రహదారి పక్కన విశ్రాంతి కేంద్రాలను అభివృద్ధి చేయాలని చెప్పారు. పర్యాటక కేంద్రాల్లో ప్రతి వారాంతంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

సోమశిల, వరంగల్, రామప్ప, యాదాద్రి, గోల్కొండ, తారామతి బరాదరి, నాగార్జునసాగర్ వంటి ప్రముఖ ప్రాంతాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. జిహెచ్‌ఎంసి, హెచ్‌ఎండిఎల సమన్వయంతో నగర సుందరీకరణలో భాగంగా శిల్పాలు, ల్యాండ్‌స్కేపింగ్, స్కైవాక్‌లను అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. స్పెషల్ చీఫ్ సెక్రటరీ వాణి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక వనరులు సమృద్ధిగా ఉన్నప్పటికీ ప్రచారంలో వెనుకబడి ఉన్నామని, బ్రాండింగ్‌పై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. కెరావాన్ టూరిజం, హరిత హోటళ్ల నిర్మాణం, వారసత్వ కట్టడాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణను అంతర్జాతీయ వెడ్డింగ్ డెస్టినేషన్‌గా అభివృద్ధి చేయడంతో పాటు మెడికల్, వెల్నెస్, ఫిలిం, ఎకో టూరిజం రంగాల్లో ప్రోత్సాహం కల్పించాలని కమిటీ సభ్యులు సూచించారు.

మధ్యప్రాచ్యం, సెంట్రల్ ఆసియా దేశాల్లో విస్తృత ప్రచారం చేపట్టాలని, పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీ గౌతమి, టూరిజం డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్లు విస్తరించాలి

## సిఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి లేఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా అప్రోచ్ రోడ్ల విస్తరణ, పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం అవసరమైన భూమి కేటాయింపు, సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ అప్రోచ్ రోడ్డు విస్తరణకు అన్ని రకాల సహాయ సహకారాలను తక్షణమే అందించాలని కేంద్ర బొగ్గుగణుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డికి మంగళవారం లేఖ రాశారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ కొత్త టెర్మినల్ నుంచి ప్రతి రోజూ కొన్ని పదుల సంఖ్యలో రైళ్ల సేవలు అందిస్తున్నాయని, తద్వారా ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరిగిందని, అందుకే ఈ రైల్వేస్టేషన్ కు వెలుపల ఇరువైపులా ప్రయాణికులు, వాహనాలు రైల్వేస్టేషన్‌కు సులభంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా అప్రోచ్ రోడ్లను విస్తరించాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎఫ్‌సిఐ గోడౌన్ రోడ్డు నుండి కొత్తగా నిర్మించిన స్టేషన్ బిల్డింగ్ వైపు 200 అడుగుల వెడల్పుతో రోడ్డును విస్తరించాలని, భరత్ నగర్ వైపు (ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకు పక్కగా) నుండి చర్లపల్లి స్టేషన్ కు వచ్చే రహదారిని అభివృద్ధి చేయాలని, ప్రస్తుతం ఉన్న 30 అడుగుల రహదారిని కనీసం వంద అడుగుల వెడల్పుతో విస్తరించాలని, ఇసి నగర్ ప్రధాన రహదారి నుండి స్టేషన్‌ను చేరుకునే ఈ రోడ్డును కనీసం 100 మీటర్ల వెడల్పుతో 700 మీటర్ల పొడవున విస్తరించాలని కోరారు. చర్లపల్లి స్టేషన్ కొత్త బిల్డింగ్ వైపు 3 ఎకరాలు, ఎంఎంటిఎస్ ప్లాట్ ఫామ్ వైపు 2.70 ఎకరాల అదనపు భూమిని పార్కింగ్ తదితర అవసరాల నిమిత్తం కేటాయించాలని ఆ లేఖలో కోరారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో, అత్యాధునిక సౌకర్యాలతో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ను పునరాభివృద్ధి చేస్తున్న నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఉత్తరం వైపు టెర్మినల్‌ను చేరుకునేందుకు వీలుగా ఆల్ఫా హోటల్ నుండి రేతిఫైల్ బస్టాండ్ వరకు ఉన్న రహదారిని 120 అడుగుల వెడల్పుతో విస్తరించాలనికోరారు. ఈ విషయమై గత సిఎం కు 15 జూన్, 2022న, 07 మార్చి, 2023న రెండు ఉత్తరాలు రాసినా పనులు ప్రారంభంకాలేదని కిషన్ రెడ్డి ఆ లేఖలో పేర్కొన్నారు.

# జూన్ 1కి మార్కెట్‌లో 'ప్రైవేటు పాఠశాల' పుస్తకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో రానున్న '2026–27 విద్యా సంవత్సరాని కి' సంబంధించిన పాఠ్యపుస్తకాల ముద్రణ, పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లనూ పూర్తిచేసింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేటు పాఠశాల విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను జూన్ 1వ తేదీ నాటికి బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో పెట్టనున్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పార్ట్ 1 కింద మొత్తం 1.35,70,155 ఉచిత పుస్తకాలు అవసరమవ్వగా, ఇందులో ఇప్పటికే 1,10,26,229 పుస్తకాలను జిల్లా కేంద్రాల కు 'ప్రభుత్వ పాఠ్యపుస్తక ముద్రణాలయ' సంస్థ సరఫరా చేసింది. మిగిలిన పుస్తకాల ను కూడా మే 10 వ తేదీ నాటికి సరఫరా చేయనున్నట్టు పాఠ్య పుస్తక ముద్రణాలయం మంగళవారం ప్రకటించింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 81 శాతం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను సరాఫరా చేశారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే సమయానికి పాఠ్యపుస్తకాలు అందుబాటులో ఉంటాయని స్పష్టం చేసింది. గత ఏడాది ఏప్రిల్ చివరి వారంలో టెండర్ల ప్రక్రియ పూర్తవ్వగా, వేసవి సెలవుల అనంతరం పాఠశాలలో పుస్తకాలను అందుబాటులోనికి తీసుకొచ్చా రు. కాగా ప్రభుత్వ పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా జగిత్యాల, భద్రాద్రికొత్తగూడెం, వికారాబాద్ జిల్లాల్లో 90శాతం పంపిణీ చేశారు. యాదాద్రి జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు పుస్తకాల సరఫరా చేయలేదు.

# ప్రభుత్వ డిజిటల్ ప్రాజెక్ట్‌లో అక్రమాలు

## ప్రైవేట్ కంపెనీపై క్రిమినల్ కేసు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ డిజిటల్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన డేటా హ్యాండోవర్‌ను అడ్డుకోవడం, డిజిటల్ ఆస్తుల దుర్వినియోగం వంటి తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో ప్రైవేట్ సంస్థపై తెలంగాణ ప్రభుత్వం క్రిమినల్ కేసు నమోదు చేసింది. ఈ కేసును సిసిఎస్ పోలీసులు నమోదు చేసి దర్యాప్తును వేగవంతం చేశారు. ఐటి కమ్యూనికేషన్స్ శాఖలోని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ (ఇఎస్‌డి) విభాగం ఫిర్యాదు మేరకు ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతో పాటు దాని ఎండి, సిఇఒ శ్రీనివాసరావు కాటూరిపై కేసు నమోదైంది. ఎకనామిక్ ఆఫెన్సెస్ వింగ్‌కు చెందిన ఎసిపి ఏ. రామ్ రెడ్డి ఈ కేసును దర్యాప్తు చేస్తున్నారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి 2017 జనవరిలో జారీ చేసిన వర్క్ ఆర్డర్ ప్రకారం ఈ సంస్థను ప్రభుత్వ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అభివృద్ధి, నిర్వహణ కోసం నియమించారు. ఈ ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం సుమారు రూ.70 లక్షలు ఖర్చు చేయడంతో పాటు, అనంతరం నెలవారీ నిర్వహణ చార్జీలు కూడా చెల్లించింది. ఒప్పందం ప్రకారం గడువు ముగిసిన తర్వాత ప్రాజెక్ట్‌కు సంబంధించిన మొత్తం డేటా, సోర్స్ కోడ్, డిజిటల్ ఆస్తుల హక్కులు ప్రభుత్వానికి చెందాలి. అయితే మూడు సార్లు పొడిగింపు పొందిన ఈ ప్రాజెక్ట్ గడువు 2025 మే 31తో ముగిసినప్పటికీ, సంస్థ కొత్తగా ఎంపికైన సంస్థకు డేటా బదిలీ చేయకుండా అడ్డంకులు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. పారదర్శక టెండర్ ప్రక్రియలో పుర్వ్యా ఇండియా కన్సల్టింగ్, సెర్వీస్ ఎల్‌ఎల్‌పి సంస్థ ఎల్1గా ఎంపికైంది. ఈ ప్రక్రియలో పాల్గొన్నప్పటికీ, ఎంపిక కాలేకపోయిన తరువాత ట్రాన్సాక్షన్ అనలిస్ట్స్ సంస్థ సహకారం నిలిపివేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ డేటాను తమదిగా చూపించే ప్రయత్నం చేయడం, యూజర్ డేటాను ప్రైవేట్ అప్లికేషన్‌కు మళ్లించే యత్నం, నిధుల దుర్వినియోగం వంటి ఆరోపణలు కూడా ఉన్నాయని తెలిపారు. ముందుగా డేటా హ్యాండోవర్ చేస్తామని అంగీకరించినప్పటికీ, ఆ హామీని నిలబెట్టుకోలేదని వెల్లడించారు. ఈ కేసులో భాగంగా సంస్థకు చెందిన ప్రస్తుత, మాజీ ఉద్యోగులకు నోటీసులు జారీ చేయగా, చీఫ్ ఆఫ్ ప్రాజెక్ట్స్‌గా పనిచేస్తున్న ఎం. శ్రీనివాసులను ఏప్రిల్ 25న పోలీసులు అరెస్ట్ చేశారు. ఇక ఎండి శ్రీనివాసరావు కాటూరి, ప్రాజెక్ట్ మేనేజర్ కిరణ్ కుమార్ పరారీలో ఉన్నట్లు సమాచారం. వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇక ఒప్పంద నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో సంస్థపై జరిమానాలు, బ్లాక్‌లిస్టింగ్, నష్టపరిహారం వసూలు వంటి చర్యలను ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రజా ఆస్తులను దెబ్బతీసే చర్యలపై ఎలాంటి ఉపేక్ష ఉండదని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# పదేళ్ల పరిపాలనలో...యాభై ఏండ్లు వెనక్కి

## టిపిసిసి సేవాదళ్ శిక్షణ శిబిరంలో బి.మహేష్‌కుమార్ గౌడ్ విమర్శ




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్ఎస్ అధినేత, మాజీ సిఎం కెసిఆర్ తెలంగాణను పదేళ్లు పరిపాలించి రాష్ట్రాన్ని యాభై ఏండ్లు వెనక్కి నెట్టారని టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్‌కుమార్ గౌడ్ విమర్శించారు. పదేండ్లు ఆదరించి అవకాశమిచ్చిన బిఆర్ఎస్‌ను ఇప్పుడు ప్రజలు ఆదరించే పరిస్థితి లేదన్నారు. బిఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదన్నారు. కెసిఆర్ కుటుంబం వివాదంలో సతమతం అవుతున్నారని, ప్రజల గురించి పట్టించుకోకుండా పదవుల గురించి పాకులాడుతున్నారన్నారు. హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవదళ్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన 'సమర్థ శిక్షణ శిబిరాన్ని' మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచే విధంగా మోదీ ప్రభుత్వం వ్యవస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. కేంద్రంలో బిజెపి అవలంభిస్తున్న ధోరణిని సేవాదళ్ ఎండగట్టాలన్నారు. కెసిఆర్ కూతురు కవిత ప్రశ్నలకు పదేండ్లు సిఎంగా పనిచేసిన కెసిఆర్ సమాధానం చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. తెలంగాణ ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని, తెలంగాణ నిర్మాణం క్రెడిట్ అంతా సోనియాగాంధీకి దక్కుతుందన్నారు. క్షేత్రస్థాయిలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని ఆయన పిలుపునిచ్చారు. పార్టీ విధివిధానాలు, క్రమశిక్షణ, సేవా దృక్పథంపై ప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం, రానున్న రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడానికి, పార్టీ సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ఈ శిక్షణా శిబిరంలో చర్చించడం సంతోషకరమన్నారు. టిజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి సేవాదళ్ వెన్నెముక వంటిదని, కాంగ్రెస్ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో సేవాదళ్ కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. క్షేత్రస్థాయిలో నాయకత్వ లక్షణాలను ఎలా పెంపొందించుకోవాలనే అంశంపై ఈ శిబిరంలో వక్తలు దిశానిర్దేశం చేశారు.

# ఉద్యోగుల వేతన కమిటీ నియామకంపై జెఎసి హర్షం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆర్‌టిసి ఉద్యోగుల వేతన కమిటీ నియామకంపై జెఎసి హర్షం వ్యక్తం చేశారు. ''ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డిని సోమవారం కలిసి సన్మానించి, సమ్మె సందర్భంగా జరిగిన ఒప్పందం మేరకు 2021 వేతన సవరణ ప్రక్రియను ప్రారంభించవలసిందిగా జెఎసి కోరింది. దానికి స్పందించిన ఎండి మంగళవారం వేతన సవరణకు అధికారులతో కూడిన పే కమిటీని నియమించారు. పే కమిటీలో కె.గీత, డిప్యూటీ సిఎఓ (ఎస్.పి.ఎ, సిఇ), సమీరా అఫ్రీన్, డిప్యూటీ సిపిఎం (ఐటి), వై.శిరీష, డిప్యూటీ సిపిఎం (ఐఆర్, డబ్ల్యు, ట్రైనింగ్) లను పే కమిటీగా నియమించారు. వారు మే 10వ తేదీ లోపు 2021 వేతన సవరణకు సంబంధించి కొత్త స్కేల్స్‌ను రూపొందించటంతో పాటు వేతన సవరణ విధి విధానాలను రూపొందించాలని ఫైనాన్షియల్ అడ్వైజర్‌తో పాటు చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ ఆమోదంతో మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశించారు. తాము చేసిన విజ్ఞప్తిని వెనువెంటనే అమలు చేసినందుకు జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం డి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరిలు హర్షం వ్యక్తం చేశారు. అలాగే మిగతా అంగీకరించిన అంశాలను కార్మికుల శ్రేయస్సు దృష్ట్యా తక్షణమే అమలు చేయాలి'' అని జెఎసి నాయకులు కోరారు.

# హరీశ్ రావు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నాడు

## ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మాజీ మంత్రి హరీశ్ రావు మతిస్థిమితం కోల్పోయి మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి బల్మూర్ వెంకట్ ఆరోపించారు. హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడుతూ 'సచ్చిపోయిన బిఆర్ఎస్‌ను బతికించుకోవాలా? అసలు బిఆర్ఎస్ రాష్ట్రంలో బతుకుతదా లేదా? లేకుంటే బిజెపిలోకైనా వెళ్లాలా? వద్దా ? ఇలా దిక్కుతోచని స్థితిలో హరీశ్‌రావు కొట్టుమిట్టాడుతున్నాడని, ఏం చేయాలో తోచక పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నాడు' అని ఎద్దేవా చేశారు. గత పదేళ్లు అధికార మదంతో అధికారులతో మీరు అందరి ఫోన్లు ట్యాప్ చేయించారని, అదే ధ్యాసతో ప్రజా ప్రభుత్వం చేస్తోందని మతిలేని మాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. మీ సొంత కుటుంబ సభ్యుల ఫోన్లు కూడా ట్యాప్ చేయించిన నీచమైన చరిత్ర మీది అని మండిపడ్డారు. మీ మరదలు కవితనే బయటకొచ్చి ఆరోపణలు చేస్తోంది కదా? ఆమె ఆరోపణలకు సమాధా నం చెప్పే ధమ్ము, ధైర్యం లేదా అని ఎద్దేవా చేశారు.ప్రజాపాలనను ఓర్వలేక హరీష్ రావు విషం చిమ్ముతూ నోటికొచ్చినట్లు మాట్లాడితే ప్రజలు నమ్మే పరిస్థితి లేదని, మీరు చెప్పే మాటలు నమ్మకనే, ప్రజలు మిమ్మల్ని ఓడించారని గుర్తుచేశారు. హరీశ్ రావు మాటతీరు మార్చుకోకపోతే ప్రజలు తన్ని తరిమేసే పరిస్థితి త్వరలోనే వస్తుందని బల్మూర్ వెంకట్ పేర్కొన్నారు.

# కొరియర్ ఫ్రాంచైజీ పేరుతో మోసం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రకటనలతో ఆకర్షించి కొరియర్ ఫ్రాంచైజీ పేరుతో లక్షల రూపాయలు మోసం చేసిన కేసు హైదరాబాద్‌లో బయటపడింది. ఈ మేరకు సిసిఎస్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. బాచుపల్లి నివాసి వ్యాపారవేత్త పోలిసెట్టి శివాజీ (49) ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం 2024లో ఇన్‌స్టాగ్రామ్‌లో ఉర్బండట్ కార్గో కొరియర్ సర్వీసెస్ పేరిట ఫ్రాంచైజీ వ్యాపార అవకాశం అంటూ వచ్చిన ప్రకటనను చూసి సంప్రదించారు. ప్రకటనలో ఇచ్చిన ఫోన్ నంబర్లకు కాల్ చేయగా, సోమజిగూడలోని జేడ్ టవర్స్ కార్యాలయానికి రావాలని సూచించారు. దీంతో 2024 డిసెంబర్ 27న తన వ్యాపార భాగస్వామి వి. రాజశేఖర్‌తో కలిసి కార్యాలయానికి వెళ్లగా, రవీందర్‌నాథ్ రాపర్ల చౌదరి తనను సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా పరిచయం చేసుకుని వ్యాపార వివరాలు వివరించాడు. లాభాలు వచ్చే వరకు పూర్తి సహాయం అందిస్తామని, అవసరమైన పరికరాలు (ప్రింటర్, స్కానర్, వెయింగ్ మెషీన్ మొదలైనవి) 45 రోజుల్లో అందిస్తామని హామీ ఇచ్చి వారిని ఆకట్టుకున్నాడు. దీంతో ఖమ్మం, రాజమండ్రి, పటాన్‌చెరువు ప్రాంతాల్లో మూడు ఫ్రాంచైజీల కోసం ఒక్కొక్కటి రూ.7.50 లక్షల చొప్పున మొత్తం రూ.22.50 లక్షలు చెల్లించినట్లు శివాజీ తెలిపారు. ఈ మొత్తం చెక్కులు, ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ల రూపంలో చెల్లించినట్లు పేర్కొన్నారు. అయితే డబ్బులు తీసుకున్న తరువాత ఎలాంటి హామీలు నెరవేర్చలేదని, కేవలం రూ.2 లక్షలు మాత్రమే తిరిగి ఇచ్చి మిగతా మొత్తంపై స్పందించడం మానేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. పలుమార్లు సంప్రదించినా వివిధ సాకులు చెబుతూ తప్పించుకున్నాడని, చివరకు కాల్స్, మెసేజ్‌లకు స్పందించడాన్ని కూడా ఆపేశాడని తెలిపారు. తద్వారా, ఇదే విధంగా మరికొందరు బాధితుల నుండి కూడా భారీ మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్లు తెలిసిందని చెప్పారు. మొత్తం 18 మంది బాధితుల నుండి సుమారు రూ.96.86 లక్షలు మోసం చేసినట్లు ఆరోపించారు. ఈ ఫిర్యాదు మేరకు సిసిఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును ఇఒడబ్ల్యూ టీమ్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ జె. భాస్కర్‌కు దర్యాప్తు కోసం అప్పగించారు.

# రైతులు చల్లగా ఉంటే బిఆర్ఎస్ ఓర్వలేకపోతోంది

## ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రైతులు చల్లగా ఉంటే బిఆర్ఎస్ నాయకుఉల చూసి ఓర్వలేకపోతున్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సిఎల్‌పి కార్యాలయంలో మంగళవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ రైతు కోసం బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రూ.2,88,670 కోట్లు ఖర్చు చేస్తే, తమ ప్రభుత్వం వచ్చిన అనంతరం 28 నెలల్లో ఏకంగా రూ.1,52,656 కోట్లను ఖర్చు చేసిందని తెలిపారు. ధాన్యం కొనుగోలు చేయడం లేదని కెసిఆర్ ఆరోపణలు చేస్తున్నారని, అసలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రవేశపెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. రాష్ట్రంలో మొత్తం 8525 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పా టు చేస్తున్నామని, ఇప్పటికే 6005 కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోళ్ల ప్రక్రియ కొనసాగిస్తున్నామని వెల్లడించారు. బిఆర్ఎస్ హయాంలో ధాన్యం కొనుగోళ్లు ఎలా జరిగాయో అందరికి తెలుసని, తాలు పేరుతో కిలోల కోత విధించిన అంశా న్ని వారు మరిచిపోయారని పేర్కొన్నారు. పదేళ్ల పాపపు పాలనలో భాగస్వామ్యం అయినందుకు క్షమాపణలు చెపుతానని స్వయంగా కవితే పేర్కొంటున్నారని, దీనిపై ముందు బిఆర్ఎస్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# పెట్రోల్, డీజిల్‌కు కొరతలేదు : మల్లు రవి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్‌కు ఏలాంటి కొరతలేదని ఎంపి, పెట్రోలి యం మంత్రిత్వ శాఖ పార్లమెంటరీ సభ్యులు మల్లు రవి తెలిపారు. సచివాలయం మీడియా పాయింట్ వద్ద మంగళవారం ఆయన మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్, తమిళనాడు ఎన్నికల తర్వాత కేంద్రం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచనుందని పుకార్లు రావడంతో ప్రజలు అవసరం లేకున్నా ఎక్కువ కొనుగోలు చేస్తున్నారని, దీంతో కొరత ఏర్పడిందని ఆయన వెల్లడించారు.

ప్రజల అవసరాల మేరకు రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని తెలిపారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, ఎవరైనా బ్లాక్ మార్కెటింగ్ చేస్తే ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని మల్లు రవి హెచ్చరించారు.

# కొడుకులకు ఉరివేసి ఆత్మహత్య చేసుకున్న తండ్రి

**ప్రజాపక్షం/మహబూబాబాద్–/తొర్రూర్:** భార్య భర్తల మధ్య నెలకొన్న కలహాలు అభం శుభం తెలియని ఇద్దరు చిన్నారి కొడుకులను బలితీసుకుంది. చివరకు ఆవేశంలో తండ్రి కూడా ఆ కన్నకొడుకులతో సహా తండ్రి ఆత్మహత్య చేసుకున్నారు. ఈ హృదయ విదారక సంఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ పట్టణ శివారులో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే అమ్మాపురం గ్రామానికి చెందిన కిన్నెర గుంశావలి అనే వ్యక్తి కుటుంబ కలహాల కారణంగా తీవ్ర మనస్థాపానికి గురై, తొర్రూర్ మార్కెట్ సమీపంలో కాలీఫ్లవర్ తోటలో ఉన్న వేపచెట్టుకు తన ఇద్దరు కొడుకులను ఉరివేసి అనంతరం తాను కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది. సంఘటన చూసినవారు ఆ ఇద్దరు చిన్నారులను చూసి కంటతడి పెట్టుకున్నారు. సమాచారం అందుకున్న వెంటనే తొర్రూర్ సీఐ గణేష్, ఎస్సై ఉపేందర్ సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. వ్యవసాయ మార్కెట్ ఎదురుగా ఉన్న కాలీఫ్లవర్ పొలంలోని వేప చెట్టుకు ముగ్గురూ ఉరివేసుకున్నట్లు గుర్తించారు. పోలీసులు మృతదేహాలను కిందికి దించి పోస్టుమార్టం కోసం ఆసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కుటుంబ కలహాలే ఈ దారుణ సంఘటనకు కారణమై ఉంటాయని పోలీసులు భావిస్తున్నారు.

# అన్ని రకాలుగా రైతులకు మోసం

## భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్



**ప్రజాపక్షం/హనుమకొండ :** రాష్ట్ర రైతాంగాన్ని అన్ని రకాలుగా కాంగ్రెస్ మోసం చేస్తున్నదని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా బిఆర్ఎస్ నేతలతో సమావేశం నిర్వహించిన కెటిఆర్ పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు వంటి కార్యక్రమాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర రైతాంగాన్ని అన్ని రకాలుగా మోసం చేసిందని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. వరంగల్‌లో రైతు డిక్లరేషన్ పేరిట నాలుగు సంవత్సరాల కిందట అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చి రెండున్నర సంవత్సరాలు దాటినా ఇప్పటికీ ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా తన కపట మోసాన్ని కొనసాగిస్తున్నదని విమర్శించారు. స్వయంగా కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వరంగల్ డిక్లరేషన్ పేరిట తెలంగాణ రైతన్నలను మోసం చేసిన మే 6వ తేదీని పురస్కరించుకొని, కాంగ్రెస్ చేసిన మోసాన్ని ప్రజలకు గుర్తు చేసేలా రైతన్నలతో ఒక సమావేశాన్ని నిర్వహించనున్నట్లు వరంగల్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ ప్రకటించింది. సమావేశానికి హాజరు కావాలని కెటిఆర్‌ను ఆహ్వానించింది. ఈ కాంగ్రెస్ మోసాలకు వ్యతిరేకంగా జరిగే రైతుల సమావేశానికి తాను హాజరవుతానని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయరంగంలో ఎరువుల కొరత, విత్తనాల కొరత, ధాన్యం కొనుగోళ్లలో తీవ్రమైన సంక్షోభం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లా పార్టీ నేతలతో జరిగిన సమావేశంలో కెటిఆర్ పార్టీ నేతలకు దిశా నిర్దేశం చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ నేతలు కేటీఆర్‌కు పలు వివరాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ సభ్యత్వ నమోదు, కమిటీల ఏర్పాటు వంటి సంస్థాగత అంశాలపై కెటిఆర్ కీలక సూచనలు ఇచ్చారు. త్వరలో జరగనున్న గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహంపై కూడా నేతలు సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం మీడియాతో ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు మాట్లాడారు.

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

**NIT No.** 06/EE/Circle-36/KZ/GHMC/2026-27, తేది: 27.04.2026, **పని పేరు:** 1 పని, ఫుట్‌పాత్ వర్క్, **అంచనా విలువ / ఇసివి:** రూ.6.80లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం:** 1 పని కొరకు ప్రారంభ తేది: 28.04.2026 సా.4.30గం.లకు / ఆఖరి తేదీ : 30.04.2026 సా.4.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, కెజెడ్, జిహెచ్‌ఎంసి, ఖైరతాబాద్. ఫోన్.9989930414. కమిషన్, జిహెచ్‌ఎంసి. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ @https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-36, (కెజెడ్), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1554-PP/CL/ADVT/2026-27, Date: 28-04-2026

వికారాబాద్ మున్సిపల్ కౌన్సిల్ :: వికారాబాద్ జిల్లా
E mail : vikarabadmuncipality@gmail.com: Fax : 08416253429, phone : 08416252128, 08416200079.

నెం. MCV/EOI/03/2026-27 — ఆసక్తి వ్యక్తీకరణ — తేదీ : 27.04.2026

వికారాబాద్ మున్సిపాలిటీలో మున్సిపల్ జనరల్ ఫండ్స్ పరిధిలో 2026-27 మున్సిపల్ కమిషనర్ మరియు మున్సిపల్ చైర్‌పర్సన్ కోసం ఫోర్ వీలర్ వెహికిల్‌ను అద్దెకు తీసుకోవడానికి అయ్యే ఖర్చులను (డ్రైవర్ వేతనాలు సహా, ఇంధనం) కోసం స్థానిక ఏజెన్సీలు / ట్రావెల్స్ / ఆథరైజ్ కాంట్రాక్టర్స్ నుండి సీల్డ్ కొటేషన్లు ఆహ్వానించబడ్డాయి. ఏజెన్సీలు / ట్రావెల్స్ / ఆధీకృత కాంట్రాక్టర్లు 30.04.2026 తేదీ లోపు తప్పక సీల్డ్ కొటేషన్లను సమర్పించాలి. తెలంగాణ ప్రభుత్వం ఫైనాన్స్ (DCM) డిపార్ట్‌మెంట్ వారి సర్క్యులర్ మెమో నెంబర్. 826/29/A2/DCM/2017, తేదీ: 16.06.2017 ప్రకారం, ఏజెన్సీ కోట్ చేసిన రేట్ నెలకు రూ.33,000/- కంటే తక్కువ లేదా సమానంగా ఉండాలి. అన్ని పత్రాల ధృవీకరణ తర్వాత అత్యల్ప కొటేషన్ ఇచ్చిన ఏజెన్సీని ఖరారు చేయడం జరుగుతుంది.
1) RTO, TS జారీ చేసిన ట్యాక్సీ నెంబర్‌తో పాటు రిజిస్ట్రేషన్‌ను కాపీని ఏజెన్సీ తప్పకుండా సమర్పించాలి.
2) గవర్నమెంట్ డ్యూటీ కోసం అద్దెకు తీసుకున్న వాహనం యజమాని ప్రతీ ఆరు నెలలకు పొల్యూషన్ కంట్రోల్ సర్టిఫికెట్ మరియు ప్రతీ సంవత్సరానికీ ఇన్సూరెన్స్ సర్టిఫికెట్ తప్పక సమర్పించాలి.
3) ప్రభుత్వ డ్యూటీ కోసం అద్దెకు తీసుకున్న వాహనం యజమాని అద్దెకు దరఖాస్తు చేసుకునేటప్పుడు చెల్లుబాటు అయ్యే పత్రాలైన పర్మిట్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, టాక్సీ మొదలైన వాటిని తప్పక సమర్పించాలి.
4) ప్రభుత్వ డ్యూటీ కోసం అద్దెకు తీసుకున్న వాహనం యజమాని నియమించబోయే డ్రైవర్ యొక్క బ్యాడ్జ్‌తో కూడిన ప్రొఫెషనల్ డ్రైవింగ్ లైసెన్స్‌ను కూడా తప్పక సమర్పించాలి.
5) ఏజెన్సీ GST Certificate ను తప్పక సమర్పించాలి.
మరిన్ని వివరాల కోసం పని వేళల్లో మున్సిపల్ కమిషనర్‌ను 9849905910 నెంబర్‌లో సంప్రదించగలరు.

To,
The Notice board, vikarabad muncipality.

Sd/- మున్సిపల్ కమిషనర్
వికారాబాద్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 1549-PP/CL/ADVT/2026-27, Date: 28-04-2026

## మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డికి బెయిలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన డ్రగ్స్ కేసులో నిందితుడిగా ఉన్న బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. రూ.25 వేల వ్యక్తిగత బాండ్ సమర్పించడంతో పాటు అదే మొత్తానికి ఇద్దరు పూచీకత్తులు ఇవ్వాలని, పోలీసులు చార్జిషీట్ వేసే వరకు లేదా ఎనిమిది వారాల పాటు ప్రతి బుధ వారం ఎస్‌హెచ్‌వో ఎదుట హాజరుకావాలని, దర్యాప్తుకు సహకరించాలని, పోలీసులు కోరితే హాజరుకావాలని ఆదేశించింది. పాస్‌పోర్టును పోలీసు లకు అప్పగించాలని షరతు విధించింది. మొయినాబాద్‌లో తనపై తప్పుడు డ్రగ్స్ కేసు నమోదు చేశారని పేర్కొంటూ బెయిల్ కోరుతూ రోహిత్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ కె. సుజన మంగళవారం విచారించారు. కేసు విచారణ పూర్తయినా పిటిషనర్ జైల్లోనే ఉన్నారని, బెయిల్ ఇవ్వాలని లాయర్ కోరారు. దీనిపై పోలీసుల తరఫున పీపీ వాదిస్తూ, కాల్పులు జరి పారన్న తీవ్ర ఆరోపణలు ఉన్నందున బెయిల్ ఇస్తే కఠిన షరతులు విధిం చాలని కోరారు. ఇప్పటికే పోలీసుల కస్టడీ విచారణ జరిగినందున బెయిల్ మంజూరు చేస్తున్నట్లు న్యాయమూర్తి ప్రకటించారు.

## విచారణ వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అమెరికా కోర్టులో కేసు నమోదు తర్వాత ఎఫ్ ఐబి ఇచ్చిన రెడ్‌కార్నర్ నోటీసును సవాలు చేస్తూ కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ కెవిపి రామచందర్‌రావు వేసిన పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారించింది. రెడ్ కార్నర్ నోటీసును రద్దు చేయాలన్న పిటిషన్‌లో రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రతివాదిగా చేర్చడంపై తెలంగాణ రాష్ట్రం అభ్యంతరం చెప్పింది. దీనిపై కౌంటర్ వేస్తామని చెప్పడంతో విచారణ జులై 17కి వాయిదా వేస్తూ జస్టిస్ తుకారాంజి ఉత్తర్వులు జారీ చేశారు. టైటానియం లీజులకు సంబంధించి స్విట్జర్లాండ్‌కు చెందిన బౌల్టీ ట్రేడ్ ఎజి కంపెనీతో కుదిరిన ఒప్పందంపై ఎఫ్‌బీఐ అమెరికా కోర్టులో కేసు నమోదు చేసింది. 2014 ఏప్రిల్ 28న ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసు ఇవ్వడాన్ని సవాలు చేసిన పిటిషన్‌పై విచారణ వాయిదా పడింది.

## వైఎస్ భాస్కర్‌రెడ్డికి ఊరట

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడు వైఎస్ భాస్కరరెడ్డి ఏపీ వెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు పర్మిషన్ ఇచ్చింది. పలు షరతులు విధిస్తూ జస్టిస్ కె. సుజన ఆదేశాలు జారీ చేశారు. కేసులో జోక్యం చేసుకోరాదని, ఏపీలో ప్రయాణానికి సంబంధిం చిన వివరాలు, నివాసం ఉండబోయే ఇల్లు, ఫోన్ నంబర్లు పోలీసులకు ఇ వ్వాలన్నారు. వ్యక్తిగత కారణాలతో మాత్రమే స్వగ్రామానికి వెళ్లాలన్నారు.

## చెరువు పూడ్చివేతపై పిటిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ పరిధిలోని ఎర్రకుంట చెరువును పూడ్చి ప్లాట్లు వేస్తున్నారంటూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు విచారించింది. కౌంటర్లు దాఖలు చేయాలని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్, చీఫ్ ఇంజనీర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆర్డీవోతో పాటు ప్రైవేట్ సంస్థలు స్పెక్ట్రా వెంచర్స్, ఎ.పి. రాజన్‌లను ఆదేశించింది. బాలానగర్ సర్వే నంబర్ 6లోని 4.33 ఎకరాల విస్తీర్ణంలో ప్లాట్లు వేసి విక్రయాలు జరుగుతున్న నేపథ్యంలో చెరువును రక్షించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థుడు మధు దాఖలు చేసిన వ్యాజ్యాన్ని మంగళవారం డివిజన్ బెంచ్ విచారించింది.

## మే డేను జయప్రదం చేయాలి

ఎఐటియుసి(జిహెచ్‌ఎంసి) ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** స్వాతంత్ర్యం రాకపూర్వం సాధించుకున్నటు వంటి 44 కార్మిక చట్టాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం రద్దు చేసి, నాలుగు కోడ్‌లుగా విభజించడం జరిగిందని, ఆ కోడ్‌లను రద్దు చేసే వరకు పోరా టాలు చేయాలని జిహెచ్‌ఎంసి కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్ పిలుపుని చ్చారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే ను ఘనంగా నిర్వహించా లన్నారు. మున్సిపల్ స్టాఫ్, వర్కర్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వక అధ్య క్షులు పి.వెంకటయ్య, అంబర్‌పేట సర్కిల్ గోల్నాక డివిజన్‌లో శానిటేషన్ కార్మికులతో కలిసి ఆయన మంగళవారం మే డే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొడ్డుపల్లి కిషన్ మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసే వరకు కార్మిక వర్గం పోరాటాలు నిర్వహించాలన్నారు. కార్మికులకు, ఉద్యోగులకు కనీస వేతనాలు రూ. 26 వేలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పి.కళ్యాణ్, ధర్మపురి, మల్లికార్జున్, స్వప్న, జ్యోతి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో ఆలస్యం

ఎస్‌టియు టిఎస్ అధ్యక్షుడు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రానున్న విద్యా సంవత్సరాన్ని దృష్టిలో పెట్టు కుని ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమానికి సంబంధించిన అంశాలపైన చర్చించేందుకు ఉపాధ్యాయ సంఘాలతో తక్షణమే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఎస్‌టియు టిఎస్ అధ్యక్షుడు జి.సదానందం గౌడ్, ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ విష యమై రాష్ట్ర విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణను కలిసి విన్నవించినట్టు వారు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో విద్యా శాఖ డైరెక్టర్‌తో చర్చించి సానుకూల నిర్ణయం తీసుకుంటామని యోగితా రాణ హామీనిచ్చారని వివరించారు. రాష్ట్రంలో అకాడమి క్యాలెండర్, విద్యా సంస్కరణలు, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు తదితర శాఖాపర మైన అంశాలపై ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాలను నిర్వహించకపో వడంతో సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరుగుతుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతివారం ఉపాధ్యాయ సంఘాలతో సమావేశా లను నిర్వహిస్తున్నారని వారు గుర్తు చేశారు.

## గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పరిపుష్టి ద్వారానే దేశాభివృద్ధి

తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల పరిపుష్టి ద్వారానే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ రాజయ్య సిరిసిల్ల అన్నారు. తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో మంగళ వారం నిర్వహించిన పంచాయతీ రాజ్, మున్సిపల్, విద్య, వైద్య శాఖల అధిపతుల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ 73వ, 74వ రాజ్యాంగ సవరణల ప్రకారం స్థానిక సంస్థలకు బదలాయింపవలసిన నిధులు, విధులు, సిబ్బంది కేటాయింపుల ప్రక్రియను సమగ్రంగా పరిశీ లించేందుకు మే నెలలో నిజామాబాద్, వరంగల్, రంగారెడ్డి, సూర్యాపేట జిల్లా కేంద్రాల్లో ప్రాంతీయ కార్యశాలలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యశాలల్లో నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లు, స్థానిక సంస్థల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని క్షేత్రస్థాయి వాస్తవాలను వెల్లడించే అవకాశం కల్పించబడుతుం దని, ఆ వివరాలను కమిషన్ నివేదికలో పొందుపరుస్తామని పేర్కొన్నారు. సమావేశంలో కమిషన్ సభ్యులు సంకెపల్లి సుధీర్ రెడ్డి, మా లోతు నెహ్రూ నాయక్, మెంబర్ సెక్రటరీ పి.కాత్యాయనీ దేవి, ఎస్‌సిఐ డైరెక్టర్ బి.జనా ర్దన్‌రెడ్డితో పాటు సంబంధిత శాఖాధిపతులు పాల్గొన్నారు.

# రిటైర్డ్ లెక్చరర్ డి.వెంకట్రామ్ మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల అనారోగ్యంతో హైద రాబాద్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న రిటైర్డ్ ఎకనామిక్స్ లెక్చరర్, ఎఐఎస్‌ఎఫ్ మాజీ నాయకుడు డాక్టర్ దొంగరి వెంకట్రామ్ (71) సోమ వారం రాత్రి మరణించారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమార్తె నూతన, కుమారులు నిఖిల్, నిశాంత్ ఉన్నారు. వెంకట్రామ్ అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో కుటుంబసభ్యులు నిర్వ హించారు. అంతకుముందు ఆయన భౌతికకాయానికి మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి, సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, ఎఐఎస్‌ఎఫ్ మాజీ ఉద్యమ సహచరులు, మిత్రులు శ్రీనివాసులు నాయు డు, కట్టా శేఖర్ రెడ్డి, డాక్టర్ శ్యాంసుందర్ రెడ్డి, బోధ పిచ్చిరెడ్డి, బి.నాగభూషణం, డి.వేణు, కె.వి.ఎల్, చామల అశోక్, అనంతుల మల్లీశ్వరీ తదితరులు నివాళులర్పించారు. సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్‌రావు, ఏఐటీయూసీ రాష్ట్ర కార్య దర్శి నందూరి కరుణ, సిపిఐ సూర్యాపేట్ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, సూర్యాపేట్ ప్రాంతీయ కార్యదర్శి వెల్లేముల యాదగిరి, తుంగతుర్తి మండల సిపిఐ కార్యదర్శి పున్నయ్య తదితరులు ఓ ప్రకటనలో సంతాపాన్ని తెలియ చేస్తూ.. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. వెంకట్రామ్ విద్యార్థి దశలో ఎఐవైఎఫ్‌లో క్రియాశీలకంగా పని చేశారు. ఆయన స్వగ్రామం తుంగతుర్తి నియోజకవర్గం లోని వెలుగుపల్లి అన్నారం. ఆయన తండ్రి దొంగరి ముత్తి లింగయ్య సిపిఐ తరఫున గ్రామ సర్పంచ్‌గా పని చేశారు. ఉస్మానియా యూనివర్సిటీలో ఎకనామిక్స్‌లో పిజి, పిహెచ్‌డి చేసినప్పుడు వెంకట్రామ్ క్యాంపస్‌లో ఎఐఎస్‌ఎఫ్ నాయకుడుగా వ్యవహరించారు. అలాగే ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా పని చేశారు. అనంతరం ఆయన సూర్యాపేటలోని ఎస్.వి.డిగ్రీ కాలేజీలో ఎకనామిక్స్ లెక్చరర్‌గా పని చేసి, అక్కడే రిటైర్డ్ అయ్యారు.



## అప్రమత్తంగా బూత్ లెవెల్ ఏజెంట్లు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) విష యంలో బిఎల్ఓ, బూత్ లెవెల్ ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలని బిఆర్‌ఎస్ మాజీ ఎంపి బోయినపల్లి వినోద్ కుమార్ సూచించారు. ఎస్ఐఆర్ విషయంలో చాలా మందికి అవగాహన లేదని, దీనిపై పలు అనుమానాలు ఉన్నాయనే విష యాన్ని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ విషయమై రాష్ట్ర ఎన్ని కల ప్రధానాధికారి సుదర్శన్ రెడ్డిని బిఆర్‌ఎస్ నాయకులు రావుల చంద్రశేఖర్ రెడ్డితో కలిసి వినోద్‌కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనం తరం వినోద్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుం చి ఓటర్ల శుద్ధి కార్యక్రమం నడుస్తుందని, ప్రస్తుతం మళ్ళీ ఓటర్ల శుద్ధి కార్యక్ర మం చేపట్టారన్నారు. ఎస్ఐఆర్‌లో కొత్త ఫోటోలు, ప్రభుత్వ గుర్తింపు కార్డులను అడుగుతున్నారని, గ్రామీణస్థాయిలో ఎలాంటి అవగాహన లేదని అన్నారు.



## దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలి

బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఓటర్ల జాబితాలో దొంగ ఓట్లు నమోదు కాకుండా చూడాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు బిఆర్‌ఎస్ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్, బిజెపిలు ఇప్పటికే నమోదు చేసిన దొంగ ఓట్లను, డబుల్ ఓట్లను గుర్తించి, వాటిని ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. హైదరాబాద్ జిల్లాలోని బిఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులతో కెటిఆర్ మంగళవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, పద్మారావుగౌడ్, ఎంఎల్‌ఎలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎంఎల్‌సిలు దాసోజు శ్రవణ్, వాణిదేవితో పాటు బిఆర్‌ఎస్ నియోజకవర్గాల ఇన్‌చార్జులు, సీనియర్ నాయకులు పాల్గొ న్నారు. ఈ సందర్భంగా 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' (ఎస్ఐఆర్) పేరుతో ఓట ర్ల జాబితా సవరణ కార్యక్రమంపై చర్చించారు. ఈ భేటీలో సుదీర్ఘంగా చర్చిం చారు. హైదరాబాద్ జిల్లా పరిధిలో ఓటర్ల సవరణ,పర్యవేక్షణ బాధ్యతలను తల సాని శ్రీనివాస్ యాదవ్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లా డుతూ హైదరాబాద్ నగరంలో ఏ ఒక్క వ్యక్తి కూడా తన ఓటు హక్కును కోల్పో కుండా పార్టీ తరఫున అండగా నిలవాలని, నూతన ఓటర్ల నమోదు ప్రక్రియలో పార్టీ కార్యకర్తలు చొరవ తీసుకోవాలని సూచించారు. తలసాని శ్రీనివాస్ యాద వ్ మాట్లాడుతూ త్వరలోనే బూత్ లెవల్ ఏజెంట్లకు నియోజకవర్గ స్థాయిలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

# అమ్రాబాద్ పునరావాసానికి ఊతం

మౌలిక సదుపాయాలకు గ్రీన్ సిగ్నల్

వన్యప్రాణి మండలి స్టాండింగ్ కమిటీ తొలి సమావేశంలో మంత్రి కొండా సురేఖ వెల్లడి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమ్రా బాద్ టైగర్ రిజర్వ్ కోర్ ప్రాంతం నుంచి గ్రామాల స్వచ్ఛంద పునరా వాసంపై కమిటీ సంతృప్తి వ్యక్తం చేసింది. నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాల్లో 160 కుటుం బాలు ప్రత్యక్ష నగదు పరిహారం ఎంపిక చేసుకోగా, 257 కుటుంబాలు పునరావాస ప్యాకేజీకి అంగీకరించాయి. నగదు పరిహారం ఎంపిక చేసిన కుటుంబాలకు ఇప్పటికే జాయింట్ బ్యాంక్ ఖాతాలు తెరిచి, ఒక్కొక్క కుటుంబానికి రూ.15 లక్షలు జమ చేసినట్లు అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వెల్లడించారు. రాష్ట్ర వన్యప్రాణి మండలి స్టాండింగ్ కమిటీ తొలి సమావేశం మంగళవారం నెహ్రూ జూలాజికల్ పార్కులో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో వన్య ప్రాణి సంరక్షణకు సంబంధించిన అంశాలను సమీక్షించడంతో పాటు రక్షిత అటవీ ప్రాంతాల్లో చేపట్టే పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ఆమోదం తెలిపారు. మరోవైపు, ఏటూరునాగారం వన్యప్రాణి అభయార ణ్యంలో రెండు రహదారి ప్రాజెక్టులకు కమిటీ సిఫార్సు చేసింది. ఈ ప్రాజె క్టుల అమలులో వన్యప్రాణి సంరక్షణ చర్యలకు ప్రత్యేక నిధులు కేటాయిం చారు. అలాగే డిండి బాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణానికి నల్గొండ, నాగ ర్‌కర్నూల్ జిల్లాల్లో అటవీ భూమి వినియోగానికి అనుమతి ఇచ్చారు. ఇక కవాల్ టైగర్ రిజర్వ్, ప్రణహిత వన్యప్రాణి అభయారణ్యం ప్రాంతాల్లో ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ప్రతిపాదనలకు కూడా ఆమోదం తెలిపారు. మను షులు–వన్యప్రాణుల మధ్య ఘర్షణలను తగ్గించేందుకు నెహ్రూ జూలాజి కల్ పార్క్, అమ్రాబాద్, కవాల్, కాకతీయ జూలాజికల్ పార్క్‌లలో క్విక్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే పర్యావరణ రుసు ముల ద్వారా వచ్చిన నిధులను వన్యప్రాణి సంరక్షణ, ఈకోటూరిజం అభి వృద్ధికి వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిసిఎఫ్ క్షితిజ, జూ డైరెక్టర్ సునీల్ హిరామత్, క్యూరేటర్ వసంత డిసిఎఫ్ (వైల్డ్ లైఫ్) ఆంజనేయులు, ఇతర జిల్లాల అటవీ అధికారులు పాల్గొన్నారు.

## మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ఐపిఆర్ కమిషనర్ ముకుంద రెడ్డి







**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన జి.ముకుంద రెడ్డి తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డిని మంగళవారం అకాడమీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో జర్నలి స్టుల సంక్షేమం, మీడియా రంగం అభివృద్ధి తదితర అంశాలపై వారు చర్చించారు.

**కమిషనర్‌కు టియుడబ్ల్యుజె నేతల శుభాకాంక్షలు**

రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన జి.ముకుందరెడ్డిని మంగళవారం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలి స్టుల సంఘం (టియుడబ్ల్యుజె) రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృ త్వంలో ప్రతినిధి బృందం సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలుసు కుని శుభాకాంక్షలు తెలిపారు. సమాచార శాఖతో జర్నలిస్టుల మధ్య మెరు గైన సమన్వయం గురించి వారు చర్చించారు. ప్రభుత్వం, మీడియా సంస్థల మధ్య బలమైన సహకారం ఉంటే సంక్షేమ అంశాలను త్వరగా పరిష్కరించవచ్చని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో జర్నలిస్టుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని కమిషనర్‌ను విరాహత్ కోరారు. కమిషనర్‌ను కలిసిన వారిలో టియుడబ్ల్యుజె ఉప ప్రధాన కార్య దర్శి కల్కూరి రాములు, కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, కోశాధికారి మోతె వెంకట్ రెడ్డిలు ఉన్నారు. రాష్ట్ర సమాచార, ప్రజాసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద రెడ్డిని వీడియో జర్నలిస్ట్స్ యూనియన్ అధ్య క్షులు వనం నాగరాజు, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ అధ్య క్షులు శిగ శంకర్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి గౌస్ మొహియుద్దీన్, మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకంక్షలు తెలిపారు.



## ఘనంగా డిజిపి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర డిజిపి బి.శివధర్ రెడ్డి 60వ జన్మదిన వేడుకలు మంగళవారం హైదరాబాద్‌లోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డిజిపి జన్మదినం పురస్కరించుకుని పలువురు ఉన్నతాధికా రులు, సిబ్బంది డిజిపి కి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ వేడుకల్లో భాగంగా 'అరైవ్ అలైవ్' ముఖచిత్రంతో ప్రత్యేకంగా రూపొందించిన కేక్‌ను డిజిపి కట్ చేశారు. ఈ కార్యక్రమంలో శాంతి భద్రతల విభాగం డిజిపి మహేష్ ఎం.భగ వత్, టిఎస్ఎల్‌పిఆర్‌బి చైర్మన్ వి.వి.శ్రీనివాసరావు, ఎస్‌పిఎఫ్ డిజి స్వాతి లక్రా, సిఐడి డిజిపి చారు సిన్హా, ఫ్యూచర్ సిటీ కమిషనర్ సుధీర్ బాబు, ఐజిపి చంద్ర శేఖర్ రెడ్డితో పాటు పలువురు ఐపిఎస్ అధికారులు పాల్గొన్నారు. డిజిపికి పుష్ప గుచ్ఛాలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. డిజిపి బి.శివధర్ రెడ్డి ఆయు రారోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని కార్యాలయ అధికా రులు, సిబ్బంది ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పోలీస్ ప్రధాన కార్యాల యంలో డిజిపి బి.శివధర్ రెడ్డి మొక్కలను నాటారు.

# నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు అన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్‌తో కలిసి కేశవరావు హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, బోధనా పద్ధతులు, విద్యార్థులకు అందుతున్న వసతులను క్షుణ్ణం గా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణ లోని ఆటస్థలాన్ని అభివృద్ధి చేయాలని, విద్యార్థులను క్రీడల వైపు ప్రోత్స హించేందుకు ప్రత్యేకంగా 'ప్రీస్పోర్ట్స్ కోర్టులను' ఏర్పాటు చేయాలని సూచించారు. నవీన్ నికోలస్ మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థుల



శారీరక దృఢత్వం, ఇతర నైపుణ్యాల అభివృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ సోమిరెడ్డి, జిల్లా విద్యాశాఖాధికారి ఆర్.రోహిణి, డిప్యూటీ ఐఒఎస్ వీర లక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివరామ్ ప్రసాద్ పాల్గొన్నారు.

## వాహన్ పోర్టల్ ద్వారా నంబర్ల కేటాయింపు

ఏడు రోజుల్లో వ్యవస్థ పూర్తిగా అందుబాటులోకి: రవాణా శాఖ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27వ తేదీ వరకు వాహన్ పోర్టల్ ద్వారా మొత్తం 75,099 తాత్కాలిక రిజిస్ట్రేషన్లు (టిఆర్) జారీ చేయ డంతో పాటు ఫ్యాన్సీ నంబర్ మాడ్యూల్‌ను అమలులోకి తీసుకువచ్చి, 2441 ఆన్‌లైన్ రిజర్వేషన్లు, వేలాలు నిర్వహించబడ్డాయనీ, దీని ద్వారా పారదర్శ కంగా, సమర్థవంతంగా నంబర్ల కేటాయింపు జరుగుతోందని రవాణా శాఖ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటు సుమారు 41 వేల వాహనా లకు వాహన్ వ్యవస్థ ద్వారా శాశ్వత రిజిస్ట్రేషన్ నంబర్లు కేటాయించబడ్డా యనీ, ఆయా నంబర్లు కేటాయించిన తర్వాత, డీలర్లు హెచ్‌ఎస్‌ఆర్‌పి ప్లేట్లు రూపొందించి వాటిని వాహనాలపై అమర్చాలని తెలిపారు. అనంతరం రిజిస్ట్రే షన్ సర్టిఫికెట్ ముద్రణకు అనుమతించేందుకు వాహన్ వ్యవస్థలో ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు. భారత ప్రభుత్వ నేషనల్ ఇన్ఫర్మాటిక్స్ సెంటర్ (ఎన్ఐసి) అభివృద్ధి చేసిన వాహన్ పోర్టల్‌ను తెలంగాణ ప్రభుత్వ రవాణా శాఖ సక్రమంగా అమలు చేస్తోందని, రాష్ట్రవ్యాప్తంగా వాహన్ సంబం ధిత సేవలను సరళీకరించడంతో పాటు డిజిటలైజ్ చేయడానికి ఈ చర్య తీసుకో బడిందని తెలిపారు. వాహన్ పోర్టల్‌కు ఎన్ఐసి నుండి సాంకేతిక మద్దతు అందించబడుతోందని, అదనపు మాడ్యూల్స్‌ను దశలవారీగా అమలు చేస్తున్నా మన్నారు. తదుపరి 7 రోజుల్లో వ్యవస్థ పూర్తిగా స్థిరపడుతుందని, ప్రజలకు నిరంతర, సమర్థవంతమైన సేవలు అందుతాయని అంచనా వేయబడుతోందని పేర్కొన్నారు. ఈ మార్పు సమయంలో వాహన డీలర్లు, పౌరులు, ఇతర భాగ స్వాముల సహకారానికి రవాణా శాఖ కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఫోర్జరీ సంతకాలతో కంపెనీ స్వాధీనం

వృద్ధ పారిశ్రామికవేత్త ఫిర్యాదు.. కేసు నమోదు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్లాస్టిక్ ఉత్పత్తుల తయారీ సంస్థలో డైరెక్టర్ హక్కులు దోచుకున్నారంటూ వృద్ధ పారిశ్రామికవేత్త ఫిర్యాదు చేసిన ఘటన వెలుగులోకి వచ్చింది. బెంగళూరుకు చెందిన చామర్తి మురళీ కృష్ణా రావు(87) పోలీసులకు ఫిర్యాదు చేస్తూ తన కంపెనీని అక్రమంగా స్వాధీనం చేసుకున్నారని ఆరోపించారు. ఫిర్యాదు ప్రకారం మురళీ కృష్ణా రావు స్థాపించిన యు2 ఎక్సిమ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ 2010లో స్థాపిం చారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం రావిర్యాల్ గ్రామంలో ఉన్న ఈ సంస్థకు అప్పట్లో ఎపిఐఐసి ద్వారా సుమారు 17,188 చ.మీ. భూమి కేటాయించారు. 2010 నుంచి 2014 వరకు కంపెనీ సజావుగా నడిచిం దని తెలిపారు. వ్యాపార విస్తరణ కోసం 2014లో గోవింద్ ప్రసాద్ బాబు అతని కుమారుడు నిశాంత్ రాజ్ వద్ద నుంచి రూ.5 కోట్లు అప్పు తీసుకు న్నట్లు చెప్పారు. ఆ సమయంలో భూమి అసలు పత్రాలను అప్పగించినప్ప టికీ, ఎలాంటి మార్టిగేజ్ నమోదు కాలేదని పేర్కొన్నారు. అయితే, అప్పుదా రుల సూచన మేరకు సీలం దయాకర్ రెడ్డి, అతని భార్య సీలం పావని ను అదనపు డైరెక్టర్లుగా నియమించారని తెలిపారు. తర్వాత వీరు కుమ్మక్కై తన సంతకం, బొటనవేలు ముద్రలను నకిలీగా సృష్టించి, కంపెనీ నుంచి తాను రాజీనామా చేసినట్లు ఆర్‌ఒసి రికార్డుల్లో అప్లోడ చేశారని ఆరోపిం చారు. అంతేకాకుండా నకిలీ డిజిటల్ సిగ్నేచర్లు సృష్టించి షేర్ హోల్డింగ్ నమూనాను మార్చి, తన ఫోన్ నంబర్లు, ఇమెయిల్ వివరాలను తొలగించి తమ వివరాలను నమోదు చేశారని చెప్పారు. ఈ పరిణామాల వల్ల గత 11 ఏళ్లుగా కంపెనీ నిర్వహణలో తాను పాల్గొనలేకపోయానని, భారీ నష్టం చవిచూశానని మురళీ కృష్ణారావు వాపోయారు. ఈ విషయమై 2025 మార్చిలో కోర్టును ఆశ్రయించగా, ఆర్‌ఒసి విచారణ జరిపి న్యాయం చేయాలని కోర్టు ఆదేశించిందని తెలిపారు. అనంతరం ఆర్‌ఒసి ఈ ఫిర్యా దును సిసిఎస్, ఢిల్లీలోని కంట్రోలర్ ఆఫ్ సర్టిఫైయింగ్ అథారిటీకి పంపగా, నివేదిక ఇంకా రావాల్సి ఉందని చెప్పారు.

ఇక మధ్యవర్తిత్వం పేరుతో డి.నరేష్ చౌదరి తనను సంప్రదించి సమస్య పరిష్కరిస్తానని చెప్పి తనను, తన భార్యను డైరెక్టర్లుగా నియమించుకున్నా రని, కానీ సమస్య పరిష్కారం కాలేదని ఆరోపించారు. వారి పదవీకా లంలో కొంత భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు కూడా పేర్కొ న్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే పోలీసు కేసు నమోదై దర్యాప్తు కొనసా గుతోందని తెలిపారు.

కాబట్టి, గోవింద్ ప్రసాద్ రాజ్, సీలం దయాకర్ రెడ్డి, సీలం పవని తదిత రులపై మోసం, కుట్ర, నకిలీ పత్రాల సృష్టి కేసుల్లో చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదుదారు కోరారు.

## జగన్‌మోహన్ రెడ్డి హత్యపై ఖండన

టియుడబ్ల్యుజె, ఐజెయు ప్రకటన

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లా వెంకటగిరికోటలో ఆంధ్రజ్యోతి పత్రిక సీనియర్ రిపోర్టర్ జగన్‌మోహన్ రెడ్డి హత్యను తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ (టియుడబ్ల్యుజె), ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజెయు) తీవ్రంగా ఖండించాయి. సీనియర్ జర్నలిస్టు హత్య జరగడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. టియూడబ్ల్యూజె అధ్యక్షులు, కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామనారాయణ, ఐజెయు అధ్యక్షులు బల్వీందర్ సింగ్ జమ్ము, ప్రధాన కార్యదర్శి డి.సోమసుందర్ మంగళవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. జర్నలిస్టు హత్య ఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి దోషులను, అలాగే కుట్రదారులను తక్షణమే అరెస్ట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇటీవల చిత్తూరు జిల్లాలోని గంధపు చెక్క మాఫియాపై ఆయన రిపోర్టులు వెలువరించిన నేపథ్యంలో ఈ దాడి జరిగి ఉండొచ్చని వారు పేర్కొన్నారు. జర్నలిస్టుల భద్రత కోసం ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వాన్ని వారు కోరారు. ప్రెస్ స్వేచ్ఛను కాపాడేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని నాయకులు ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు.

## మే రెండో వారంలో భారత్‌కు ఎస్-400 ట్రియంఫ్ నాలుగో యూనిట్



**న్యూఢిల్లీ:** భారత వైమానిక దళం (ఐఎఫ్) వాయు రక్షణ యంత్రాంగం మరి ంత బలోపేతం కానుంది. వచ్చే నెల మొదటి భాగంలో రష్యా నుండి ఎస్400 ట్రియంఫ్ ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ నాల్గవ యూనిట్‌ను భారత్ అందుకోనుందని భద్రతా వర్గాల వర్గాలు మంగళవారం తె లిపాయి. 2018 అక్టోబర్‌లో ఈ క్షిపణి వ్యవస్థలకు చెందిన ఐదు యూనిట్లను కొనుగోలు చేసేందుకు భారతదేశం రష్యాతో 5 బిలియన్ డాలర్ల ఒప్పందం కు దుర్చుకుంది. వాటిలో మూడింటిని ఇప్పటికే డెలివరీ చేసింది. ఈ ఆయుధ వ్యవ స్థ సరఫరాలో భాగంగా క్షిపణి ఐదవ యూనిట్‌ను నవంబర్ నాటికి అందజేస్తారని ఆ వర్గాలు తెలిపాయి. ఆపరేషన్ సింధూర్ సమయంలో ఎస్400 క్షిపణి వ్యవస్థలు కీలక పాత్ర పోషించాయి. గత నెలలో, రష్యా నుండి కొత్తగా ఐదు ఎస్400 క్షిపణి వ్యవస్థల కొనుగోలుకు న్యూఢిల్లీ ఆమోదం తెలిపింది. దీంతో వాటి మొత్తం సంఖ్య 10కి చేరుతుంది. ఈ క్షిపణి వ్యవస్థ నాల్గవ యూనిట్ ఇప్పటికే రవాణా చేయబడిందని, అది రాబోయే కొద్ది రోజుల్లో భారతదేశానికి చేరుకుంటుందని తెలిసిన సమాచారం. 'కౌంటరింగ్ అమెరికాస్ అడ్వర్సరీస్ త్రూ శాంక్షన్స్ యాక్ట్' (సిఎటిఎస్ఎ) నిబంధనల ప్రకారం, ఈ ఒప్పందంతో ముందుకు వెళితే అమెరికా ఆంక్షలను ఎదుర్కోవలసి వస్తుందని అమెరికా హెచ్చరించినప్పటికీ, భారతదేశం ఏడు సంవత్సరాల క్రితమే ఎస్400 క్షిపణుల కొనుగోలు ఒప్పందంపై సంతకం చేసింది. కొత్త కొనుగోలు మునుపటి ఆర్డర్‌కు కొనసాగింపుగా ఉంటుంది కాబట్టి, అమెరికా ఆంక్షల వల్ల ఎలాంటి ఆటంకాలు ఎదురవుతాయని భారతదేశం భావించడం లేదని వర్గాలు తెలిపాయి. మే 7–10 తేదీలలో పాకిస్థాన్‌తో జరిగిన సైనిక ఘర్షణ సమయంలో భారత వైమానిక దళం (ఐఎఫ్) ఈ క్షిపణి వ్యవస్థలను విస్తృతంగా ఉపయోగించింది. ఘర్షణ జరిగిన కొన్ని వారాల తర్వాత, మరో విడత ఎస్400 క్షిపణులను కొనుగోలు చేయడానికి ఒక ప్రతిపాదన ముందుకు వచ్చింది. ఈ క్షిపణి వ్యవస్థలను ఆపరేట్ చేయడానికి రష్యా ఇప్పటికే ఒక భారతీయ సిబ్బంది బృందానికి శిక్షణ ఇచ్చింది. ఎస్400ను రష్యా అత్యంత అధునాతన సుదూర ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణి రక్షణ వ్యవస్థగా పిలుస్తారు.

## మోదీ ప్రాయశ్చిత్తం చేసుకునే తరుణమిది

• లోక్‌సభలో ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేసే విధానంపై చర్చించేందుకు అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి • మోదీ కుటిల ప్రయత్నం ప్రతిపక్షాలు ఐక్యత వల్ల ఘోరంగా విఫలమైంది : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ పార్టీ విమర్శలు గుప్పించింది. మహిళలను రాజకీయ ప్రయోజనాల కోసం వినియోగించిన పాపానికి ఇప్పుడు ప్రధాని మోదీ ప్రాయశ్చిత్తం చేసుకునే సమయం వచ్చిందని పేర్కంది. లోక్‌సభలో ప్రస్తుత సీట్లతోనే మహిళా రిజర్వేషన్ అమలు చేసే విధానంపై చర్చించేందుకు అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న తమ డిమాండ్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పునరుద్ఘాటించారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. 'లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనను ఆమోదించాలనే మోదీ కుటిల ప్రయత్నం ప్రతిపక్షాలు ఐక్యత వల్ల ఘోరంగా విఫలమైంది. ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న పనిని ప్రధాని మోదీ చేయాల్సి సమయం ఆసన్నమైంది. నారీ శక్తి వందన్ అధినియమ్ 2023 అమలుపై స్పష్టత తీసుకురావాలి. ఈ చట్టం ఏప్రిల్ 16, 2026 రాత్రి ఆలస్యంగా నోటిఫై చేశారు. 2029 నుంచి ప్రస్తుత లోక్‌సభ 543 సీట్లతోనే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయడం సాధ్యం, అవసరం, తప్పనిసరి' అని జైరాం రమేశ్ తెలిపారు. ప్రత్యేక పార్లమెంట్ సమావేశంలో మహిళా రిజర్వేషన్ అసలు లక్ష్యం కాదని జైరాం రమేశ్ ఆరోపించారు. డిలిమిటేషన్ ద్వారా రాజకీయ ప్రయోజనం పొందడమే ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రధాని రాజకీయ రక్షణ కోసం డిలిమిటేషన్‌ను ముందుకు తీసుకురావడానికి ప్రయత్నించారని ఆరోపించారు. మహిళలను రాజకీయ అజెండా కోసం వినియోగించిన తప్పును సరిదిద్దుకుని,



వారికి న్యాయం చేయాల్సిన సమయం వచ్చిందని తెలిపారు. ప్రస్తుత లోక్‌సభ సీట్లలోనే మహిళా రిజర్వేషన్ అమలు చేయడానికి వర్షాకల సమావేశంలో లేదా అంతకంటే ముందే బిల్లు తీసుకురావాలని కోరారు.

**రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి**

మహిళా రిజర్వేషన్ అమలు కోసం కేంద్రం తీసుకువచ్చిన రాజ్యాంగ (131వ సవరణ) బిల్లు ఇటీవల లోక్‌సభలో ఓడిపోయింది. 528 మంది సభ్యులు ఓటింగ్‌లో పాల్గొనగా, 298 మంది అనుకూలంగా, 230 మంది వ్యతిరేకంగా ఓటు వేశారు. 2/3 మెజారిటీ కోసం 352 ఓట్లు అవసరమయ్యాయి. ఈ బిల్లులో భాగంగా లోక్‌సభ సీట్లను 543 నుంచి 816కి పెంచి, 2011 జనగణన ఆధారంగా డిలిమిటేషన్ చేసి, 2029 ఎన్నికలకల్లా మహిళా రిజర్వేషన్ అమలు చేయాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. అలాగే రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల అసెంబ్లీలలో కూడా సీట్ల సంఖ్య పెంచి 33 శాతం మహిళలకు రిజర్వేషన్ కల్పించాలని భావించింది.

**బాక్సైట్ తవ్వకాల విషయంలో కేంద్రంపై విమర్శలు**

మరోవైపు, ఒడిశాలో బాక్సైట్ తవ్వకాల ప్రాజెక్టు గురించి జరుగుతున్న గిరిజనుల నిరసనల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వాన్ని జైరాం రమేశ్ తీవ్రంగా విమర్శించారు. రాయగడ, కళహాండీ జిల్లాల్లోని సిజిమాలి ప్రాంతంలో చేపడుతున్న తవ్వకాలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు చట్ట విరుద్ధమని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులు పెసా, అటవీ హక్కుల చట్టాల నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభావిత గ్రామ సభలు, స్థానిక సమాజాలకు ఉన్న హక్కులను ఉద్దేశపూర్వకంగా పక్కనబెట్టారని ఆరోపించారు. సిజిమాలి ప్రాంతంలో జరుగుతున్న పరిణామాలపై స్వతంత్ర దర్యాప్తు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. పర్యావరణంపై భారీ ప్రభావం చూపే తవ్వకాల ప్రాజెక్టులను చట్టపరమైన రక్షణలను పక్కనబెట్టి బలవంతంగా అమలు చేయడం ఒడిశాకు కొత్త విషయం కాదని అన్నారు. ఇదే పరిస్థితి మళ్లీ కనిపిస్తోందని వ్యాఖ్యనించారు. గిరిజనులపై, ముఖ్యంగా మహిళలపై పోలీసులు అధిక బలప్రయోగం చేశారని జైరాం రమేశ్ ఆరోపించారు. ఇది ఎస్‌సీ/ఎస్‌టీ చట్టం1989 ఉల్లంఘనకు దారితీస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా గిరిజన సమాజానికి చెందిన రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని తెలిపారు. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రి కూడా ఒడిశాకు చెందినవారేనని, ఆయన స్పందించి వెంటనే స్వతంత్ర దర్యాప్తు ఆదేశించాలని కోరారు.

## ఎన్నికల తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ఆలోచన లేదు : కేంద్రం




**న్యూఢిల్లీ :** బెంగాల్‌లో ఈనెల 29న పోలింగ్ ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతారన్న ఊహాగానాలను కేంద్రం తోసిపుచ్చింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెంచే ప్రణాళికలు ప్రభుత్వానికి లేవని కేంద్ర ప్రభుత్వ వర్గాలు మంగళవారం తెలిపాయి. 'పెట్రోల్, డీజిల్ ధరలను పెంచే ప్రతిపాదన ఏదీ లేదు' అని పశ్చిమాసియా పరిణామాలపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెట్రోలియం, సహజ వాయువుల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. బుధవారం బెంగాల్‌లో పోలింగ్ ముగిసిన తర్వాత రిటైల్ ఇంధన ధరలను పెంచుతారా అన్న ప్రశ్నకు ఆమె ఈ మేరకు సమాధానమిచ్చారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల కారణంగా గత రెండు నెలల్లో ముడిచమురు ధరలు 50 శాతానికి పైగా పెరిగినప్పటికీ, రిటైల్ పెట్రోల్, డీజిల్ ధరలు రికార్డు స్థాయిలో వరుసగా నాలుగో ఏడాది కూడా స్థిరంగా ఉన్నాయి. ముడిసరుకుల ధరలకు, పెట్రోల్ పంపు ధరలకు మధ్య పెరుగుతున్న వ్యత్యాసం ప్రభుత్వ రంగ ఇంధన రిటైలర్లకు భారీ నష్టాలను మిగిల్చింది. కొన్ని అంచనాల ప్రకారం రోజువారీ నష్టం సుమారు రూ. 2,400 కోట్లుగా ఉంది. అయితే, బుధవారం తమిళనాడు, బంగాల్, అసోం, కేరళ, పుదుచ్చేరిలో రాజకీయంగా ఉత్కంఠభరితమైన అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత ధరలు తక్షణమే పెరుగుతాయన్న ఊహాగానాలు తలెత్తాయి.

## ఆర్టికల్ 370 పునరుద్ధరణే ప్రధాన ఎజెండా

నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా



**శ్రీనగర్ :** ఆర్టికల్ 370 పునరుద్ధరణ తమ పార్టీ ప్రధాన ఎజెండా అని, ఈ పోరాటం నుంచి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని నేషనల్ కాన్ఫరెన్స్ అధినేత ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు. జమ్మూకశ్మీర్‌లో ద్వంద్వ ప్రభుత్వ వ్యవస్థ ఆ కేంద్రపాలిత ప్రాంత అభివృద్ధికి హానికరం కాదని ఆయన అన్నారు. సోమవారం మధ్య కశ్మీర్‌లోని బుద్గామ్‌లో జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ, 2019లో కేంద్రం రద్దు చేసిన ఆర్టికల్ 370 పునరుద్ధరణతో సహా, జమ్ము కశ్మీర్ ప్రజల హక్కులు, గౌరవాన్ని పరిరక్షించడంపై పార్టీ ప్రధాన వైఖరిని అబ్దుల్లా పునరుద్ఘాటించారు. 'జమ్ముకశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్ పునాది దాని నిజాయితీ, నిస్వార్థ కార్యకర్తలపై, అలాగే కశ్మీర్ అమరవీరుల అపారమైన త్యాగాలపై ఆధారపడి ఉంది. ఈ అమరవీరులు శతాబ్దాల అణచివేత, దాస్యం నుండి ప్రజల గౌరవం, ఆత్మగౌరవం, స్వేచ్ఛ కోసం తమ ప్రాణాలను అర్పించారు' అని ఆయన అన్నారు. తమ పార్టీకి చెందిన తొలి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రభుత్వం ప్రజలకు రాజ్యాంగ, ప్రజాస్వామ్య హక్కులను కల్పించి, భూ యాజమాన్య హక్కుల ద్వారా చారిత్రాత్మక పరివర్తనను తీసుకువచ్చిందని ఎన్‌సి అధినేత అన్నారు. 'షేర్–ఎ–కశ్మీర్ షేక్ మహమ్మద్ అబ్దుల్లా నాయకత్వంలో, చారిత్రాత్మక సంస్కరణలు పేదరికం, లేమి, నిరక్షరాస్యతను గణనీయంగా తగ్గించాయి. సరైన ప్రతిఫలం లేకుండా ఏళ్ల తరబడి భూమిని సాగు చేసుకున్న సామాన్య పౌరులు రాత్రికి రాత్రే భూస్వాములుగా మారేందుకు ఇవి దోహదపడ్డాయి' అని ఆయన అన్నారు. ఈ సంస్కరణలు పేదల జీవితాలను మార్చివేసి, మరింత సుసంపన్నమైన, స్థిరమైన సమాజానికి పునాది వేశాయన్నారు. రాజ్యాంగ రక్షణలు రాజ్యాంగ విరుద్ధంగా, అప్రజాస్వామిక పద్ధతిలో ఒక్కొక్కటిగా క్రమంగా క్షీణింపజేయబడ్డాయని, మిగిలినవన్నీ పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ క్రియాశీల మద్దతుతో 2019లో పూర్తిగా రద్దు చేయబడ్డాయని అబ్దుల్లా అన్నారు. తప్పుదోవ పట్టించే కథనాల పట్ల హెచ్చరిస్తూ, ఆర్టికల్ 370 పునరుద్ధరణే ఎన్‌సి ప్రధాన అజెండా అని, ఈ పోరాటం నుంచి వెనకడుగు వేసే ప్రసక్తే లేదని జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి అన్నారు. అన్ని పరిస్థితుల్లోనూ జమ్ముకశ్మీర్ ప్రజల హక్కుల కోసం పార్టీ పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య, రాజ్యాంగ హక్కుల పునరుద్ధరణ అంశాన్ని తమ పార్టీ ప్రతి వేదికపైనా నిరంతరం లేవనెత్తుతోందని నొక్కిచెబుతూ, ఎన్నికైన ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేయడానికి, అనవసరమైన అడ్డంకులు లేకుండా కీలక నిర్ణయాలు తీసుకోవడానికి రాష్ట్ర హోదాను తక్షణమే పునరుద్ధరించడం అత్యవసరం అని ఆయన అన్నారు. జమ్ముకశ్మీర్ వంటి సున్నితమైన ప్రాంతంలో ద్వంద్వ పాలన అస్థిరతకు, గందరగోళానికి దారితీయవచ్చని, ప్రజాస్వామ్యంలో, అత్యధిక మెజారిటీతో ఎన్నికైన ప్రభుత్వాన్ని విస్మరించలేమని, దాని పనితీరుకు ఆటంకాలను సమర్థించలేమన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్ షా ఎన్నికల తర్వాత వెంటనే రాష్ట్ర హోదాను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారని, కానీ ఎన్నికైన ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటిందని ఆయన తెలిపారు. కేంద్రం ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా తన హామీని నెరవేర్చాలి అని ఆయన అన్నారు. వీలైనంత త్వరగా రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు కూడా కేంద్రాన్ని ఆదేశించిందని, ఇకపై జాప్యానికి ఆస్కారం లేదని ఆయన పేర్కొన్నారు.

## సిక్కిం, ఈశాన్య ప్రాంతం దేశానికి అష్టలక్ష్మి లాంటివి

యాక్ట్ ఈస్ట్ పాలసీతో పాటు, ఈశాన్య ప్రాంత అభివృద్ధికి 'యాక్ట్ ఫాస్ట్ పాలసీని' అమలు చేస్తున్నాం : మోదీ

**గ్యాంగ్‌టక్ :** సిక్కిం, ఈశాన్య ప్రాంతం మన దేశానికి ముఖ్య భాగాలే కాదని, అవి అష్టలక్ష్మి లాంటివి అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. యాక్ట్ ఈస్ట్ పాలసీతో పాటు, ఈశాన్య ప్రాంత అభివృద్ధికి యాక్ట్ ఫాస్ట్ విధానాన్ని కూడా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. ఇది శ్రేయస్సు, సంపద, శుభప్రదమైన బహుముఖ స్వభావానికి ప్రతీక అని పేర్కొన్నారు. సిక్కిం ఆర్థిక వ్యవస్థకు పర్యాటక రంగమే ప్రధాన ఆధారం అని అన్నారు. రాష్ట్ర అనుసంధానాన్ని పెంచడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని, దీనివల్ల పర్యాటకుల రాక పెరుగుతుందని మోదీ అన్నారు. పర్యాటకుల రాకను పెంచడానికి, పశ్చిమ బెంగాల్‌లోని బాగ్‌డోగ్రా నుండి ఒక ఎక్స్‌ప్రెస్‌వేను, గ్యాంగ్‌టక్‌లో ఒక రింగ్ రోడ్డును నిర్మించడంతో సహా, సిక్కిం మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. సిక్కిం రాష్ట్ర ఏర్పాటుకు 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏడాది పొడవునా జరిగిన వేడుకల ముగింపును పురస్కరించుకుని గ్యాంగ్‌టక్ పాల్జోర్ స్టేడియంలో జరిగిన ఒక భారీ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. రాష్ట్రంలో రోప్‌వే, స్కైవే ప్రాజెక్టులు రానున్నాయని, అలాగే పర్యాటకుల రాకపోకలను పెంచేందుకు నాథులాలో ఒక ఎక్స్‌ప్రెస్‌వేను నిర్మించనున్నట్లు కూడా ఆయన తెలిపారు. రాష్ట్ర జీవవైవిధ్యం గురించి ప్రస్తావిస్తూ, 'సిక్కింలో ప్రకృతి, సంస్కృతి సజీవంగా ఉంటాయి. రాష్ట్రంలోని రోడ్ల పరిశుభ్రత, గాలి స్వచ్ఛత చూస్తే ఇక్కడి ప్రజలు ప్రకృతి పరిరక్షణకు నిజమైన బ్రాండ్ అంబాసిడర్లు అని తెలుస్తుంది' అని ఆయన అన్నారు. సేంద్రియ వ్యవసాయం వంటి కార్యక్రమాల ద్వారా సిక్కింతో సహా ఈశాన్య ప్రాంతం భవిష్యత్ వృద్ధికి, సుస్థిర అభివృద్ధికి కేంద్రంగా మారనుందని మోదీ ఉద్ఘాటించారు. మతం, రాజకీయ అనుబంధాల ఆధారంగా దేశాన్ని విభజించడానికి ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో, ఈ హిమాలయ రాష్ట్రం 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ఆయన అన్నారు. సిక్కింను 'తూర్పు స్వర్గధామం'గా అభివర్ణిస్తూ, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని, ముఖ్యంగా వివిధ రకాల ఆర్కిడ్ పుష్పాలను ఆస్వాదించడానికి పర్యాటకులు ఈ రాష్ట్రాన్ని సందర్శించాలని ప్రధానమంత్రి పిలుపునిచ్చారు.



**క్రీడాకారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధానమంత్రి**

ఉదయం వేళ యువ క్రీడాకారులతో కలిసి ఫుట్‌బాల్ ఆడిన ప్రధానమంత్రి, 'సిక్కింలో క్రీడా మౌలిక సదుపాయాలను పెంపొందించడానికి, ముఖ్యంగా ఫుట్‌బాల్, ఆర్చరీ వంటి క్రీడలలోని ప్రతిభను వెలికితీసి తీర్చిదిద్దడానికి ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని అని పేర్కొన్నారు. సిక్కిం అభివృద్ధి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేసి, వాటిని అటకెక్కించారంటూ గత కాంగ్రెస్ ప్రభుత్వాలపై విమర్శలు చేశారు. కాంగ్రెస్ పార్టీ నిర్లక్ష్యం చేసిన సిక్కిం, ఇతర ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి కోసం సాధ్యమైనదంతా నేను చేస్తాను. సిక్కింలో ఆరోగ్య సేవలను కాంగ్రెస్ పూర్తిగా విస్మరించింది' అని ప్రధానమంత్రి ఆరోపించారు.

## రైల్వే ట్రాక్‌పై ఉగ్ర పేలుడు

ఓ ఉగ్రవాది మృతి, మరో నలుగురు అరెస్టు



**చండీగఢ్ :** పాటియాలాలోని శంభు ప్రాంతం సమీపంలో ఉన్న ఒక సరుకు రవాణా రైల్వే ట్రాక్‌పై ఖలిస్తాన్ అనుకూల ఉగ్రవాద ముఠా సోమవారం అర్ధరాత్రి పేలుడుకు పాల్పడింది. పేలుడు పదార్థాలను పేల్చే ప్రయత్నంలో ఆ ముఠా సభ్యులలో ఒకరు మరణించినట్లు పోలీసులు మంగళవారం తెలిపారు. ఈ ముఠాకు చెందిన నలుగురిని అరెస్టు చేసినట్లు కూడా వారు పేర్కొన్నారు. శంభు–అంబాలా రైలు మార్గంపై సోమవారం రాత్రి జరిగిన ఈ పేలుడును మొదట స్వల్ప తీవ్రత గలదిగా వర్ణించారు. అయితే, ట్రాక్‌ను పేల్చివేయడానికే యత్నించినట్లు దర్యాప్తులో తేలిందని పోలీసులు తెలిపారు. బోథోనియా గ్రామ సమీపంలో సరుకు రవాణా రైళ్ల కోసం కేటాయించిన రైలు మార్గంపై ఈ పేలుడు సంభవించిందని, దీనివల్ల నష్టం జరగడంతో పాటు రైలు మార్గం కింద ఒక చిన్న గొయ్యి ఏర్పడిందని పోలీసులు తెలిపారు. గత మూడు నెలల్లో సరుకు రవాణా కారిడార్‌లో ఇది రెండవ పేలుడు అని పేర్కొంటూ, ఈ విషయంపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారణ జరిపే అవకాశం ఉందని ఒక సీనియర్ పోలీసు అధికారి సూచించారు. ఘటనా స్థలంలో ముక్కలు ముక్కలుగా పేలిపోయిన గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. రైల్వే ట్రాక్ వెంబడి శరీర భాగాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. పేలుడుకు ప్రయత్నించిన వ్యక్తి ఆ ప్రయత్నంలోనే మరణించాడని పాటియాలా ఎస్ఎస్‌పి వరుణ్ శర్మ తెలిపారు. మృతుడిని టర్న్‌తరన్ జిల్లాలోని పంజ్‌వార్ గ్రామానికి చెందిన జగ్రూప్ సింగ్‌గా పోలీసులు గుర్తించారు. పేలుడు జరిగిన ప్రదేశాన్ని సందర్శించిన స్పెషల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (రైల్వే) శశి ప్రభా ద్వివేది ప్రకారం, అమృత్‌సర్‌లో జగ్రూప్ తన మోటార్‌సైకిల్‌ను పార్క్ చేస్తున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజ్‌లో నమోదయ్యాయి. అరెస్టు చేసిన నలుగురిలో మాన్నా నివాసి ప్రదీప్ సింగ్ ఖల్సా; మాన్నాకు చెందిన కుల్విందర్ సింగ్; టర్న్‌టరన్‌కు చెందిన సత్నామ్ సింగ్, గుర్‌ప్రీత్ సింగ్ ఉన్నారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కుల్దీప్ చహల్ తెలిపారు. మలేషియాకు చెందిన ఖలిస్తాన్ అనుకూల హ్యాండ్లర్లతో సన్నిహిత సంబంధాలు ఉండటంతో, ప్రదీప్ ఖల్సాను ఈ ముఠాకు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. అతను తీవ్రవాద భావజాలం గల యువకులను ఉగ్రవాద శిక్షణ కోసం మలేషియాకు పంపి, ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహించేందుకు వారికి పనులు అప్పగించాడని డిఐజి తెలిపారు. అంతేకాకుండా, ప్రదీప్ 'చల్దా వహీర్ చక్రవర్తి, అత్తారియే' అనే తీవ్రవాద సంస్థను కూడా నడుపుతున్నాడని ఆయన అన్నారు. వారి వద్ద నుంచి ఒక హ్యాండ్ గ్రెనేడ్ రెండు పిస్టళ్లు, మందుగుండు సామగ్రి, భవిష్యత్తులో పేలుళ్లకు ఉద్దేశించిన ఇతర అధునాతన కమ్యూనికేషన్ పరికరాలు, ల్యాప్‌టాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారని ఆయన తెలిపారు. ఘటనా స్థలంలో విలేకరులతో మాట్లాడుతూ, పేలుడు జరిగిన సమయంలో ఒక గూడ్స్ రైలు వెళుతుండటంతో, లోకోమోటివ్ పైలట్‌కు ఏదో అసాధారణంగా అనిపించి, వెంటనే అప్రమత్తం చేసి అధికారులను అప్రమత్తం చేశారని ద్వివేది చెప్పారు. ఈ ఘటనలో ఎన్ఐఏ ప్రమేయం గురించి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా, ఇలాంటి ఘటనలు పదేపదే జరుగుతుండటంతో, ఎన్ఐఏ దర్యాప్తు జరిపే అవకాశం ఉందని ద్వివేది ధ్రువీకరించారు.

## కుక్కల వీరంగం.. యోగి సర్కార్‌పై అఖిలేష్ వ్యంగ్యాస్త్రాలు



**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో వీధి కుక్కల వీరంగంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ రాష్ట్రంలోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు. సర్ సుందర్ లాల్ ఆసుపత్రి (ఎస్ఎస్‌హెచ్‌బిహెచ్‌యు) లోపల తిరుగుతున్న వీధి కుక్కల చిత్రాలను ప్రభుత్వంపై మండిపడ్డారు. 'మీరు వారణాసిని క్యోటోగా మార్చలేకపోతే, కనీసం దానిని కుక్కలు లేని ప్రదేశంగానైనా మార్చండి' అని ఆయన అన్నారు. మంగళవారం నుండి తన పార్లమెంటరీ నియోజకవర్గమైన వారణాసిలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటనకు రానున్న నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. జపాన్‌లోని క్యోటో నగరం అనుభవాన్ని ఉపయోగించి వారణాసిని అభివృద్ధి చేయడానికి 2014లో కుదిరిన ఒప్పందాన్ని యాదవ్ పరోక్షంగా ప్రస్తావిస్తున్నట్లు తెలుస్తోంది. వారసత్వ సంపద పరిరక్షణ, నగర ఆధునీకరణ, కళలు, సంస్కృతి, విద్యా రంగాలలో సహకారం కోసం ఈ అవగాహన ఒప్పందం కుదిరింది. బిజెపి 'డబుల్ ఇంజిన్' నినాదాన్ని ప్రస్తావిస్తూ, రాష్ట్ర, కేంద్ర నాయకత్వాల మధ్య ఏమైనా విభేదాలు ఉన్నాయా అని యాదవ్ ప్రశ్నించారు. 'ఒకవేళ డబుల్ ఇంజిన్‌లో అంతర్గత విభేదాలు లేకపోతే, ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రితో మాట్లాడండి, యుపి ఆరోగ్య మంత్రి యోగక్షేమాలను సరిగ్గా విచారించండి, ఆయన ప్రస్తుత దయనీయ పరిస్థితిని చక్కదిద్దడానికి పూర్తి వైద్య పరీక్షలు, తగిన చికిత్స ఏర్పాటు చేసి, శాశ్వతంగా విశ్రాంతి కోసం ఇంటికి పంపండి. మరో మాటలో చెప్పాలంటే, ఆయనకు మంత్రి పదవీ బాధ్యతల నుంచి శాశ్వత సెలవు మంజూరు చేయండి' అని యాదవ్ ప్రధానమంత్రికి పరోక్ష సందేశం ఇచ్చారు. వారిలో వారే విభేదించుకుంటూ, మీ ప్రతిష్టను దెబ్బతీయాలనే లక్ష్యంతో 'డబుల్ ఇంజిన్' పన్నిన ఒకరకమైన 'ద్వంద్వ కుట్ర' ఇది కావచ్చునా?' అని ఎస్‌పి అధినేత అనుమానం వ్యక్తం చేశారు.

## థర్డ్‌జెండర్ ఓటర్లలో పుదుచ్చేరి అగ్రస్థానం



**న్యూఢిల్లీ :** ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో థర్డ్ జెండర్‌కు చెందిన ఓటర్ల పోలింగ్ శాతంలో పుదుచ్చేరి 91.81 శాతంతో అగ్రస్థానంలో నిలిచింది. ఎన్నికల సంఘం ఈనెల 9 నుండి 23 మధ్య వెల్లడించిన గణాంకాల ప్రకారం, పుదుచ్చేరిలో 139 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా, వారిలో 91.81 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమిళనాడులో 7,728 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా, 23న జరిగిన ఎన్నికల్లో వారిలో 60.49 శాతం మంది ఓటు వేశారు. పశ్చిమ బెంగాల్ (మొదటి దశ)లో 465 మంది ఓటర్లు ఉండగా, పోలింగ్ శాతం 56.79గా నమోదైంది. ఇతర రాష్ట్రాల విషయానికి వస్తే, అసోంలో 343 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉండగా పోలింగ్ శాతం 36.84గా ఉంది. అలాగే కేరళలో 277 మంది ఓటర్లు ఉండగా పోలింగ్ శాతం 57.04గా నమోదైంది. పశ్చిమ బెంగాల్‌లో మొదటి దశ పోలింగ్ 23న జరగగా, రెండవ, తుది దశ పోలింగ్ 29న జరగనుంది. తమిళనాడులో కూడా 23న ఎన్నికలు జరిగాయి. కాగా, కేరళ, అసోం, పుదుచ్చేరి రాష్ట్రాల్లో ఎన్నికలు 9న నిర్వహించబడ్డాయి. ఈ ఎన్నికల ఫలితాలన్నీ మే 4న వెల్లడించబడతాయి. థర్డ్‌జెండర్ చెందిన వ్యక్తులు ఓటర్లుగా నమోదు చేసుకునేటప్పుడు తమను తాము ఇతరులు లేదా 'ఒ' అనే విభాగంలో నమోదు చేసుకునేందుకు అనుమతించాలని మాజీ ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) నవీన్ చావ్లా కృషి చేశారు. ప్రస్తుతం ఎన్నికల సంఘం ఓటర్లను పురుషులు, స్త్రీలు, ఇతరులు (లేదా థర్డ్‌జెండర్)గా గుర్తించడం ద్వారా ఇదే విధానం అమలులో ఉంది.

## సరిహద్దులో శాంతి, సామరస్యం

చైనా,రష్యా రక్షణమంత్రులతో రాజ్‌నాథ్‌సింగ్ భేటీ



**న్యూఢిల్లీ:** కిర్గిజిస్థాన్ పర్యటనలో ఉన్న భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం రష్యా,చైనా దేశాల రక్షణమంత్రులతో సమావేశాలు నిర్వహించి ప్రాంతీయ భద్రతపై చర్చించారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) రక్షణమంత్రుల సమావేశం సందర్భంగా కిర్గిజిస్థాన్ రాజధాని బిష్కెక్‌లో చైనా రక్షణమంత్రి అడ్మిరల్ డాంగ్ జున్, రష్యా రక్షణమంత్రి ఆండ్రీ బెలవ్‌సోవ్‌లతో రాజ్‌నాథ్ సింగ్ వేరు వేరుగా సమావేశాలు జరిపారు. చైనా రక్షణమంత్రి డాంగ్ జున్‌తో సమావేశంలో ఇరు దేశాలమధ్య వాస్తవాధీన రేఖ (ఎల్ఎసి) సరిహద్దు వెంట శాంతి, సామరస్యం కొనసాగేవిధంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. సరిహద్దుల్లో భద్రతాపరమైన ఆందోళనలు చెలరేగుతున్న విషయాన్ని కూడా ఆయన చర్చించారు. రెండు దేశాలమధ్యా స్తంభించిన సంబంధాలను పునరుద్ధరించుకునే చర్యల్లో భాగంగా ఈ సమావేశం జరిగింది. ''చైనా రక్షణమంత్రి డాంగ్ జున్‌తో సమావేశం ఎంతో సంతోషం కలిగించింది'' అని సోషల్ మీడియా వేదికగా రాజ్‌నాథ్‌సింగ్ ఒక పోస్టింగ్ పెట్టారు. ఐతే అంతకుమించి ఎలాంటి వివరాలను ఆయన తెలియజేయలేదు. అదేవిధంగా రెండు దేశాల మంత్రులమధ్య హృదయపూర్వక వాతావరణంలో వివిధ సమస్యలపై అరమరికలు లేకుండా చర్చలు జరిగాయా?లేదా? అనే విషయాన్ని కూడా అధికార వర్గాలు ఒక ప్రకటన ద్వారా తెలియజేయలేదు. భారత్–చైనా మధ్య ఎల్ఎసి వద్ద పరిస్థితులపై చర్చించినట్లు మాత్రమే సమాచారం వెల్లడైం ది. ఆ వివరాలు కూడా పూర్తిగా తెలియజేయలేదు. వీరిద్దరిమధ్యా చర్చల్లో పశ్చిమాసియా సమస్య గురించి చర్చించారా? అనే అంశం కూడా బహిర్గతం కాలేదు. గడచిన కొద్ది నెలలుగా రెండు దేశాల నాయకులు స ంబంధాలను మెరుగుపరచుకోవడానికి వరు స సమావేశాలు నిర్వహిస్తున్నారు. 2020 జూన్ నెలలో గాల్వన్ లోయలో భారత్–చై నా సైనికుల మధ్య ప్రాణాంతకమైన ఘర్షణ లు జరిగిన తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితి నుండి బయట పడేందుకు దౌత్యమార్గాల్లో రెండు దేశాలు ప్రయత్నం చేస్తున్నాయి. 20245 అక్టోబరు నెలలో రెండు దేశాలు తమ తమ సైన్యాలను వెనక్కు మళ్ళించేందుకు ఒప్పందం చేసుకున్నాయి. ఆ మేరకు సైన్యాలను దెస్పాంగ్, డెమ్చోక్ సహా వెనక్కు కొన్ని ప్రాంతాల నుండి మళ్ళించాయి. ఇంకా పలు ప్రాంతాలలో సైన్యం అలాగే మిగిలిపోయింది. ఈ ఒప్పందం ఖరారైన తర్వాత ప్రధానమంత్రి నరేంద్రమోదీ,చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇద్దర కజాన్‌లో సమావేశమయ్యారు. సంబంధాల మెరుగుదలకు అనేక నిర్ణయాలు తీసుకున్నారు. గత ఏడాది ఆగస్టునెలలో ఎస్‌సిఓ సమావేశం సందర్భంగా మోదీ చైనా నగరం తియాన్‌జిన్‌లో పర్యటించారు. ఇక రష్యా రక్షణమంత్రి ఆండ్రీ బెలౌసోవ్‌తో కూడా రాజ్‌నాథ్ సమావేశం జరిపారు. రెండు దేశాలమధ్య ప్రస్తుతం కొనసాగుతున్న పలు ప్రాజెక్టుల గురించి వారిద్దరూ చర్చించారు. భారత్‌కు రష్యా సరఫరా చేయాల్సిన ఎస్–400 గగనతల రక్షణ క్షిపణుల గురించి కూడా చర్చించారు. బెలారస్ రక్షణమంత్రి లెఫ్టినెంట్ జనరల్ విక్టోర్ ఖ్రెనిన్‌తో కూడా రాజ్‌నాథ్‌సింగ్ సమావేశం నిర్వహించారు.

**పాసు బుక్కు పోయినది**

హనుమకొండ జిల్లా వేలేరు మండలం మల్లికుదుర్ల గ్రామానికి చెందిన **లక్కుంట్ల బ్రహ్మయ్య తండ్రి : వెంకట్రామయ్య**కు సంబందించిన తెలంగాణ పట్టాదారు పాస్ బుక్ ఖాతా నెంబర్ :616, పట్టా పాసు బుక్ నెం.T21100070489 నెంబర్ గల పట్టా దారు పాస్ బుక్కు ఫిబ్రవరి నెలలో తన కుమారుడైన **లాక్కుంట్ల రాములు** ఫిబ్రవరి నెలలో మల్లికుదుర్ల నుండి హనుమకొండకు బస్‌లో ప్రయాణం చేయుచుండగా పోయినది. ఇట్టి పట్టాదారు పాసు బుక్కు దొరికినవారు. ఈ క్రింది చిరునామాకు అందించగలరు.

ఇట్లు:
**లాక్కుంట్ల రాములు,**
**తండ్రి బ్రహ్మయ్య,**
గ్రామం : మల్లికుదుర్ల,
మండలం : వేలేరు
జిల్లా : హనుమకొండ,
పిన్ నెం : 506151.
**ఫోన్ నెంబర్ : 8978045164**

ప్రజాపక్షం
Telugu National Daily

మహబూబ్‌నగర్
బుధవారం
29-04-2026
www.prajapaksham.in



# బిఆర్ఎస్ జ్ఞానోదయం!

తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన భారత రాష్ట్ర సమితి–బిఆర్ఎస్ (పూర్వాశ్రమంలో తెలంగాణ రాష్ట్ర సమితి) 26వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జరిగిన సమావేశం ఆసక్తి కలిగించింది. సాధారణంగా జరిగే ప్లీనరీ కాకుండా ఈసారి రాష్ట్రంలోని అన్ని స్థాయిల ముఖ్యనేతలతో తెలంగాణ భవన్‌లో ప్రత్యేక సమావేశాన్ని బిఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థాగతపరమైన కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులో ముఖ్యమైనవి బిఆర్ఎస్ రాష్ట్ర కమిటీ మినహా అన్ని కమిటీల రద్దు, సభ్యత్వాల ప్రక్షాళన, అనుబంధ సంఘాల ఏర్పాటు వంటివి ఉన్నాయి. నిజానికి ప్లీనరీకి ముందే సభ్యత్వ నమోదు ప్రక్రియ పూర్తి చేసుకొని, ప్లీనరీలో నూతన నాయకత్వం ఎన్నిక చేసుకోవడం ఆనవాయితీ. గతంలో ఏడాదికొకసారి నాయకత్వం ఎన్నిక ఉండేది. కానీ, నాలుగేళ్ళకొకమారు ఎన్నుకునేలా పార్టీ నిబంధనావళిలో మార్పు చేసుకున్నారు. ఆ విధంగా చూసినా 2025 అక్టోబర్ నాటికి అధ్యక్షుడు సహా రాష్ట్ర కమిటీ గడువు ముగిసింది. నిబంధనావళి ప్రకారం ఈసారి పార్టీ సంస్థాగత ఎన్నికలు, ప్లీనరీ నిర్వహించుకోవాల్సింది. మండుతున్న ఎండల కారణంగా ప్లీనరీ బదులుగా ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని, త్వరలో కెసిఆర్ ఆధ్వర్యంలో మరోసారి సమావేశం నిర్వహించుకోవాలని నిర్ణయించుకున్నారు.

మొత్తం 60 లక్షలకు పైగా సభ్యత్వాలతో బలమైన ప్రాంతీయ పార్టీగా గతంలో బిఆర్ఎస్ ప్రచారం చేసుకుంది. సభ్యత్వ నమోదుకు సందుగొందులో టెంట్లు వేసి, సభ్యులకు బీమా సౌకర్యం కల్పించి మరీ చేర్పించుకున్నారు. అందులో వాసి కంటే రాశి ఎక్కువగా ఉన్న విషయం తెలిసిందే. ఇదే విషయాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అంగీకరిస్తూ నికరంగా ఎంత మంది సభ్యులు ఉన్నారో, అంతే సభ్యత్వం ఇవ్వమని పార్టీ నాయకులకు సూచించారు. కెసిఆర్ రెండవసారి ముఖ్యమంత్రి అయిన తరువాత పార్టీ అనుబంధ సంఘాలను క్రియారహితం చేశారు. ఆర్‌టిసిలో ఆ పార్టీ నేత హరీశ్‌రావు గౌరవాధ్యక్షుడిగా ఉన్న టిఎంయుకు 2019లో రాజీనామా చేయాల్సి వచ్చింది. కవిత గౌరవాధ్యక్షురాలిగా ఉన్న టిబిజికెఎస్ కూడా రెండవిడత అధికారంలో పెద్దగా పని చేయకపోడంతో గుర్తింపు ఎన్నికల్లో ఓడిపోయింది. ఉద్యమాలను అణిచివేసే క్రమంలోనే అనుబంధ సంఘాలను కెసిఆర్ పక్కనబెట్టారు. ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండడంతో వాటి ప్రాధాన్యత తెలియవచ్చింది. తక్షణమే యువజన, కార్మిక, మహిళా, రైతు సంఘాలను ఏర్పాటు చేసుకోవాలని, అనుబంధ విద్యార్థి సంఘం బిఆర్ఎస్‌వి కాలేజీ మొదలుకొని యూనివర్సిటీ వరకూ అన్ని విద్యా సంస్థల్లో ఉండాలని సూచించారు.

జిల్లాకొక యూట్యూబ్ ఛానల్ ఉంటే మూడోసారి అధికారంలోకి వచ్చేవారమనే బిఆర్ఎస్ నేతల ఆలోచనలకు కెసిఆర్ కళ్ళెం వేయడం విశేషం. సోషల్ మీడియాలోనే ఉంటామంటే కష్టమని, ప్రజాక్షేత్రంలో పని చేయాలని సన్నాయి నొక్కులు నొక్కారు. ఇటీవల సోషల్ మీడియా ప్రచారానికే ప్రాధాన్యతనిస్తున్న బిఆర్ఎస్ శ్రేణులకిది హెచ్చరికలాంటిది. మరో కీలకాంశం క్రియాశీలకంగా ఉంటేనే వచ్చే ఎన్నికల్లో టికెట్ల ఇస్తామనడం. సిట్టింగ్‌లకే స్థానాలనే గత నిర్ణయం నుంచి దూరం జరిగినట్లయింది. గతంలో బిఎస్‌పి నమూనాలో శాసనసభ్యులనే నియోజకవర్గ కమిటీలకు అధ్యక్షులుగా నియమించిన విధానంపై సైతం బిఆర్ఎస్ పునరాలోచనలో పడింది. ఆ విధానంతో ఎంఎల్‌ఎతో భిన్నించే పార్టీ నాయకులు, కేడర్‌కు ప్రాధాన్యత లేకుండా పోయిందని అర్థమైంది. అందుకే తిరిగి పార్టీని పట్టాలు ఎక్కించేందుకు పాతపద్ధతిని మార్చే యోచనలో ఉంది.

బిఆర్ఎస్ ముఖ్యనేతల సమావేశ నిర్ణయాలపై కొత్తగా పార్టీ ఏర్పాటు చేసుకున్న కవిత ప్రభావం కనపబడుతోంది. పార్టీ కమిటీల రద్దు నిర్ణయంతో పాటు, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై ఉద్యమించాలనే తీర్మానం అందులో భాగమేనని పరిశీలకులు భావిస్తున్నారు. కింది స్థాయిలో అసంతృప్త నాయకులు, కేడర్ పార్టీలో ఉన్న హోదాతో కొత్త పార్టీలో చేరకుండా ఉండేందుకే కమిటీల రద్దు నిర్ణయం వెనుక ఒక కారణమనుకుంటున్నారు. అలాగే గతంలో కవిత మహిళా రిజర్వేషన్‌పై ఉద్యమం చేశారు. ఆమె వైపు పార్టీ మహిళా కార్యకర్తలు మళ్ళకుండా ఉండేందుకు సైతం ఆ ఉద్యమాన్ని పార్టీపరంగా ఉధృతం చేయాలని తీర్మానించారు. గత ఎన్నికల్లో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన బిఆర్ఎస్ గ్రామాలలో పట్టుకోసం రైతు అంశాలపై ఉద్యమాలకు సిద్ధమవుతోంది. మొత్తానికి ప్రజాకోణంలో ఏ పార్టీలు తమను తాము మార్చుకున్న, వారికోసం పని చేసినా మంచిదే. అలా కాకుండా నాయకుల ఆలోచనలకు అనుగుణంగానే పార్టీలు ఉండాలంటేనే ప్రజాస్వామ్యంలో చుక్కెదురుకాక తప్పదు. ●



## మరో సత్యగ్రహం తప్పదు

ఢిల్లీ మద్యం స్కాం కేసు కోర్టుకు సంబంధించిన విషయం. తాము భారత న్యాయ వ్యవస్థను, కోర్టులను పూర్తిస్థాయిలో గౌరవిస్తాం. తమపై వచ్చిన ఆరోపణలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈకేసులో న్యాయవ్యవస్థ తమను నిర్దోషులుగా గుర్తించింది. అందుకే బెయిల్ మంజూరు చేసింది. తమ నిజాయతీకి ఇదే నిదర్శనం. ప్రస్తుతం తలెత్తిన కొన్ని అసాధారణ పరిస్థితుల కారణంగా తాను సత్యాగ్రహం చేయాల్సి వస్తోంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రజల ముందుకు వెళ్తా. మరో సత్యగ్రహం తప్పదు.

- ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్

## గణిత మంజరిలో అసత్యాలు




నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ రూపొందించిన కొత్త 9వ తరగతి గణిత పాఠ్యపుస్తకం, సింధుసరస్వతి నాగరికతను గ్రిడ్ ఆధారిత ఆలోచనను ఉపయోగించిన మొదటి క్రమబద్ధమైన నాగరికతగా పేర్కొంది. ఉజ్జయినీ (మధ్యప్రదేశ్) ప్రాచీన ప్రపంచంలో కేంద్ర రేఖాంశంగా గుర్తించబడిందని అలాగే ఆధునిక సంఖ్యా వ్యవస్థకు పునాది వేయడంలో ఋగ్వేదం కీలక పాత్ర పోషించిందని ఈ పుస్తకం తాతాచార్యులకు పీర్ల పండుగకు ముడిపెడుతోంది

**గణిత మంజరి పార్ట్ I**

9వ తరగతి గణిత పాఠ్యపుస్తకం 'గణిత మంజరి పార్ట్ I' పేరుతో 196 పేజీల ఈ పాఠ్యపుస్తకం గత వారం విడుదలైంది. 196 పేజీల ఈ పాఠ్యపుస్తకం ప్రాచీన గణిత పద్ధతులను మరియు అనేకమంది ప్రాచీన భారతీయ పండితుల కృషిని ప్రముఖంగా చూపుతుంది. పాత పాఠ్యపుస్తకం ప్రాచీన భారతదేశం గురించి పరిమితమైన సూచనలు మాత్రమే చేసేది. కానీ కొత్త పుస్తకం 'ఇండియన్ నాలెడ్జ్ సిస్టమ్'ని విస్తృతంగా అనుసంధానించింది. వేదాంగ జ్యోతిష్యం నుండి ఒక శ్లోకంతో ఇది ప్రారంభమవుతుంది, ఇది ఖగోళ శాస్త్రంపై ప్రపంచంలోని అత్యంత పురాతన గ్రంథాలలో ఒకటిగా ఎన్సీఈఆర్టీ పేర్కొంది.

ప్రాచీన భారతీయ గణిత శాస్త్రవేత్త బౌధాయనను 'కోఆర్డినేట్ జ్యామితికి పునాది వేసిన వ్యక్తి'గా ఈ పుస్తకం గుర్తిస్తోంది. 14వ శతాబ్దపు గణిత శాస్త్రవేత్త మాధవ 'కాల్కులస్ అని పిలువబడే గణిత రంగానికి జన్మనిచ్చారని' బ్రహ్మగుప్త 'సున్నా మరియు రుణ సంఖ్యలను బీజగణిత విలువలగా ఉపయోగించడాన్ని క్రమబద్ధీకరించారని' పేర్కొంది.

పాత 9వ తరగతి గణిత పాఠ్యపుస్తకం సింధు లోయ నాగరికతను ప్రస్తావిస్తూ, 'అత్యంత అభివృద్ధి చెందిన మరియు ప్రణాళికాబద్ధమైన' నగరాలు, కొలతల (మెన్సురేషన్) వాస్తవిక వినియోగం గురించి పేర్కొంది. యజ్ఞగుండాల నిర్మాణానికి ఉపయోగించే వైదిక కాలపు 'సుల్బసూత్రాల' (జ్యామితీయ నిర్మాణాల మాన్యువల్స్) గురించి కూడా ప్రస్తావించింది. అయితే, ఈ అభివృద్ధిని పాత పాఠ్యపుస్తకం 'ప్రయోగాత్మకమైనది' 'క్రమబద్ధీకరణ లేనిది' అని పేర్కొంది.

కొత్త పాఠ్యపుస్తకం ప్రకారం, 'గ్రిడ్ ఆధారిత ఆలోచన' అంతరిక్షంలోని బిందువుల స్థానాలను నిర్వచించడానికి అవసరమైన జ్యామితి 'భారతదేశంలో లోతైన మూలాలను కలిగి ఉంది'. సింధుసరస్వతి నాగరికతలో వేల సంవత్సరాల క్రితమే నగర వీధులు ఖచ్చితత్వంతో నిర్మించబడ్డాయని, ఇది అప్పటికే ఒక కోఆర్డినేట్ వ్యవస్థ అని పుస్తకం పేర్కొంది. బౌధాయన తూర్పు పడమర ఉత్తరదక్షిణ రేఖలను ఉపయోగించి 'బౌధాయనపైథాగరస్ సిద్ధాంతాన్ని' అభివృద్ధి చేశారని, తద్వారా కోఆర్డినేట్ జ్యామితికి పునాది వేశారని ఈ పుస్తకం పేర్కొంది. అదే అధ్యాయంలోని ఒక పేరా ఇలా చెబుతోంది, 'ప్రాచీన ప్రపంచంలో కనీసం క్రీస్తుపూర్వం 4వ శతాబ్దం నాటి సిద్ధాంతాలలో ఉజ్జయినీని కేంద్ర రేఖాంశంగా పేర్కొన్నారు, దీని ఆధారంగానే ఇతర ప్రాంతాల దూరాన్ని కొలిచేవారు'.

నాలుగు క్వాడ్రంట్ల కార్టీసియన్ విమానాలను బ్రహ్మగుప్త పని లేకుండా అధ్యయనం చేయడం 'అసాధ్యం' అని, ఎందుకంటే ఆయన సున్నా, రుణ సంఖ్యలను బీజగణిత విలువలగా క్రమబద్ధీకరించారని ఈ పుస్తకం పేర్కొంది. పాత పాఠ్యపుస్తకంలో సున్నా ఆవిష్కరణ గురించి చర్చించలేదు. కొత్త పుస్తకం సున్నా మూలాలను ప్రాచీన భారతీయ ఆలోచనలకు ఆపాదిస్తూ, ఋగ్వేదం '10 ఘాతాల (పవర్స్ ఆఫ్ 10) ఆధారంగా సంఖ్యా వ్యవస్థకు పునాది వేసింది' అని పేర్కొంది.

ఉపనిషత్తులు, బౌద్ధ సాహిత్యంలో 'శూన్యత' అనే భావన ధ్యానం మరియు నిశ్చలతతో ముడిపడి ఉందని, ఇది గణితశాస్త్రంలో సున్నాగా పరిణామం చెందిందని పుస్తకం వివరిస్తుంది. పాత పాఠ్యపుస్తకం ఆర్యభట్ట గురించి క్లుప్తంగా పేర్కొంటే, కొత్త పుస్తకం 499 సీఈలో ఆయనపై విలువను 62832/20000 = 3.1416గా ఇచ్చారని, దీన్ని 'ఆసన్న' (సుమారుగా) అని వర్ణించారని పేర్కొంది. అలాగే, బ్రహ్మగుప్త సూచించిన 3.1622 విలువను అరబ్ ప్రపంచం, మధ్యయుగ ఐరోపా శతాబ్దాల పాటు అనుసరించాయని తెలిపింది. మాధవ యొక్క 'అనంత శ్రేణి' సూత్రం గణిత శాస్త్రంలో ఒక 'పెద్ద మార్పు' అని పేర్కొంది. వృత్తాలను కత్తిరించడం నుండి సంఖ్యల విశ్లేషణాత్మక మొత్తం వరకు, మాధవ కాల్కులస్ అనే గణిత రంగానికి జన్మనిచ్చారు. పాత పాఠ్యపుస్తకం, 'గ్రీకు మేధావి ఆర్కిమెడిస్‌పై దశాంశ విస్తరణలో అంకెలను లెక్కించిన మొదటి వ్యక్తి' అని పేర్కొంది. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ దినేష్ ప్రసాద్ సక్లానీ తన ముందుమాటలో, 'ఈ పాఠ్యపుస్తకం భారతదేశంలో వేల సంవత్సరాల గణిత చరిత్రను హైలైట్ చేస్తుంది' అని పేర్కొన్నారు. ఎన్‌సిఎఫ్‌ఎస్‌ఇ 2023, జాతీయ విద్యా విధానం 2020కి అనుగుణంగా, ప్రిన్స్‌టన్ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్ మంజుల్ భార్గవ సహా 26 మంది సభ్యుల బృందం ఈ పుస్తకాన్ని రూపొందించింది. ఎనిమిది అధ్యాయాలు కలిగిన 'పార్ట్ 1', 2026–27 విద్యా సంవత్సరం నుంచి అమలు చేయబడుతుంది.

అయితే, ఈ పుస్తకం వాదనలను కొందరు నిపుణులు వ్యతిరేకించారు. ముంబై విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ ఎస్.జి. దని మాట్లాడుతూ, బౌధాయన పైథాగరస్ సిద్ధాంతం కోఆర్డినేట్ వ్యవస్థ గురించి లేదా పొడవుల గురించి కాదని, వైశాల్యం గురించి అని చెప్పారు. 'ఇక్కడ చేసిన పోలిక చాలా అసంబద్ధమైనది' అని ఆయన అన్నారు.

శివ నాడార్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అంబర్ హబీబ్ బ్రహ్మగుప్తపై కొన్ని వాదనలను ఖండించారు. 'బ్రహ్మగుప్తను రుణ సంఖ్యల సృష్టికర్తగా చూపడం తప్పు. ఆయన కంటే వెయ్యి సంవత్సరాల ముందే చైనీస్ గణిత శాస్త్రవేత్తలు రుణ సంఖ్యలను ఉపయోగించారు' అని ఆయన పేర్కొన్నారు. మాధవ పని ఆధునిక కాల్కులస్‌కు ముందడుగు అని, అయితే ఇది మొట్టమొదటిది కాదని, గ్రీకు గణిత శాస్త్రవేత్త ఆర్కిమెడిస్ 16 శతాబ్దాల ముందే ఈ రంగంలో కృషి చేశారని హబీబ్ చెప్పారు.

– డా.ఎం.సురేష్ బాబు, ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షుడు

## మరో సంచలనానికి బీజం వేయనున్న అమెరికా మధ్యంతర ఎన్నికలు!

# కాంగ్రెస్ బరిలో వామపక్ష డెమొక్రాట్ సైకత్ చక్రవర్తి సై

సాత్యకి చక్రవర్తి

ఈ ఏడాది నవంబర్‌లో అమెరికాలో జరగనున్న కీలకమైన మధ్యంతర ఎన్నికలకు కేవలం ఆరు నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఈ ఎన్నికలలో బెర్నీ సాండర్స్ (వామపక్షవాద అనుకూల అమెరికన్ సీనియర్ సెనేటర్) వర్గానికి చెందిన వామపక్ష డెమొక్రాట్లు పెద్ద సంఖ్యలో లాంఛనంగా పోటీ చేసేందుకు వీలుగా ఈ ఏడాది జూన్‌లో జరిగే ప్రైమరీల పోటీలలోకి ప్రవేశించారు. 2028 నవంబర్‌లో జరిగే తుది అధ్యక్ష, కాంగ్రెస్, సెనేట్ ఎన్నికలకు ముందు, 2026 మధ్యంతర ఎన్నికలు అధికార రిపబ్లికన్‌లకు, ప్రతిపక్ష డెమొక్రాట్లకు మధ్య జరిగే ఒక సెమీఫైనల్ లాంటివి.

ఈ ఏడాది నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలలో, 100 సెనేట్ స్థానాలలో మూడింట ఒక వంతుతో పాటు మొత్తం 535 కాంగ్రెషనల్ స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. డెమొక్రాట్లు పార్టీ సంప్రదాయ అభ్యర్థులనే బరిలోకి దించే అవకాశం ఉండగా... సాండర్స్ గ్రూప్ మాత్రం సామాన్య అమెరికన్‌ల డిమాండ్‌ల కోసం పోరాడే, రాజకీయ రంగంలో మరింత క్రియాశీలంగా వ్యవహరించే యువ అభ్యర్థులను నిలబెట్టి, వారికి సవాలు విసురుతోంది. ఈ వామపక్ష అభ్యర్థులు జూన్‌లో జరగనున్న ప్రైమరీ ఎన్నికల కోసం ప్రచారం ప్రారంభించారు. ఆ ఎన్నికలలో గెలిస్తేనే, నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలకు వారు అధికారిక డెమొక్రాటిక్ అభ్యర్థులుగా నామినేట్ అవుతారు.

యువ అభ్యర్థులలో 40 సంవత్సరాల భారతీయ అమెరికన్ సైకత్ చక్రవర్తి ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. ఎందుకంటే, ఆయన కాలిఫోర్నియాలోని కాంగ్రె స్ సీటు కోసం పోటీ పడుతున్నారు. ఈ సీటు నుంచి చాలా కాలంగా సీనియర్ డెమొక్రాట్ నాన్సీ పెలోసీ ప్రాతినిధ్యం వహిస్తోంది. ప్రస్తుతం 85 ఏళ్ల వయసు కలిగిన పెలోసీ, డెమొక్రాటిక్ పార్టీ హయాంలో అమెరికా సంయుక్త రాష్ట్రాల కాంగ్రెస్ స్పీకర్‌గా పనిచేశారు. సీనియర్ డెమొక్రాట్ స్కాట్ వీనర్‌కు వ్యతిరేకంగా సైకత్ ఈ కీలకమైన సీటులో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు ప్రకటించారు. తాజా అభిప్రాయ సేకరణల ప్రకారం, సైకత్ ఆయన కంటే కేవలం ఐదు పాయింట్లు మాత్రమే వెనుకబడి ఉన్నారు. జూన్ ప్రైమరీ ఎన్నికలకు ముందే ఆయన ఈ అంతరాన్ని పూడ్చే అవకాశం ఉందని సమాచారం. ఒకవేళ ఆయన గెలిస్తే, నవంబర్‌లో జరిగే మధ్యంతర ఎన్నికలలో పోటీ చేస్తారు. కాలిఫోర్నియా డెమొక్రాట్లకు కంచుకోట కావడంతో 64 శాతానికి పైగా ప్రజలు వారికి మద్దతు ఇస్తున్నారు. కాబట్టి ఆయన విజయం ఖాయం.

> *సాండర్స్ గ్రూప్ మాత్రం సామాన్య అమెరికన్‌ల డిమాండ్‌ల కోసం పోరాడే, రాజకీయ రంగంలో మరింత క్రియాశీలంగా వ్యవహరించే యువ అభ్యర్థులను నిలబెట్టి, వారికి సవాలు విసురుతోంది. ఈ వామపక్ష అభ్యర్థులు జూన్‌లో జరగనున్న ప్రైమరీ ఎన్నికల కోసం ప్రచారం ప్రారంభించారు. ఆ ఎన్నికలలో గెలిస్తేనే, నవంబరులో జరిగే మధ్యంతర ఎన్నికలకు వారు అధికారిక డెమొక్రాటిక్ అభ్యర్థులుగా నామినేట్ అవుతారు.*

### డెమొక్రాటిక్ పార్టీలో పుంజుకుంటున్న వామపక్ష వర్గం

అమెరికా సంయుక్త రాష్ట్రాలలో సెనేటర్ బెర్నీ సాండర్స్ నేతృత్వంలో డెమొక్రాటిక్ పార్టీలోని వామపక్ష వర్గం పుంజుకుంటోంది. గత ఏడాది నవంబర్‌లో జరిగిన న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ సాధించిన అద్భుత విజయం తర్వాత, భారత సంతతికి చెందిన మరో డెమొక్రాట్ సైకత్ చక్రవర్తి ప్రచారం, దానికి యువత నుంచి వస్తున్న స్పందన అమెరికా రాజకీయ పరిశీలకుల దృష్టిని బాగా ఆకర్షించింది. 2016 అధ్యక్ష అభ్యర్థి ఎన్నికల్లో బెర్నీ సాండర్స్ ప్రచార బృందంతో కలిసి పనిచేసినప్పటి నుంచి డెమొక్రాటిక్ పార్టీని మార్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న విజయవంతమైన కార్యకర్త నేపథ్యం సైకత్‌కు ఉంది. ఈ విషయం రిపబ్లికన్, డెమొక్రాటిక్ పార్టీ నాయకత్వాలలో కలకలం రేపింది. సాండర్స్ నామినేషన్ గెలుచుకోలేకపోయినప్పటికీ, ఎన్నికల ప్రచారాన్ని నడిపించడంలో తనకున్న నైపుణ్యానికి సైకత్ ప్రశంసలు అందుకున్నారు.

బెర్నీ సాండర్స్ 2016 డెమొక్రాటిక్ అధ్యక్ష అభ్యర్థిత్వం ఎన్నికల ప్రచారం నుంచి, ఇటీవల డెమొక్రాటిక్ పార్టీని పునర్నిర్మించడానికి ప్రయత్నిస్తున్న వామపక్ష ఉద్యమంలో సైకత్ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. సాండర్స్‌కు 2016 ప్రచారంలో పనిచేసిన తర్వాత జో క్రౌలీకి వ్యతిరేకంగా అలెగ్జాండ్రియా ఒకాసియో–కోర్టెజ్ (ఎఒసి)కు 2018లో చేసిన విజయవంతమైన ప్రచారాన్ని సైకత్ నిర్వహించారు. ఆ తర్వాత ఆయన ఆమెకు చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా పనిచేస్తూ, ఆమె గ్రీన్ న్యూ డీల్ ప్రతిపాదనను ప్రారంభించారు.

ఇప్పుడు సైకత్ స్వయంగా కాంగ్రెస్‌కు పోటీ చేస్తున్నారు. 2024 అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్ చేతిలో డెమొక్రాట్లు ఎదుర్కొన్న అవమానకరమైన ఓటమి తనను పోటీ చేయడానికి ప్రేరేపించిందని సైకత్ అంటున్నారు. దూకుడుగా సాగే ప్రభుత్వ ప్రణాళిక,


సైకత్ చక్రవర్తి




పెట్టుబడి ద్వారా అమెరికా ఆర్థిక వ్యవస్థను మార్చడమే లక్ష్యంగా పెట్టుకున్న 'మిషన్ ఫర్ అమెరికా' అనే ప్రతిష్ఠాత్మక కార్యక్రమం చుట్టూ ఒక జాతీయ ఉద్యమాన్ని నిర్మించాలని ఆయన ఆశిస్తున్నారు. ఇది గ్రీన్ న్యూ డీల్‌కు ఒకరకమైన ఆధ్యాత్మిక వారసత్వం లాంటిది.

### సైకత్ కుటుంబ నేపథ్యం ఇదే...

అమెరికన్ వామపక్ష పత్రిక 'జాకోబిన్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో సైకత్ ఇలా అన్నారు: ''మా తల్లిదండ్రులు 20 డాలర్ల కన్నా తక్కువ డబ్బుతో ఇక్కడికి వచ్చారు. వారు, ముఖ్యంగా మా నాన్న భారతదేశంలో పేదరికంలో పెరిగారు. దేశ విభజన సమయంలో నిరాశ్రయులైన తర్వాత, పది మంది సభ్యులు ఉన్న ఆయన కుటుంబం ఒక పాడుబడిన ఇంట్లో నివసించి, ఆ తర్వాత సింగిల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్‌కు మారారు. ఆయన తరచుగా రోజుల తరబడి ఆహారం లేకుండా గడిపేవారు. కానీ మా తాత ఉపాధ్యాయులు కావడం, ఆయనే చుట్టుపక్కల పిల్లలందరి కోసం స్థానిక ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించిన కారణంగా, ఆయన మంచి విద్యను పొందగలిగారు, ఇది ఆయన అదృష్టం.''

''యునైటెడ్ స్టేట్స్‌లో మా నాన్నకు ఎలాంటి పరిచయాలు లేకపోయినప్పటికీ, ఇక్కడికి వచ్చిన వారం రోజుల్లోనే ఉద్యోగం సంపాదించగలిగారు. ఒకే ఆదాయంతో, నాకు, నా కుటుంబానికి ఒక స్థిరమైన, మధ్యతరగతి జీవితాన్ని అందించగలిగారు. నేను పెరిగేటప్పుడు, నాకు కావలసినవన్నీ ఉండేవి: తలదాచుకోవడానికి ఒక ఇల్లు, తినడానికి తిండి, టెక్సాస్‌లోని ఫోర్ట్ వర్త్‌లో ఒక గొప్ప ప్రభుత్వ పాఠశాల విద్య.'' అని వివరించారు.

''మా తల్లిదండ్రుల కథ ఎంతో సాధారణమైనది. ఆ కారణంతోనే అది ఎల్లవేళలా నా మదిలో నిలిచిపోయింది. ఆ సమయంలో ఇక్కడికి వచ్చిన లక్షలాది మంది వలసదారులకు ఇలాంటి కథే ఉంది. అలాగే, న్యూ డీల్ మొదలుకొని 1970ల వరకు, వందల మిలియన్ల మంది అమెరికన్లు మానవాళి చరిత్రలోనే ఆదాయాలు, జీవన ప్రమాణాలలో అతిపెద్ద పురోగతిని సాధించారు. ఆ ఘనత నన్ను ఎల్లప్పుడూ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మనం దానిని మళ్ళీ సాధించగలమనే నమ్మకమే గత దశాబ్ద కాలంగా నా రాజకీయాలకు, నా పనికి ప్రధాన చోదక శక్తిగా ఉంది.''

అమెరికాలో తన పెంపకం గురించి సైకత్ వివరిస్తూ : '' నేను పెరిగేటప్పుడు, కాలేజీ చదివేటప్పుడు రాజకీయాలకు చాలా దూరంగా ఉండేవాడిని. కాలేజీ తర్వాత, టెక్ రంగంలో పనిచేయడానికి నాకు మొదటి అవకాశం రాగానే శాన్ ఫ్రాన్సిస్కోకు వచ్చాను, ఎందుకంటే ప్రపంచంలోని అతిపెద్ద సమస్యలను టెక్నాలజీతో పరిష్కరించవచ్చని నేను అమాయకంగా నమ్మాను.

> *గత ఏడాది నవంబర్‌లో జరిగిన న్యూయార్క్ మేయర్ ఎన్నికల్లో 33 ఏళ్ల జోహ్రాన్ మమ్దానీ సాధించిన అద్భుత విజయం తర్వాత, భారత సంతతికి చెందిన మరో డెమొక్రాట్ సైకత్ చక్రవర్తి ప్రచారం, దానికి యువత నుంచి వస్తున్న స్పందన అమెరికా రాజకీయ పరిశీలకుల దృష్టిని బాగా ఆకర్షించింది.*

అయితే, టెక్ రంగంలో కొన్ని సంవత్సరాలు పనిచేసిన తర్వాత, సమాధానాలు అక్కడ లేవని నాకు తెలిసింది. అందుకే నేను ఆ ఉద్యోగాన్ని వదిలేశాను.

ఈ రోజు ఇది చెప్పడానికి కొంచెం అతిగా అనిపించవచ్చు, కానీ నేను పరిష్కరించాలనుకున్న సమస్యల జాబితాను నిజంగానే తయారుచేశాను. అందులో: అసమానత, పేదరికం, వాతావరణ మార్పు ఉంది. ఆ తర్వాత 2016లో బెర్నీ సాండర్స్ సరిగ్గా అవే విషయాల గురించి మాట్లాడుతూ అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆయన కొత్తదనం కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్న ప్రజలతో స్టేడియంలను నింపడం ప్రారంభించారు. అందుకే నేను కూడా ఆయనతో చేరాను!''

### గ్రీన్ న్యూ డీల్ అంటే...

వామపక్ష కాంగ్రెస్ సభ్యులు ప్రతిపాదించిన గ్రీన్ న్యూ డీల్‌కు ప్రధాన సూత్రధారి కావడంతో సైకత్‌కు మంచి పేరు వచ్చింది. సైకత్ ప్రకారం, ''గ్రీన్ న్యూ డీల్ అనేది డెమొక్రాట్లు దేని కోసం నిలబడాలనే దానిపై మా దృష్టి: వాతావరణ మార్పును ఎదుర్కోవడం ద్వారా మన ఆర్థిక వ్యవస్థను ఉన్నతీకరించడానికి, అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టే ఒక ప్రణాళిక. ఈ ప్రక్రియలో లక్షలాది అధిక వేతన ఉద్యోగాలను సృష్టించడం. అలెగ్జాండ్రా, కార్బిన్, నేను, ఇతరులు జస్టిస్ డెమొక్రాట్(డెమొక్రాటిక్ పార్టీలో విధాన మార్పు కోసం పని చేస్తున్న బృందం), ఆ తర్వాత ఏఓసీ ఎన్నికల ప్రచారంలో పనిచేస్తుండగా పొలిటికల్ కన్సల్టెంట్ జాక్ ఎక్స్‌లీలు న్యూ కాన్సెన్సస్ (నూతన ఏకాభిప్రాయం) కోసం ప్రచారంలో నిమగ్నమై ఉన్నాం.''

ఏఓసీ గెలిచిన తర్వాత, గ్రీన్ న్యూ డీల్‌ను ప్రారంభించడానికి సైకత్, ఆయన బృందం మూడు అంచెల వ్యూహా న్ని అనుసరించారు. ఆయన రాజకీయ మద్దతు కూడగట్టడానికి అంతర్గతంగా పని చేయగా, ప్రచార కార్యక్రమాల ద్వారా ఆయనకు పరిచయమైన రాజకీయ బృం దం సన్‌రైజ్ మూవ్‌మెంట్, దాని ప్రతినిధులు, అధ్యక్ష అభ్యర్థులపై ఒత్తిడి తెచ్చేందుకు బయట పనిచేసింది. అదే సమయంలో, న్యూ కాన్సెన్సస్ గ్రీన్ న్యూ డీల్‌లోని ఆలోచనలకు పూర్తి రూపాన్ని ఇచ్చి, వాటిని విద్యావేత్తలు, పాత్రికేయులకు తెలియజేయడానికి కృషి చేసింది (ఇది ప్రారంభమైనప్పుడు జోసెఫ్ స్టిగ్లిట్జ్, పాల్ క్రుగ్‌మెన్ వంటి వారు దీనికి అనుకూలంగా ముందుకు రావడానికి ఇది ఒక పెద్ద కారణం).

దేశం కోసం ఒకే దార్శనికతతో ఏకతాటిపై ఉన్న అంతర్గత వ్యక్తులు, బాహ్య ఉద్యమంతో కలిసి పని చేయడం ఎంత శక్తివంతంగా ఉంటుందో ఆ అనుభవం తనకు తెలియజేసిందని సైకత్ అన్నారు. భవిష్యత్తుపై ఒక స్పష్టమైన దార్శనికత కోసం ప్రజలు ఆకలితో ఎదురుచూస్తున్న ఈ తరుణంలో, వాషింగ్టన్ డిసిలో కొత్త ఆలోచనలను ముందుకు తీసుకెళ్లడం మనం అనుకున్న దానికంటే సులభమని ఆయన తెలుసుకున్నారు. ''కేవలం ఒక్క కాంగ్రెస్ సభ్యుడితోనే మనం గ్రీన్ న్యూ డీల్‌ను చేయగలిగితే, డజన్ల కొద్దీ లేదా వందల కొద్దీ కాంగ్రెస్ సభ్యులు నిజమైన లక్ష్యంతో, అత్యవసరంగా పనిచేస్తే ఏమి సాధ్యమవుతుంది?'' అని ఆయన అన్నారు. వాషింగ్టన్ డి.సి.లో కొందరిని ఇబ్బంది పెట్టిన తర్వాత, సైకత్ 2019 చివరిలో ఏఓసి కార్యాలయాన్ని విడిచిపెట్టి శాన్ ఫ్రాన్సిస్కోకు తిరిగి వచ్చారు. అప్పటి నుండి, ఆయనను గ్రీన్ న్యూ డీల్ వారసత్వ సంస్థ అయిన న్యూ కాన్సెన్సస్‌లో 'మిషన్ ఫర్ అమెరికా' కోసం పనిచేస్తున్నారు.

### సైకత్ ఎందుకు పోటీ చేయాలనుకున్నాడు?

వాషింగ్టన్ డి.సి.ని విడిచిపెట్టి శాన్‌ఫ్రాన్సిస్కోకు తిరిగి వచ్చినప్పుడు తన ప్రణాళిక, న్యూ కాన్సెన్సస్‌లో పనిచేయడం కొనసాగించడం, కార్పొరేట్ యథాతథ స్థితిని తిరస్కరించి, శ్రామిక వర్గ ప్రజల హక్కుల కోసం పోరాడే రాజకీయ అభ్యర్థులకు మద్దతు ఇవ్వడమేనని సైకత్ చెప్పారు. తానే స్వయంగా కాంగ్రెస్ అభ్యర్థి కావాలని అనుకోలేదు. కానీ ఈ గత ఎన్నికలు ఆయన మనసు మార్చాయి.

సాంప్రదాయ శ్రామిక వర్గంలోకి, బహుళ జాతుల డెమొక్రాటిక్ ఓటర్లలోకి గతంలో ఏ రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి కన్నా ట్రంప్ ఎక్కువగా చొచ్చుకుపోవడం డెమొక్రాట్లకు ఒక మేల్కొలుపు అవుతుందని ఆయన భావించాడు. ముఖ్యంగా, మొదటిసారి చేసినట్లుగా ఆయన విజయాన్ని వారు యాదృచ్ఛికంగా జరిగిందని కొట్టిపారేయలేరు. ట్రంప్ గెలుపు అమెరికాను నిరంకుశత్వం, ఫాసిజంలోకి నెట్టివేస్తుందని ఎన్నికల సమయంలో డెమొక్రాట్లు మాకు పదే పదే చెప్పినందున, వారు ట్రంప్, నిరంకుశ మితవాదుల నుండి వచ్చే ముప్పును తీవ్రంగా పరిగణిస్తారని ఆయన భావించాడు. కానీ ఆ తర్వాత, ట్రంప్ గెలుపు, అధికారాన్ని సుస్థిరం చేసుకోవడానికి ట్రంప్ చేసిన దృఢమైన ప్రయత్నాల నేపథ్యంలో డెమొక్రాటిక్ నాయకులు వాస్తవానికి ఎలా వ్యవహరించారో ఆయన చూశాడు. ఈ ఎన్నికల తర్వాత నాన్సీ పెలోసీ ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, డెమొక్రాట్లు ఏ తప్పూ చేయలేదని, వారు మారాల్సిన అవసరం లేదని చెప్పడం ఆయన విన్నాడు.

ఈ యువ డెమొక్రాట్ ప్రకారం, డెమొక్రాట్లకు ఒక కొత్త ఆర్థిక దృక్పథం, అలాగే కొత్త నాయకత్వం అవసరం. ఇక్కడ శాన్ ఫ్రాన్సిస్కోలో, దశాబ్దాలుగా పెలోసీకి మద్దతు ఇస్తూ, ఆమె గతంలో చేసిన పనిని గాఢంగా గౌరవించే వారు కూడా ఇప్పుడు మార్పునకు సమయం ఆసన్నమైందని విశ్వసిస్తున్నారు. కానీ డెమొక్రాటిక్ పార్టీలో ఉన్న ప్రగాఢమైన అధికార శ్రేణి, సీనియారిటీకి ఇచ్చే గౌరవం కారణంగా ఆమెకు వ్యతిరేకంగా పోటీ చేసి తమ రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టడానికి మరెవరూ సిద్ధంగా లేరు. 'అందుకే, నేను కాకపోతే ఇంకెవరు?' అనిపించే క్షణాల్లో అది ఒకటి. పోటీ చేయ డం నా బాధ్యతగా భావించాను.' అని సైకత్ వివరించారు.

'కార్మికుల జీవితాలను నాటకీయంగా మెరుగుపరిచే ఒక నూతన ఆర్థిక వ్యవస్థ కోసం, సమాజం కోసం పోరాడటానికి సిద్ధంగా ఉన్న అభ్యర్థుల జాతీయ ఉద్యమానికి నాందీ పలకాలనే ఉద్దేశ్యంతో నేను పోటీ చేస్తున్నాను' అని సైకత్ అన్నారు. ఏ ఒక్క అభ్యర్థి ఒంటరిగా ఈ పని చేయలేడు. అందుకే దేశంలో వివిధ ప్రాంతాల నుంచి అభ్యర్థులను ఎంపిక చేస్తున్నాం. '2026 కోసం కొద్దిమందిని, 2028 కోసం ఒక పెద్ద వెల్లువను సిద్ధం చేస్తూ, నాతో చేరడానికి దేశవ్యాప్తంగా ఇతరులను నేను సమీకరిస్తున్నాను' అని ఆయన చెప్పారు. 'న్యూ డీల్‌తో ప్రారంభమై 1970ల వరకు కొనసాగిన ఆదాయాలు, జీవన ప్రమాణాలలో వచ్చిన ఆ భారీ పురోగతిని... స్వచ్ఛమైన, న్యాయమైన ఆర్థిక వ్యవస్థను నిర్మిస్తూనే, మనం మళ్ళీ సాధించగలం. ఒకవేళ మనం అలా చేయలేకపోతే... ప్రజలకు అవసరమైన వాటిని ప్రజాస్వామ్యం అందించగలదని మనం నిరూపించలేకపోతే... అప్పుడు ప్రజలు అన్నీ చేస్తానని వాగ్దానం చేసే నిరంకుశ పాలకుడికే ఓటు వేస్తారు.'

> *ఈ యువ డెమొక్రాట్ ప్రకారం, డెమొక్రాట్లకు ఒక కొత్త ఆర్థిక దృక్పథం, అలాగే కొత్త నాయకత్వం అవసరం. ఇక్కడ శాన్ ఫ్రాన్సిస్కోలో, దశాబ్దాలుగా పెలోసీకి మద్దతు ఇస్తూ, ఆమె గతంలో చేసిన పనిని గాఢంగా గౌరవించే వారు కూడా ఇప్పుడు మార్పునకు సమయం ఆసన్నమైందని విశ్వసిస్తున్నారు. కానీ డెమొక్రాటిక్ పార్టీలో ఉన్న ప్రగాఢమైన అధికార శ్రేణి, సీనియారిటీకి ఇచ్చే గౌరవం కారణంగా ఆమెకు వ్యతిరేకంగా పోటీ చేసి తమ రాజకీయ భవిష్యత్తును పణంగా పెట్టడానికి మరెవరూ సిద్ధంగా లేరు.*

వలస యువత కలలతో పాటు, శ్వేతజాతి అమెరికన్ యువత ఆకాంక్షలకు కూడా సైకత్ ప్రాతినిధ్యం వహించడం ఆయనకు ఉన్న ఒక అదనపు ప్రయోజనం. ఆయన హార్వర్డ్‌లో చదువుకున్నారు. ఐటి రంగంలో పెద్ద ఉద్యోగాలు చేశారు. తన సొంత కంపెనీని స్థాపించి, ఆ తర్వాత మార్పు తీసుకురావడానికి రాజకీయాల్లోకి వచ్చారు. వెస్ట్ కోస్ట్‌లోని యువతరం సైకత్ చుట్టూ సమీకృతమవుతోంది. ఆయన ప్రచార బృందం యువత కోసం తమ 'న్యూ గ్రీన్ డీల్'ను ప్రచారం చేస్తోంది. శాన్ ఫ్రాన్సిస్కో రాజకీయ వాతావరణంలో ఆశాభావం నెలకొని ఉంది. చాలా మంది సీనియర్ డెమొక్రాట్లు సైకత్ గెలవాలని కోరుకుంటున్నారు. సైకత్ తన 'మిషన్ ఫర్ అమెరికా' ని డెమొక్రాటిక్ పార్టీ మద్దతుదారులకు ప్రచారం నిమిత్తం వినియోగించటంలో పూర్తి సమయం నిమగ్నమై ఉన్నారు.

(ఐపిఎ సర్వీస్)



## మహిళల భద్రతకు బాల పంచాయత్

**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** రాష్ట్రవ్యాప్తంగా మహిళలు, బాలల భద్రతపై అవగాహన పెంపొందించేందుకు బాల పంచాయత్ కార్యక్రమాన్ని ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల పంచాయత్ కార్యక్రమాన్ని ఇన్‌స్పెక్టర్ కనకయ్య, షీ టీమ్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాల పంచాయత్‌లో పాల్గొనడం పిల్లల నాయకత్వ నైపుణ్యాలను, ఆత్మవిశాసాన్ని బలోపేతం చేయడానికి సహాయపడుతుందని అన్నారు. ఈ పంచాయత్ ద్వారా వారు తమ సమస్యలను చర్చించుకోవడం పరిష్కారాలు సూచించడం, గ్రామ అభివృద్ధిలో భాగస్వామ్యం కావడం సాధ్యమవుతుందన్నారు. షీటీమ్స్ సీఐ అంజయ్య మాట్లాడుతూ బాల పంచాయత్ వేదిక అనేది పరిష్కార ఆధారిత వేదిక ఇది పిల్లలు తాము ఎదుర్కొంటున్న సమస్యల గురించి ధైర్యంగా మాట్లాడేలా ప్రోత్సహిస్తుందని ఉద్ఘాటించారు. బాల పంచాయతీ సమర్థవంతంగా పనిచేసి పిల్లలు సంబంధిత వర్గాలతో కలిసి పనిచేస్తే పాఠశాల గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు తమ బృందం మద్దతు ఇస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండాల్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, షీ టీమ్స్ సిబ్బంది ఎల్లమ్మ, నాగల, బాల పంచాయత్ సభ్యులు పాల్గొన్నారు.



## అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తా

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తూ ఆదర్శవంతంగా తీర్చి దిద్దుతానని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. మంగళవారం మౌలాలి, నేరేడ్‌మెట్, యాప్రాల్ ప్రాంతాల్లో రూ.2.62 కోట్ల వ్యయంతో చేపట్టిన భూగర్భ డ్రైనేజి పనులు, సిసి రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపనలు చేసారు. సంతోష్ మాత కమాన్, డిఎవి స్కూల్ రోడ్డు వద్ద రూ.40 లక్షలతో సిసి రోడ్డు పనులు, మౌలాలి షఫీ నగర్‌లో రూ. 32 లక్షలతో, సిసి రోడ్డు, షాదుల్లానగర్ ఈద్గా వద్ద రూ. 15 లక్షలతో టూల్ రూం, కాకతీయ నగర్ శ్రియ ఆస్పత్రి సమీపంలో రూ. 36.5లక్షలతో భూగర్భ డ్రైనేజి, నేరేడ్‌మెట్ బృందావన్ కాలనీలో రూ. 25 లక్షలతో సిసి రోడ్డు తదితర పనులకు శంకుస్థాపనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి కార్పొరేషన్ సర్కిల్ డిఈ సుదర్శన్, జలమండలి డిజిఎం విద్యాసాగర్, రమణ, వర్క్ ఇనస్పెక్టర్లు నరేందర్, దేవేందర్, బిఆర్ఎస్ శ్రేణులు హన్మంతరావు, జెఎసి వెంకన్న, మేకల రాము యాదవ్, మురుగేష్, చిన్న యాదవ్, లక్ష్మణ్ యాదవ్, శోభ, తదితరులు పాల్గొన్నారు.



## పాత్రికేయుడికి ఆర్థిక చేయూత అందించిన శంకర్ నాయక్

**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ పాత్రికేయుడు తేజోమూర్తి (సాక్షిత పేపర్) తల్లి అనారోగ్యానికి గురైన విషయం యూనియన్ నాయకుల ద్వారా తెలుసుకున్న దుండిగల్ మాజీ కౌన్సిలర్ కొర్ర శంకర్ నాయక్ వారి కుటుంబ సభ్యులను కలిశారు. చికిత్స కోసం మంగళవారం టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో తేజోమూర్తి కి రూ. 21 వేల ఆర్థిక చేయూతను అందించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు గోలిపల్లి దయాకర్ రెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్ సాయి బాబా, ప్రధాన కార్యదర్శి రెడ్డె బోయిన మల్లేష్ యాదవ్ పాల్గొన్నారు.



## సిసి కెమెరాలతో సమాజ భద్రత

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** సిసి కెమరాలు వంద పోలీసులతో సమానమని ఏదైనా సంఘటన జరిగినప్పుడు ఆ దృశ్యాలు సిసి కెమరాలతో రికార్డు అవుతాయని దీంతో కేసులు సత్వరం పరిష్కారం అవుతాయని శామీర్‌పేట ఇన్స్‌పెక్టర్ శ్రీనాద్ అన్నారు. మంగళవారం మూడుచింతలపల్లి మున్సిపల్ లక్ష్మాపూర్‌లో డ్వాక్రా భవనం, ప్రాధమిక పాఠశాల, లక్ష్మాపూర్ తాండాలో దాత క్యాతం మధుకృష్ణ సహాకారంతో సిసి కెమరాలను మున్సిపల్ చైర్మన్ జాం రవితో కలిసి ప్రారంబించారు. అనంతరం వారు మాట్లాడుతూ సిసి కెమరాలతో సమాజ భద్రత, రక్షణను పెంపొందించే దిశగా ముఖ్యమైన ముందడుగు పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సరిత, నీరజ్‌గౌడ్, దాత యువ నాయకుడు క్యాతం మధుకృష్ణ, మాజీ సర్పంచ్‌లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## శివప్రసాద్‌కు బికెఆర్ ఫౌండేషన్ అండ

**ప్రజాపక్షం/దుండిగల్ :** అమలాపురం ప్రాంతానికి చెందిన యు శివరామ ప్రసాద్ గత మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదం జరిగి గాయాలయ్యాయి. రోజు తాపి మేస్త్రి పని చేసుకుంటూ జీవనం సాగించే శివప్రసాద్ కు బికెఆర్ ఫౌండేషన్ అండగా నిలిచింది. గాయాల పాలైన శివప్రసాద్ కు సిఎంఆర్ హాస్పిటల్‌లో తన బికెఆర్ ఫౌండేషన్ ద్వారా వైద్య చికిత్సలు అందజేశారు. బికెఆర్ టీం సభ్యులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏఆర్ సాదు యాదవ్ వారి మిత్రబృందం వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. వారిని అధైర్య పడవద్దని మీకు బికెఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందని అన్నారు.







# బాలికలు అప్రమత్తంగా ఉండాలి

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి:** బాలికలు చిన్నతనం నుండే మంచి నడవడిక, అలవాట్ల పట్ల అవగాహనతో ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సూచించారు. 'ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో టీనేజి ప్రెగ్నెసీ మరియు ప్రేమ పేరిట జరుగుతున్న మోసాలపై నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాలు, చిన్నతనంలో లైంగిక వేధింపులు విషయంపై జరిగే అనర్థాలపై వివరిస్తూ ప్రభుత్వం అందించే బాలికల రక్షణ కార్యక్రమాలు, చట్టాల గురించి తెలిపా రు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖాధికారి శారద, ఐసిడిఎస్ చైల్డ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు అధికారి రేణుక, సైకాలజిస్టు జ్యోతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ రాజారెడ్డి, బాల రక్షభవన్ కోఆర్డినేటర్ తిరుమలదేవి, జిల్లా బాలల సంరక్షణ అధికారి ఇంతియాజ్, రహీం, యాక్షన్ ప్లాన్ వాలంటీర్ స్టేట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కాకతీయ నగర్‌లో పార్కు అభివృద్ధి చేస్తాం

### కొలను హన్మంత రెడ్డి



**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** కాకతీయ నగర్‌లోని పార్కుని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ జోన్ పరిధిలోని నిజాంపేట్ సర్కిల్, బాచుపల్లి కాకతీయ నగర్‌లో గుంతలమయమైన రోడ్లను చదును చేయడంతో పాటు కాలనీలోని పార్కులో చిన్నారులు ఆడుకోవడానికి కావాల్సిన పరికరాలను మాజీ కార్పొరేటర్ కొలను వీరేందర్ రెడ్డి సుమారు రెండు లక్షల సొంత నిధులను వెచ్చించి అభివృద్ధి చేయించారు. ఈ సందర్భంగా పార్కు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించడానికి ముఖ్యఅతిథిగా నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి విచ్చేసి పార్కుని ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ వాసు లు వినతి పత్రాన్ని హన్మంత రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ సొంత నిధులను వెచ్చించి చిన్నారుల కోసం ఆట పరికరాలను సమకూర్చిన వీరేందర్ రెడ్డిని అభినందించారు. అభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ నిధులతోనే కాకుండా సొంత నిధులను ఖర్చు చేయడం గొప్ప విషయమని అన్నారు. కాలనీలో కావాల్సిన రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి పరిష్కారానికి తక్షణమే ప్రణాళికలను వేయించి పూర్తి చేయించడానికి అధికారులతో మాట్లాడతానని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాం లో అభివృద్ధి చేయడమే బాధ్యతగా పార్టీ నాయకులు ముందుకు వెళ్తున్నారని చెప్పారు. కాలనీలలో నెలకొన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అవసరమైతే ఇన్‌చార్జి మంత్రివర్యులు శ్రీధర్ బాబుతో మాట్లాడి నిధులను తీసుకువస్తామని అన్నారు. పార్కులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొలను రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కొలను జీవన్ రెడ్డి, నాయకులు కోటేశ్వర రావు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి

### పోచారం ఐటి కారిడార్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య గౌడ్



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్ :** గంజాయి డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు యువత విద్యార్థులు దూరంగా ఉండాలని పోచారం ఐటి కారిడార్ ఇన్స్పెక్టర్ కనకయ్య గౌడ్ అన్నారు. అనురాగ్ యూనివర్సిటీలో యువతలో డ్రగ్స్ వినియోగం,సైబర్ నేరాల కార్యకలాపాల పట్ల విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పోచారం ఐటి కారిడార్ ఇన్‌స్పెక్టర్ కనకయ్య గౌడ్, సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ భాస్కర్ రెడ్డిలు పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక సామాజిక చట్టపరమైన దుష్పరిణామాలను వివరించారు. యువత సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు ఇతర మత్తు పదార్థాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువతే దేశానికి శక్తి విద్యార్థులు క్రమశిక్షణతో, బాధ్యతతో సమాజానికి ఉపయోగపడే విధంగా ముందుకు సాగాలని ప్రేరణనిచ్చారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విద్యార్థులు తమ పరిసరాల్లో జరిగే అనుమానాస్పద లేదా అక్రమ కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండి అవసరమైతే అధికారులకు సమాచారం అందించి దేశాభివృద్ధికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ వి.విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డాక్టర్ సి. మల్లేష్,అధ్యాపకులు, ట్రైనర్లు, తదితరులు పాల్గొన్నారు.



## స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం కొనసాగిన ఎంపిక ప్రక్రియ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా హకీంపేటలోని ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్‌లో ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియలో భాగంగా మంగళవారం జోన్2కు చెందిన 7 జిల్లాలకు చెందిన విద్యార్థుల ఎంపిక కొనసాగింది. సోమవారం రాష్ట్ర జోన్1 జిల్లాలు పూర్తి కాగా జోన్2లోని కామారెడ్డి, నిజామాబాద్,మెదక్, కరీంనగర్, జగిత్యాల్, రాజన్న సిరిసిల్ల జిల్లాలకు నుండి హాజరైన 47 మంది బాలికలతో సహా 101 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారందరికి ప్రవేశాల ఎంపికల్లో భాగంగా వైద్యులచే ఆరోగ్య పరీక్షలతో పాటు వెర్టికల్ జంప్, ఫ్లెక్సిబిలిటి, మెడిసిన్ బాల్ త్రో, స్టాండింగ్ బ్రాడ్ జంప్, 30 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల రన్నింగ్ లాంటి శారీరక పరీక్షలు పారదర్శకంగా నిర్వహించామని అధికారులు తెలిపారు.

## రియల్ ఎస్టేట్ మాఫియాలో పోతారం వాగు కనుమరుగు

### వాగును పూడ్చిన వారిపై చర్యలకు రైతుల డిమాండ్



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** రియల్ ఎస్టేట్ వ్యాపార ముసుగులో సహజంగా పారే కాలువలను మట్టితో , బండరాళ్లతో మూసివేస్తు పర్యావరణాన్ని దెబ్బతీస్తున్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటిలోని చిన్న పర్వతాపూర్ రెవెన్యూ కు ఆనుకుని ఉన్న పోతారం ఇర్రిగేషన్ కాలువ కనుమరుగైంది. కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు వాగులను కబ్జాచేసి ఆ వాగులో బండరాళ్లు వేసి పై నుంచి మట్టిపోసి కాలువ ఆనవాళ్లను కనిపించకుండా చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్న పర్వతాపూర్ రెవెన్యూ పరిదిలో ఉన్న పోతారం వాగును రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా పూడ్చుతున్న ఘటన కలకలం రేపుతోంది. సహజ నీటి ప్రవాహానికి మార్గమైన వాగును బండ రాళ్లతో నింపి భూసేకరణకు ప్రయత్నిస్తున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ చర్యల వలన భవిష్యత్తులో నీటి పారుదల వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల సమాచారం మేరకు ఇర్రిగేషన్ అధికారులకు తెలియకుండా రాత్రి వేళల్లో వాగులో బండరాళ్లు వేసి పూడ్చివేత చేస్తున్నట్లు చెబుతున్నారు. తెలంగాణ ఇర్రిగేషన్ యాక్ట్ 1357 ఫస్లీ ప్రకారం వాగులను ఆక్రమించిన వారిపై పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ మేరకు అధికారులు వారిపై ఏలాంటి చర్యలు చేపడుతారో వేచి చూడాల్సిందే ..

**ఫిర్యాదులు అందినా చర్యలు నిల్**

కాగా పోతారం వాగును బండరాళ్లతో పూడ్చుతున్నారని సంబంధితశాఖ అధికారులు మున్సిపల్, రెవెన్యూ అధికారులకు నోటీసులు పంపించిన ఇప్పటివరకు ఏలాంటి చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు దారి తీస్తుంది. ప్రభుత్వ వాగులను చెరువులను, కుంటలను కాపాడాల్సిన అధికారులు రియల్ ఎస్టేట్ వ్యాపారులకు వంత పాడటం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. సహజ వాగులను కాపాడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై రైతులు మండిపడుతున్నారు. ఈ అక్రమాలపై తక్షణమే చర్యలు చేపట్టి వాగును పూడ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే కలెక్టర్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున దర్నాలు నిరసనలు చేపడుతామని రైతులు హెచ్చరిస్తున్నారు.

## నీట్‌ను పకడ్బందీగా నిర్వహించాలి

### కలెక్టర్ దీపక్ తివారి



**ప్రజాపక్షం/వికారాబాద్:** నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని, అభ్యర్థుల హాల్ టికెట్‌లోని సూచనలను తప్పకపాటించాలని , అధికారులందరు సమన్వయంతో పనిచేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ దీపక్‌తివారీ ఆదేశించారు. వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం నుండి విడియో కాన్ఫరేన్స్ ద్వారా నీట్ పరీక్షను ఎలాంటి పొరపాట్లు జరుగకుండా పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత శాఖల అదికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మే 3వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షకు సంబంధించి శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 1179 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని గతేడాది మాదిరే పరీక్షలను సజావుగా నిర్వహించాన్నారు. అభ్యర్థులు హాల్ టికెట్‌లోని నంబంధాలను పూర్తిగా అధ్యయనం చేసి అందుకు అనుగుణంగా పరీక్ష రాసేందుకు రావాలని సూచించారు. అధికారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, తహసీల్దార్ వంటి అధికారులను నియమించుకోవాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాలలో 144 సెక్షన్ అమలు చేయాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. సిసి కెమెరాలు, తాగునీరు, పారిశుద్ధ్యం, ప్రాథమిక వైద్యం ,అంబులెన్స్ వంటివి ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలోఅదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, అదనపు ఎస్‌పి రాములు నాయక్, ఆర్‌డి వాసుచంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## ఎన్యుమరేషన్‌ను వినియోగించుకోవాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** జనాభా గణనలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఎన్యుమరేషన్ ప్రక్రియను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం అలియాబాద్ మున్సిపల్‌లో చైర్ పర్సన్ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా మే 11 నుంచి ఎన్యుమరేటర్స్ ఇంటింటికి వచ్చి జనాభా వివరాలు సేకరిస్తారని చెప్పారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు గృహ యజమానులు సరైన సమాధానాలు చెప్పాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చంద్రశేఖర్, కమఠం కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



## పిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ ఉత్తమ్ ఠాకూర్‌కు ఘనంగా సన్మానం

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** పిసిసి లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా ఎంపికైన హైకోర్టు న్యాయవాది ఉత్తమ్ ఠాకూర్‌ను స్థానిక కాంగ్రెస్ నేతలు మంగళవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు వెంకన్న పోతుల వినోద్ యాదవ్, షకీల్, సలీం, హమీద్, యూసూఫ్, భాస్కర్, చందు, ప్రేమ్, భీమ్‌రాజ్, కృష్ణ, జైల్, అత్తర్, యాకూబ్, తదితరులు పాల్గొన్నారు.

## పెట్రోల్ డీజిల్ కొరతతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు

**ప్రజాపక్షం /పరిగి :** జిల్లా వ్యాప్తంగా పెట్రోల్ డీజిల్ కొరతవల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న పరిస్థితి ఏర్పడింది, జిల్లాలో ఎక్కడా చూసిన నో స్టాక్ బోర్డు ఏర్పాటు చేశారు. పెట్రోల్ బంకుల్లో కొరత కారణంగా ప్రజారవాణా వ్యవస్థ పూర్తిగా స్థంభించిపోయిది. ఈనెల 24వ తేదీ రాత్రినుండి బంకుల్లో నిల్వలు తగ్గుకుంటూ వచ్చాయి. ఏదైనొక బంకులో ఉంటే వాహనదారులు నిండి గంటలోపు అయిపోయి బంకుల ముందు పెద్ద సంఖ్యలో బారులు తీరిన పరిస్థితిఏర్పాడింది. పెట్రోల్ ఉన్న దగ్గర పోలీసుల సమక్ష్యంలో ఒక్కరికి ఒక్క లీటర్ మాత్రమే పోయడం జరుగుతుంది.రాష్టం ప్రభుత్వం కొరత లేదని చేప్తున్నప్పటికి క్షేత్రస్థాయిలోఅలాంటి పరిస్థితి కనిపించండం లేదని తెలుస్తుం ది.



## యోగాతోనే ఆరోగ్యం పదిలం

**ప్రజాపక్షం/జవహర్ నగర్:** నేటి యాంత్రిక జీవనంలో మానసిక ప్రశాంతతకు, శారీరక దృఢత్వానికి యోగా ఒక్కటే మార్గమని, యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకుంటేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని సేవా పరమో ధర్మ ఫౌండేషన్ ప్రతినిధులు, రాజులాల్ ఆర్గనైజింగ్, విజయ్ గైక్వాడ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మదర్ తెరిసా కాలనీలో కాలనీ అధ్యక్షుడు బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ సేవా పరమో ధర్మ ఫౌండేషన్ యోగాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా నిపుణులు కాలనీ వాసులకు పలు ఆసనాలు, ప్రాణాయామం గురించి వివరించారు. నిత్యం యోగా చేయడం వల్ల ఒత్తిడి తగ్గి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని నిర్వాహకులు వివరించారు. అవగాహన సదస్సు అనంతరం ఫౌండేషన్ సభ్యులు మానవత్వాన్ని చాటుకున్నారు. కాలనీలోని పేదలకు, చిన్నారులకు పండ్లు, దుస్తులు పంపిణీ చేశారు. సామాజిక సేవే లక్ష్యంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందని, భవిష్యత్తులో మరిన్ని ఆరోగ్య సేవా కార్యక్రమాలు చేపడతామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పంతై, శ్రామనేరులు, సుధాకర్, అజయ్, కాలనీ పెద్దలు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



**ప్రజాపక్షం/జవహర్ నగర్ :** భార్యభర్తల మధ్య కుటుంబ తగాదాలు చోటుచేసుకోగా...మనస్థాపం చెందిన భార్య ఇద్దరు పిల్లలతో కలిసి అదృశ్యమైంది. ఈ ఘట నజవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌హెచ్‌వో సైదులు తెలిపి నకథనం ప్రకారం జవహర్ నగర్ లోని బాలాజీనగర్ చంద్రపురికాలనీలో సపావత్ రాజు, భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు జస్వంత్, యశ్వంత్‌తో కలిసి నివసిస్తున్నారు. అన్యోన్యంగా సాగుతున్న కుటుంబంలో ఇటీవల గొడవలు చోటుచేసుకుంటున్నాయి. ఈ నెల 24న రాత్రి భార్యభర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకోగా, మనస్థాపం చెంది నజ్యోతి (30) మరుసటి రోజు ఇంట్లో చెప్పకుండా పిల్లలను తీసుకుని బయటకు వెళ్ళి ఇంతవరకు తిరిగిరాలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు భర్త రాజు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



**మరో ఘటనలో వివాహిత అదృశ్యం**

ఇంటి నుంచి బయటకు వెళ్ళిన ఓ వివాహిత అదృశ్యమైంది. ఈ ఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జవహర్ నగర్ లోని గబ్బిలాల్పేట జ్ఞాన మందిర్ పాఠశాల సమీపంలో బొత్తుల శ్రీనివాస్, భార్య మల్లీశ్వరి, కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈ నెల 26న భర్త పనికోసం బయటకు వెళ్ళగా... మల్లీశ్వరి (19) ఇంట్లో చెప్పకుండ బయటకు వెళ్ళి ఇంత వరకు తిరిగి రాలేదు. దీంతో ఆమె ఆచూకి కోసం చుట్టుప్రక్కల, బంధువుల వద్ద వెతికిన సమాచారం లభించలేదు. ఈ మేరకు భర్త శ్రీనివాస్ జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకు న్నపోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# అత్యవసర సర్వీసులకు కొరత లేకుండా ఏర్పాట్లు

పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు

గ్యాస్ బుకింగ్, రీఫిల్లింగ్‌లో నిబంధనలు పాటించాలి

జిల్లా కలెక్టరర్ ప్రియాంక ఆల





**ప్రజాపక్షం /సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లాలో అత్యవసరాలైన మంచినీటి సరఫరా, అంబులెన్స్‌లు, ప్రభుత్వ వాహనాలు, ఫైర్ టెండర్ల వంటి అత్యవసరాలకు పెట్రోల్, డీజిల్ కొరత లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెట్రోల్ , డీజిల్ కృత్రిమ కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అక్రమ నిల్వలు, కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. నిల్వలను ఎప్పటికప్పుడు పరిశీలించి నివేదికలు తనకు అందచేయాలని అధికారులను ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. ప్రజలు అసత్య ప్రచారాలను నమ్మ వద్దని చెప్పారు. మూడు రోజులలో ఎంత స్టాకు రావాలి అన్న వివరాలను అందించాలని, వాహనదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. జిల్లాలో సోమవారం ఒక్కరోజు అవసరానికి మించి డీజిల్,పెట్రోల్ వినియోగించారన్నారు. పెట్రోల్ రోజుకు 8.61లక్షల లీటర్లు (కెఎల్)అవసరం ఉండగా సోమవారం ఒక్క రోజే 11లక్షల లీటర్లు (కెఎల్)సరఫరా అయిందని అధికారులు కలెక్టర్‌కు ఈ సందర్భంగా తెలిపారు.డీజిల్ 4.63లక్షల లీటర్లు సరఫరా ఉండగా సోమవారం ఒక్క రోజే 6.50లక్షల లీటర్లు డీజిల్‌లను వాహనదారులు ఉపయోగించారన్నారు. కొత మేర కొరత ఏర్పడడంతో సంబంధిత అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టి నిల్వలు, విక్రయాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. గ్యాస్ విషయంలో బుకింగ్, రీఫిల్లింగ్ నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు. సింగిల్ సిలండర్ ఉన్నవారికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఇంధన పంపిణీ కేంద్రాలు,రవాణా వాహనాలు, సిబ్బందికి భద్రత కల్పించేందుకు పోలీస్ శాఖ పర్యవేక్షణ పెంచాలని ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో చీఫ్ రేషనింగ్ అధికారి రాజిరెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి శ్రీనివాస్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు, సివిల్ సప్లై కార్పొరేషన్, పెట్రోలియం కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

### జిల్లా ప్రజలకు మెరుగైన సేవలందించాలి

జిల్లాలోని అన్ని రెవెన్యూ విభాగాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలందించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని అధికారులతో మంగళవారం ఆమె సమావేశం నిర్వహించారు. రెవెన్యూ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. పెండింగ్ పనులు, ఫైళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. భూసేకరణ, భూపరిమితి, సర్వే, సెటిల్‌మెంట్, రికార్డులు, భూముల సంరక్షణ, ల్యాండ్ బ్యాంక్ నిర్వహణ, ఆక్రమణలు, రక్షణ భూములు, భూమార్పిడి తదితర అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ భూముల సంరక్షణను మరింత బలోపేతం చేయాలని చెప్పారు. తహసీల్దార్లు భూములపై ప్రత్యేక పర్యవేక్షణ పాటించి ఆక్రమణలు నివారించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, హైదరాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా నీట్ పరీక్ష

నీట్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం పరీక్ష నిర్వహణ అధికారులు, సెంటర్ సూపరింటెండెంట్‌లు, ఇన్విజిలేటర్లతో ఆమె సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే మూడవ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించడంతో పాటు అభ్యర్థులకు మౌలిక వసతులు కల్పించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ భద్రత, పరిశుభ్రత, అభ్యర్థుల ఫ్రిస్కింగ్, వారి రవాణా, నిరంతర విద్యుత్ సరఫరా, దివ్యాంగులకు వీల్ చైర్ల ఏర్పాటు తదితర అంశాలపై సంబంధిత అధికారులు, పోలీసులతో చర్చించారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులు, ఐడి ప్రూఫ్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు వెంట తెచ్చుకోవాలన్నారు. నీట్ వివరించిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఇతర నిషేధిత వస్తువులకు అనుమతి ఉండదని చెప్పారు. వచ్చే ఆదివారం జరిగే ఈ పరీక్షకు జిల్లాలో 69 సెంటర్లు ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల లోపు అభ్యర్థులు సెంటర్‌కు చేరుకోవాలని ఆతర్వాత అనుమతించరన్నారు. జిల్లాలో మొత్తం 28,702మంది అభ్యర్థులు నీట్ పరీక్ష హాజరవుతున్నారని తెలిపారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీధర్, డిఇఓ ఆర్.రోహిణి, ఇతర అధికారులు, నీట్ కోఆర్డినేటర్లు, సెంటర్ సూపరిండెంట్‌లు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

## సమతుల్యమైన ఆహారంతో ఆరోగ్యం



**ప్రజాపక్షం/కొందుర్గు:** సమతుల్యమైన ఆహారం తీసుకొని సంపూర్ణ ఆరోగ్యంతో జీవించేందుకు కృషి చేయాలని కొందుర్గు తహసీల్దార్ ఆజం అలీ సూచించారు. మంగళవారం కొందుర్గు గ్రామ పంచాయతీ అవరణలో 99రోజుల ప్రణాళికలో భాగంగా చైల్డ్ సేఫ్టీ వీక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఆజం అలీ మాట్లాడుతూ సమతుల్యమైన ఆహారం తీసుకోవడంతోనే సంపూర్ణ ఆరోగ్యంతో ఉండేందుకు అస్కారం ఉంటుందన్నారు. ప్రకృతి ప్రసాధించిన పండ్లు, కూరగాయలు, విటమిన్‌లతో కూడిన ఆహారం తీసుకోవడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెంపొందించుకోగలుగుతారని వివరించారు. యుక్తవయస్సులో బాలికలు చదువు పట్ల ఎక్కువ శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొందుర్గు సర్పంచ్ ప్రభాకర్, ఉప సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపిడివో అనురాధ, డాక్టర్ అమృత జోసెఫ్, అంగన్‌వాడి సూపర్‌వైజర్ జ్యోత్స్న, సిడిపిఓ ఉదయ, ఎస్‌ఐ రవీందర్ నాయక్, పంచాయతీ కార్యదర్శి సురేఖ, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మహిళలు, బాలికలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి ఉత్సవం



**ప్రజాపక్షం/కొత్తూరు :** సర్వదేవతల సమ్మేళనం బొడ్రాయి సంబరం అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం నందిగామ మండలం మేకగూడ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ట, మైసమ్మ, పోచమ్మ పండుల కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి మామిడి శ్యాంసుందర్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్‌లతో కలిసి వేడుకల్లో చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు విఘ్నేష్‌రెడ్డి, దామోదర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డితోపాటు భక్తులు పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/కేశంపేట :** నిరుపేద కుటుంబానికి స్థానిక సర్పంచ్ బీస కవిత కరుణాకర్‌రెడ్డి ఆర్థిక సహాయం చేశారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో తాడూరు చిట్టెమ్మ నర్సింలు దంపతుల కుమార్తె సంధ్య వివాహం సందర్భంగా కుటుంబ సభ్యుల కోరిక మేరకు సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి స్పంధించి రూ.10 వేలు ఆర్థిక సహాయం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కవిత కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల ఆడ పిల్లల పెళ్లిళ్లకు చేయూతనివ్వడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రవినాయక్, వార్డు సభ్యులు గుత్తి చంద్రయ్య, కావలి వసంత, చిట్టిరెడ్డి వెంకట్‌రెడ్డి, గుత్తి శేఖర్, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కందన శివయ్య, నాగిళ్ళ యాదయ్య, ఖాజా అలీ, సుభాన్‌రెడ్డి, కానుగుల చెన్నయ్య, కావలి చెన్నయ్య పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం సద్వినియోగం



**ప్రజాపక్షం/యాచారం :** ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లయన్స్ క్లబ్ లీడర్ డాక్టర్ నరేందర్‌రెడ్డి, జిల్లా గవర్నర్ డాక్టర్ జి.మహేంద్రకుమార్‌రెడ్డి కోరారు. మంగళవారం యాచారం మండల కేంద్రంలో లయన్స్ క్లబ్ హైద్రాబాద్ అమన్ గల్ లయన్స్ క్లబ్ ఆఫ్ నియో పోలీస్ అధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. యశోద అసుపత్రి సహకారంతో వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిడిజి లయన్స్ క్లబ్ హైద్రాబాద్ స్టార్ ప్రసిడెంట్ రెడ్డి అశోక్‌కుమార్‌రెడ్డి, జెడిసి లయన్స్ పి.సంజీవ రెడ్డి, అర్‌సి సర్థార్ సంతోక్‌సింగ్, వైస్ ప్రైసిడెంట్ పి.తిరుపతిరెడ్డి, బుడగ చందర్, తాటి శ్రీనివాస్, గాజుల శంకర్, జిఎస్‌రెడ్డి, సభ్యులు శ్రీకాంత్ రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్, పవన్ పాల్గొన్నారు.

## ఎన్‌జిఓస్ కాలనీ వివేకానంద పార్క్‌లో యోగా షెడ్ నిర్మాణం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బియన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ వివేకానంద పార్కులో యోగా షెడ్‌ను కటికరెడ్డి కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన షెడ్డు నిర్మాణం చేయనున్నట్లు బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్వామి వివేకానంద పార్క్ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఏర్పాటు చేసుకున్న సందర్భంగా వారి విజ్ఞప్తి మేరకు అరవింద్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి వారు వినతి పత్రంలో కొరారు. ఈ సందర్భంగా అరవింద్‌రెడ్డి మాట్లాడుతూ వాకర్స్ విజ్ఞప్తి మేరకు తన సొంత నిధులతో కటికరెడ్డి కృష్ణారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వాకర్స్‌కు వాకింగ్ ట్రాక్ పున నిర్మాణం, టాయిలెట్ అన్ని విధాల సౌకర్యాలు కల్పిస్తామని అరవింద్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంచిరెడ్డి వెంకట్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, జగన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, రవీందర్‌రెడ్డి, రవిశంకర్, మధుసూదన్‌రెడ్డి, కృష్ణారెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# జిహెచ్‌ఎంసిలో 'కర్ణన్' మార్క్ పాలన

## ఏడాది కాలంలో సంచలన నిర్ణయాలు.. చరిత్రాత్మక మార్పులు



జిహెచ్‌ఎంసి ముఖచిత్రాన్ని మార్చడంలో కమిషనర్ కర్ణన్ సఫలీకృతమయ్యారు.

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి కమిషనర్‌గా కర్ణన్ బాధ్యతలు చేపట్టి బుధవారానికి ఏడాది పూర్తయింది. ఈ ఏడాది కాలంలో ఆయన తనదైన శైలిలో పరిపాలన సాగిస్తూ, నగరాభివృద్ధిలోనూ, కార్పొరేషన్ పునర్వ్యవస్థీకరణలోనూ కీలక పాత్ర పోషించారు. బాధ్యతలు చేపట్టిన తొలి నాళ్లలోనే జిహెచ్‌ఎంసిలోని వివిధ విభాగాల పని తీరును గమనించిన కమిషనర్, ఆ తర్వాత సంస్కరణల పర్వం మొదలుపెట్టారు. ముఖ్యంగా ఏళ్ల తరబడి ఒకే చోట తిష్టవేసిన ఉద్యోగులను బదిలీ చేశారు. తద్వారా అక్రమాలకు చెక్ పెట్టారు. పాలక మండలితో వ్యూహాత్మకంగా వ్యవహరిస్తూ, కౌన్సిల్ సమావేశాల్లో అధికార, విపక్ష సభ్యుల సందేహాలను నివృత్తి చేస్తూ పరిపాలనను పరుగులు తీయించారు.ఫిబ్రవరి 10తో పాలక మండలి గడువు ముగియడంతో, పెరిగిన జిహెచ్‌ఎంసి పరిధిని మూడు మున్సిపల్ కార్పొరేషన్లుగా పునర్వ్యవస్థీకరించడంలో కర్ణన్ కీలక పాత్ర పోషించారు. విభజన తర్వాత పరిపాలన ఇబ్బందులు తలెత్తకుండా, ముందే ఇద్దరు ఐఎఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియమించుకుని, ఆ తర్వాత వారిని కొత్త కార్పొరేషన్లకు కమిషనర్లుగా పంపడంలో ఆయన వ్యూహం ఫలించింది. ఆర్థికంగా కొత్త కార్పొరేషన్లకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఫిబ్రవరి, మార్చి నెలల వేతనాలను జిహెచ్‌ఎంసి నుంచే చెల్లించారు. మొత్తానికి, ఏడాది కాలంలో

### విలీన ప్రక్రియలో వ్యూహాత్మక చొరవ..

గత ఏడాది నవంబర్ 25న ప్రభుత్వం నుంచి వచ్చిన 27 పట్టణ స్థానిక సంస్థల విలీనం ఉత్తర్వులను కమిషనర్‌గా కర్ణన్ అత్యంత వేగంగా అమలు చేశారు. కేవలం 15 రోజుల్లోనే విలీన ప్రక్రియను పూర్తి చేయడంతో, జిహెచ్‌ఎంసి విస్తీర్ణం 625 చ.కి.మీ నుండి 2,058 చ.కి.మీ కు పెరిగింది. డిసెంబర్ నుండి ఫిబ్రవరి వరకు జిహెచ్‌ఎంసి 60 సర్కిళ్లు, 12 జోన్లు, 300 వార్డులతో దేశంలోనే అతిపెద్ద మున్సిపల్ కార్పొరేషన్‌గా రికార్డు సృష్టించింది.

# ఫీజు వసూళ్లు రాజ్యాంగ విరుద్ధం

హైకోర్టు సింగిల్ బెంచ్ తీర్పుపై అప్పీల్ చేయాలి

ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టరెడ్డికి ఎంపి ఆర్.కృష్ణయ్య వినతి



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :**విద్యార్థుల నుంచి ఫీజులు వసూలు చేయొచ్చని హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై అప్పీల్ చేయాలని జాతీయ బిసి సంక్షేమం సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు మంగళవారం ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టరెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి ఆర్.కృష్ణయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా ఈ తీర్పు ఉన్నదని, ఇది రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ విషయమై పార్లమెంట్‌లో ప్రస్తావిస్తానన్నారు. హైకోర్టు ఆదేశాలు ఉన్నాయంటూ కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని, హాల్‌టికెట్లు ఇవ్వకుండా వేధింపులకు పాల్పడుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు ఫీజులు కట్టలేక మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం వహిస్తున్నదన్నారు. వెంటనే పెండింగ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిల కొరకు హైకోర్టులో కేసు వేసిన 15 కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని, అలాగే హాల్‌టికెట్లు ఇచ్చేలా ఆదేశాలివ్వాల ని బాలకృష్ణారెడ్డిని ఆర్.కృష్ణయ్య కోరారు. కార్యక్రమంలో బిసి విద్యార్థి సంఘం అధ్యక్షులు మోదీ రాందేవ్, నాయకులు రాజేందర్, అనంతయ్య, బలరాం, అఖిల్ ముదిరాజ్, సాయి కిరణ్, జనార్ధన్ తదితరులు ఉన్నారు.

## గాయని మంగ్లీపై బురదజల్లే యత్నం

మేనేజర్ మేఘరాజ్



**ప్రజాపక్షం/హిమాయత్‌నగర్ :** ప్రముఖ గాయని మంగ్లీపై కొందరు పనిగట్టుకొని ఆరోపణలు చేస్తూ, ఆమెపై బురద జల్లే ప్రయత్నాలను ఖండిస్తున్నామని ఆమె మేనేజర్ మేఘరాజ్ తెలిపారు. అందులో భాగంగానే కొన్ని యూట్యూబ్ చానళ్ల నుంచి ఆమెపై అసత్య వార్తలను ప్రసారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఆదివారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. మంగ్లీపై కేసు విషయంలో అసలు నిజాలేంటో తేల్చాల్సిన అవసరం ఉన్నదన్నారు. గత మార్చి 27న పంజాగుట్ట పిఎస్‌లో అడ్వకేట్ సుబ్బు, మధు నాయక్, హిమకాంత్‌రెడ్డిలు కలిసి ఆమెపై కేసు పెట్టారన్నారు. ఆమె డబ్బులు వసూలు చేసినట్టు ఎక్కడా నిర్ధారణ కాలేదన్నారు. ఏ కాగితంపై కూడా ఆమె సంతకం లేదని, అవన్నీ అరోపణలేనని కొట్టిపారేశారు. మంగ్లీని, ఆమె తమ్ముడు శివ నాయక్‌ను టార్గెట్ చేసుకొని అసభ్యకరపదజాలంతో కొన్ని చానళ్లు ప్రసారం చేయడాన్ని నిరసిస్తున్నామన్నారు. అసలు నిజాలు తేల్చుకోకుండా వార్తలు ప్రసారం చేయడం సరికాదన్నారు. సమావేశంలో శివ నాయక్ స్నేహితులు చంద్రశేఖర్, నవీన్ తెలిపారు.

## స్థానికేతరులకు ప్రాధాన్యం ఇస్తున్న సింబయాసిస్ యాజమాన్యం

కారణం లేకుండా తొలగింపు..

రోడ్డున పడ్డ 25 కార్మిక కుటుంబాలు

కళాశాల ఎదుట ఆందోళన



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఎలాంటి కారణం లేకుండా ఏకపక్ష నిర్ణాయాలతో కళాశాల యాజమాన్యం 25మంది భద్రతా సిబ్బందిని విధుల్లో నుండి తొలగించారు. దాంతో ఆగ్రహించిన భద్రతా సిబ్బంది యాజమాన్యం నిర్లక్ష్య వైఖరీ విడనాడాలని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నందిగామ మండలం మొదళ్ళగూడ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సింబయాసిస్ అంతర్జాతీయ యూనివర్సిటిలో గత 16ఏళ్ళ నుండి చుట్టు పక్కల గ్రామాల ప్రజలు సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ మధ్యకాలంలోనే కొత్తగా వచ్చిన క్యాంపస్ అడ్మిన్ ఇష్టారాజ్యంగా వ్యవహరించడంతోపాటు సెక్యూరిటి సిబ్బంది నుండి నెలనెల డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, తామేందుకు ఇవ్వాలని సెక్యూరిటి సిబ్బంది ఎదురు తిరిగారు. దాంతో ఎలాంటి కారణంగా లేకుండానే 25మంది సెక్యూరిటి సిబ్బందిని విధుల్లో నుండి తొలగించడంతోపాటు రెండు నెలల జీతాలను నిలిపి వేశారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను పనుల్లో నుండి ఎందుకు తొలగించారని బాధిత కార్మికులు క్యాంపస్ అడ్మిన్‌ను ప్రశ్నించగా కళాశాలలో పనిచేసే పాత కాంట్రాక్టర్ కాల పరిమితి ముగిసిందని, కొత్తగా వచ్చిన వారు తమకు ఇష్టం వచ్చిన వారిని విధుల్లోకి తీసుకుంటారని నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తున్నారని కార్మికులు వాపోతున్నారు. తాము రాత్రి పగలు నిద్రహారాలు మాని విధులు నిర్వహించి తమ జీతాల్లో నుండి నెలకు రెండు వేలు ఇవ్వాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమకు ఎదురు ప్రశ్నలు వేస్తే విధుల్లో నుండి తొలగించడమే కాకుండా ఇతర రాష్ట్రాల నుండి కార్మికులను తెచ్చుకుంటానని హెచ్చరికలు సైతం జారీ చేశారని, ఆ ప్రకారంగానే ఇప్పటి వరకు 8మంది ఇతర రాష్ట్రాల కార్మికులకు తెచ్చుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింబయాసిస్ యూనివర్సిటి నిర్మాణాలు జరుగుతున్నప్పటి నుండి తాము సెక్యూరిటిగా విధులు నిర్వహిస్తున్నామని, ఏనాడు తప్పు చేయలేదని, ఇప్పటి వరకు ఎంతో మంది క్యాంపస్ అడ్మిన్లు వచ్చి వెళ్ళారే తప్పా ఇలాంటి అడ్మిర్ రాలేరని, కార్మికుల పొట్ట కొడితే ఏమి వస్తుందో చెప్పాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 1వ తేది నుండి తమను విధుల్లోకి రానివ్వకపోడంతోపాటు రెండు నెలల జీతాలను నిలిపివేశారని వాపోయారు. కార్మికులపై ఆధారపడ్డ కుటుంబ సభ్యులు, పిల్లల భవిష్యత్ ఆగమ్యగోచరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంస్థ అభివృద్దిలో భాగస్వాములైన కార్మికులను రోడ్డున పడేయడం మానవత్వం అనిపించుకోదని కార్మికులు మండిపడుతున్నారు. ఇప్పటికైన సింబయాసిస్ కళాశాల యాజమాన్యం స్పందించి కార్మికులను విధుల్లోకి తీసుకునేందుకు కృషి చేయాలని, కార్మికులకు ఉపాధి కల్పించాలని స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల నేతలు కోరుతున్నారు.

# సేవా కార్యక్రమాలతో గుర్తింపు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**ప్రజాపక్షం/కేశంపేట :** సేవా కార్యక్రమాలతో గుర్తింపు లభిస్తుందని, సంకల్పం.. చిత్తశుద్ధితో సేవలు అంధించడం పల్లె బ్రదర్స్‌కే దక్కిందని..సేవా కార్యక్రమాల్లోనే నిజమైన పరమార్థం దాగి ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కేశంపేట మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో సర్పంచ్ పల్లె ఆనంద్‌కుమార్, సోదరుడు పల్లె బాలేశ్వర్‌ల ఆధ్వర్యంలో 92మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు శారీరక దారుడ్యాన్ని పెంపొంధించుకోవాలని సూచించారు. పల్లె బ్రదర్స్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. గ్రామంలో పల్లె పద్మమ్మ, వెంకటయ్యల జ్ఞాపకార్థం అభివృద్ధి సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామాన్ని రాష్ట్ర స్థాయిలో ఉత్తమ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దిన ఘనత వారిదేనన్నారు. సర్పంచ్ పల్లె ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఆరో తరగతి నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. పాపిరెడ్డిగూడ పరిధిలో అవాజీమియా పడకల్ వద్ద రూ.82లక్షల వ్యయంతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ శంకుస్థాపన చేశారు. కొత్తపేట సింగిల్ విండో ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పల్లె బాలేశ్వర్, వీరేశం, తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శశిరేఖ, భాస్కర్‌గౌడ్, నాగేశ్వర్, కరుణాకర్, రాణి, గిరి యాదవ్, కరుణాకర్‌రెడ్డి, రమణ గౌడ్, రఘుపతి, సత్యనారాయణ, రాజు, శ్రీను, శివ మల్లేష్ గౌడ్, పసుల లింగం పాల్గొన్నారు.

## గడువులోగా కమిటీల నియామకం

మత్స్య కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** నిర్ణీత గడువులోగా గ్రామ, మండల, జిల్లా కమిటీలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలంగాణ మత్స్య కార్పొరేషన్ చైర్మన్, సంఘటన సృజన్ అభియాన్ కమిటీ షాద్‌నగర్ డివిజన్ ఇన్‌చార్జి మెట్టు సాయికుమార్ వివరించారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా మెట్టు సాయికుమార్ మాట్లాడుతూ షాద్‌నగర్ డివిజన్‌లో ఉన్న కాంగ్రెస్ కమిటీలను పూర్తిగా రద్దు చేయడం జరిగిందని, మే 5వ తేదిలోగా నూతన కమిటీలను పూర్తి చేస్తామని వివరించారు. సామాజిక న్యాయం అంధించేందుకే ప్రతి కమిటీలో మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. షాద్‌నగర్ డివిజన్ లోని ఆరు మండలాలు, రెండు మున్సిపాలిటీలను రెండు బ్లాకులుగా ఏర్పాటు చేస్తామని, ఏ బ్లాకులో కొత్తూరు మున్సిపాలిటీ, కొత్తూరు, నందిగామ, కేశంపేట, బి బ్లాకులో షాద్‌నగర్ మున్సిపాలిటి, ఫరూఖ్‌నగర్, కొందుర్గు, జిల్లేడు చౌదరిగూడ మండలాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలు కనీసం ఐదేళ్ళు పని చేసిన వాళ్ళే అధ్యక్ష పదవికి అర్హులు అవుతారని, కష్టపడిన కార్యకర్తకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బూత్ స్థాయి నుండి ఏజెంట్లను ఏర్పాటు చేసి ముందుకు వెళ్తుందని వివరించారు. గ్రామ, మండల కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, బాల్‌రాజ్ గౌడ్, రాజు, లింగారెడ్డిగూడ ఉప సర్పంచ్ ఎర్రోళ్ల జగన్ పాల్గొన్నారు.

# రాజస్థాన్ రాయల్స్‌దే విజయం

## పంజాబ్ జైత్రయాత్రకు బ్రేక్.. దూబే, ఫెరీరా విధ్వంసంతో మురిసిన రాజస్థాన్!



పంతొమ్మిదో సీజన్‌లో భారీ లక్ష్యాలను అలవోకగా ఛేదిస్తూ అజేయంగా దూసుకెళ్తున్న పంజాబ్ కింగ్స్‌కు షాకిచ్చింది రాజస్థాన్ రాయల్స్. ఆరు విజయాలతో టాపర్‌గా కొనసాగుతున్న పంజాబ్‌కు తొలి ఓటమి రుచి చూపించింది. 223 లక్ష్య ఛేదనలో యశస్వీ జైస్వాల్(51), వైభవ్ సూర్యవంశీ(43)లు మెరుపు ఆరంభమివ్వగా.. డొనొవాన్ ఫెరీరా(52 నాటౌట్), ఇంప్యాక్ట్ సబ్ శుభం దూబే(31 నాటౌట్)లు డెత్ ఓవర్లలో పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఆరో విజయంతో మూడో స్థానానికి దూసుకెళ్లింది రాజస్థాన్. ఐపిఎల్19లో పంజాబ్ కింగ్స్‌కు ఎదురు దెబ్బ తగిలింది. ఎదురైన ప్రత్యర్థినల్లా ఓడిస్తున్న పంజాబ్‌కు సొంత మైదానంలో రాజస్థాన్ రాయల్స్ ఊహించని పంచ్ ఇచ్చింది. ముల్లన్‌పూర్‌లో నిర్దేశించిన 223 పరుగుల ఛేదనను రాజస్థాన్ రాయల్స్ ధాటిగా మొదలెట్టింది. తొలి ఓవర్లోనే అర్ష్‌దీప్ సింగ్‌కు చుక్కలు చూపిస్తూ వైభవ్ సూర్యవంశీ(43) 6, 4, 4 బాదాడు. అనంతరం యాన్సెన్, ఫెర్గూసన్ ఓవర్లోనూ వైభవ్ విధ్వంసంతో 20 బంతుల్లోనే 51 పరుగులు చేసింది రాజస్థాన్.
అర్ధ శతకానికి చేరువైన వైభవ్ ఆ తర్వాతి బంతికే అయ్యర్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ధ్రువ్ జురెల్()ను చాహల్ ఔట్ చేసి రెండో వికెట్ అందించాడు. షాట్లతో అలరించిన యశస్వీ జైస్వాల్()ను సైతం వెనక్కి పంపిన చాహల్.. కెప్టెన్ రియాన్ పరాగ్()ను పెవిలియన్ చేర్చాడు. చాహల్ వేసిన 14వ ఓవర్లో తొలి రెండు బంతుల్ని 6,4గా మలిచిన పరాగ్ చివరిబంతికి ఔటయ్యాడు.

### దూబే, ఫెరీరా ధనాధన్

వెంట వెంటనే వికెట్లు పడినా ఇంప్యాక్ట్ సబ్గా వచ్చిన శుభమ్ దూబే(31 నాటౌట్) డొనొవాన్ ఫెరారా(52 నాటౌట్)లు అదరలేదు. గెలుపు బాధ్యత తీసుకున్న ఈ జోడీ పంజాబ్ నుంచి మ్యాచ్‌ను లాగేసుకుంది. అర్ష్‌దీప్ వేసిన 18వ ఓవర్లో ఫెరీరా 6, 4.. చివరి బంతిని దూబే స్టాండ్స్‌లోకి పంపగా మ్యాచ్ రాజస్థాన్ వైపు మళ్లింది. 12 బంతుల్లో 18 రన్స్ అవసరమైన వేళ.. ఫెర్గూసన్ బౌలింగ్లో 4, 6 బాదిన ఫెరీరా పంజాబ్ ఓటమిని ఖాయం చేశాడు. యాన్సెన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో స్ట్రెయిట్ సిక్సర్‌తో అర్ధ శతకం సాధించిన ఫెరీరా.. రాజస్థాన్‌కు 6 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

# ఉబెర్ కప్ నుంచి భారత బృందం ఔట్..!



ఎన్నో ఆశలతో డెన్మార్క్‌కు వెళ్లిన భారత బృందం ఉబెర్ కప్ నుంచి నిష్క్రమించింది. ఒలింపిక్ విజేత పివి సింధు ఓటమితో టీమిండియా అనూహ్యంగా ఇంటి దారి పట్టింది. గ్రూప్ ఏ మ్యాచ్‌లో చైనా షట్లర్ వాంగ్ ఝియూ ధాటికి సింధు చేతులెత్తేసింది. డబుల్స్‌లో ప్రియా కొంజెంగ్బమ్ శృతి మిశ్రా ద్వయాన్ని చైనా జంట లీ షెంగ్ షూ టాన్ నింగ్ చిత్తు చేసింది. ఇషారాణి బరౌహ్, దేవికా సిహగ్ ఓటమితో భారత జట్టు టోర్నీ నుంచి వైదొలిగింది. మహిళా షట్లర్ల వైఫల్యంతో ఉబెర్ కప్ నుంచి ఇంటిదారి పట్టింది. తొలుత సింగిల్స్లో పీవీ సింధు పోరాడినా చైనా గోడను దాటలేకపోయింది. మ్యాచ్ ఆరంభంలో 47తో వాంగ్ ఝియూ జోరుతో వెనకబడిన సింధు దూకుడుగా ఆడి 9—9తో స్కోర్ సమం చేసిం నెట్ వద్ద బలమైన షాట్లు ఆడుతూ.. వరసగా ఐదు పాయింట్ గెలిచి 11—9తో పైచేయి సాధించింది.

కానీ, స్కోర్లు 16—16 ఉన్నప్పుడు తెలివిగా ఆడిన చైనా షట్లర్ 21—16తో సెట్‌ను గెలుచుకుంది. రెండో సెట్‌లో పుంజుకున్న సింధు ప్రత్యర్థికి అవకాశమివ్వకుండా 21—19తో విజయం సాధించింది. కానీ, నిర్ణయాత్మక మూడో సెట్‌లో వాంగ్ నుంచి తీవ్ర పోటీ ఎదురైంది. చివరకు 19—21తో భారత స్టార్ వెనకబడింది.

### దేవికా ఓటమితో ...

అసలే సింధు ఓటమితో డీలా పడిన భారత్‌ను డబుల్స్‌లో ప్రియా కొంజెంగ్బమ్ శృతి మిశ్రా ద్వయం, సింగిల్స్‌లో ఇషారాణి బరౌహ్ పరాజయం నిష్క్రమణకు దారి తీసింది. తనీషా క్రాస్టో కవిప్రియ సెల్వం సైతం కంగుతిన్నారు. వీరిని ఝూంగ్ షుక్జిన్, లుయో గ్జుమిన్ జంట 2110, 21—19, 19—21తో మట్టికరిపించింది. దేవికా సిహగ్ను గ్జు వెన్జింగ్ ఓడించడంతో ఉబెర్ కప్లో భారత జట్టు పోరాటం ముగిసింది.

## మహిళ

# స్వయం ఉపాధి దిశగా..

భారతదేశంలో మహిళల స్వయం ఉపాధి గత కొన్ని సంవత్సరాల్లో గణనీయమైన మార్పును సూచించే సామాజిక, ఆర్థిక పరిణామంగా ఎదుగుతోంది. సంప్రదాయంగా కుటుంబ బాధ్యతలకు పరిమితమైన మహిళలు ఇప్పుడు ఆర్థిక కార్యకలాపాల్లో స్వతంత్ర పాత్రను పోషిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగస్వాములుగా మారుతున్నారు. ఈ మార్పును ఉపాధి గణాంకాలకు మాత్రమే సంబంధించిన అంశంగా కాకుండా, మహిళల ఆర్థిక స్వావలంబన, కుటుంబ నిర్ణయాధికారంలో పెరుగుదల, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పునర్నిర్మాణానికి సంకేతంగా కూడా చూడాలి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు చిన్న స్థాయి వ్యాపారాలు ప్రారంభించడం ద్వారా కుటుంబ ఆదాయానికి తోడ్పడటమే కాకుండా స్థానిక ఉపాధిఅవకాశాలను కూడా సృష్టిస్తున్నారు. సాంప్రదాయ ఉద్యోగ అవకాశాలు పరిమితంగా ఉండటం, అనధికార రంగంలో ఉపాధి ఎక్కువగా ఉండటం వంటి పరిస్థితులు మహిళలను స్వయం ఉపాధి వైపు మళ్లించాయి. ఇంటి వద్ద నుంచే పని చేయగలగడం, కుటుంబ బాధ్యతలతో పాటు ఆదాయం సంపాదించగలగడం మహిళలకు ఈ మార్గాన్ని ఆకర్షణీయంగా మార్చింది. అదనంగా మొబైల్ ఫోన్ విని



యోగం, డిజిటల్ చెల్లింపులు మరియు ఆన్‌లైన్ మార్కెట్లు చిన్న వ్యాపారాలకు కొత్త అవకాశాలను తెరిచాయి. మహిళల స్వయం ఉపాధి పెరుగుదలలో ప్రభుత్వ పథకాల పాత్ర అత్యంత కీలకం. ముఖ్యంగా ముద్ర యోజన పథకం మహిళా పారిశ్రామికవేత్తలకు గణనీయమైన ఆర్థిక సహకారాన్ని అందించింది. ఈ పథకం ద్వారా వ్యవసాయేతర చిన్న వ్యాపారాలకు పూచీకత్తు లేకుండా రూ.10 లక్షల వరకు రుణాలు అందుబాటులోకి రావడం వల్ల అనేక మహిళలు చిన్న పరిశ్రమలు, సేవా రంగ వ్యాపారాలు ప్రారంభించగలిగారు. కుట్టు కేంద్రాలు, హస్తకళలు, బ్యూటీ పార్లర్లు, మరమ్మతు సేవలు వంటి వ్యాపారాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో వేగంగా పెరిగాయి. దీనదయాళ్ అంత్యోదయ యోజన — జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ (ఎన్ఆర్ఎల్ఎం) మహిళల ఆర్థిక సాధికారతకు మరో ముఖ్యమైన పునాది. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు పొదుపు అలవాటు పెంచుకుని, సమూహంగా వ్యాపార కార్యకలాపాలు చేపట్టే అవకాశాన్ని పొందారు. లక్షపతి దీది కార్యక్రమం ద్వారా గ్రామీణ మహిళలను స్థిర ఆదాయం కలిగిన వ్యాపారులుగా తీర్చిదిద్దే ప్రయత్నం జరుగుతోంది. ఈ విధానం మహిళలలో ఆత్మవిశ్వాసాన్ని పెంచడమే కాకుండా సామాజిక గుర్తింపును కూడా కల్పిస్తోంది. స్టార్టప్ ఇండియా కార్యక్రమం ద్వారా మహిళలు నూతన ఆలోచనల ఆధారంగా వ్యాపారాలను ప్రారంభించడానికి అనుకూల వాతావరణం ఏర్పడింది. స్వయంఉపాధిలో మహిళలు ప్రధానంగా సూక్ష్మ, చిన్న వ్యాపార రంగాలపై దృష్టి సారిస్తున్నారు. హస్తకళలు, కుట్టు, ఆహారపదార్థాల తయారీ, చిన్న రిటైల్ వ్యాపారాలు, గృహ ఆధారిత సేవలు వంటి రంగాలు మహిళలకు సులభంగా ప్రవేశించగలిగే అవకాశాలను అందిస్తున్నాయి. ఈ రంగాలు తక్కువ పెట్టుబడితో ప్రారంభించగలగడం, స్థానిక మార్కెట్‌పై ఆధారపడడం వల్ల ప్రమాదం తక్కువగా ఉంటుంది. అలాగే డిజిటల్ వేదికల ద్వారా ఇంటినుంచే వ్యాపారాలు నిర్వహించే మహిళల సంఖ్య పెరుగుతోంది. సామాజిక మాధ్యమాల ద్వారా ఉత్పత్తులను విక్రయించడం, ఆన్‌లైన్ ఆర్డర్లు స్వీకరించడం వంటి మార్పులు చిన్న వ్యాపారాలను విస్తృత మార్కెట్‌కు తీసుకెళ్లా యి. ఈ పరిణామం గ్రామీణ ఉత్పత్తులను జాతీయస్థాయికి తీసుకెళ్లడంలో కీలకంగా మారింది. కుటుంబ ఆదాయాన్ని నిలబెట్టడంలో మహిళల పాత్ర పెరుగుతుంది.

అనేకానేక రంగాల్లో వృద్ధి కనిపిస్తున్నప్పటికీ, మహిళలు అనేక అడ్డంకులను ఎదుర్కొంటున్నారు. సామాజిక పరిమితులు, కుటుంబ బాధ్యతలు ఇప్పటికీ పెద్ద సవాళ్లుగానే ఉన్నాయి. వ్యాపారం నిర్వహించడానికి అవసరమైన సమయం, ప్రయాణం, మార్కెట్ సంబంధాలు ఏర్పరచుకోవడం వంటి అంశాలు కొంత మంది మహిళలకు కష్టంగా మారుతున్నాయి. ఆర్థిక సహాయం అందుబాటులో ఉన్నప్పటికీ మూలధనం పొందడం ఇంకా పూర్తిగా సులభం కాలేదు. బ్యాంకింగ్ వ్యవస్థపై అవగాహన లేకపోవడం, పత్రాల ప్రక్రియ క్లిష్టత, క్రెడిట్ చరిత్ర లేకపోవడం వంటి కారణాలు రుణాల పొందడాన్ని ప్రభావితం చేస్తున్నాయి. వ్యాపారాన్ని విస్తరించడంలో నిర్వహణ నైపుణ్యాల కొరత కూడా ఒక ముఖ్యమైన సమస్యగా పరిశోధనలు సూచిస్తున్నాయి. కార్మికులను నిర్వహించడం, మార్కెట్ విస్తరణ, లాభనష్టాల విశ్లేషణ వంటి అంశాల్లో శిక్షణ అవసరం ఉంది. కొన్ని అధ్యయనాలు స్వయం ఉపాధి పెరుగుతున్నప్పటికీ మహిళల నిజమైన ఆదాయం కొన్ని సందర్భాల్లో తగ్గిందని సూచిస్తున్నాయి. అంటే వ్యాపారం ఉన్నప్పటికీ లాభదాయకత స్థిరంగా ఉండకపోవడం ఒక వాస్తవం. ఇది మార్కెట్ పోటీ, ధరల మార్పులు, మధ్య వర్తుల ఆధిపత్యంతో సంబంధం కలిగి ఉంటుంది. స్వయంఉపాధి మహిళలకు మద్దతు అందించడంలో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా కీలకపాత్ర పోషిస్తున్నా



యి. స్వయంఉపాధి మహిళల సంఘం వంటి సంస్థలు అనధికారరంగ మహిళా కార్మికులకు గుర్తింపు, శిక్షణ, హక్కుల పరిరక్షణ అందించడానికి పనిచేస్తున్నాయి. ఈసంస్థలు మహిళల పనికి సామాజిక విలువను పెంచడం ద్వారా వారి ఆర్థికస్థితిని బలోపేతం చేస్తున్నాయి. భారత ప్రభుత్వం మహిళా ఆధారిత అభివృద్ధిని ప్రోత్సహించేందుకు బడ్జెట్ కేటాయింపులను గణనీయంగా పెంచింది. మహిళల వ్యాపారాలకు మద్దతు ఇవ్వడానికి కేంద్రస్థాయిలోనే డెబ్బైకి పైగా పథకాలు అమల్లో ఉన్నాయి. భవిష్యత్తులో శిక్షణ, డిజిటల్ సాధనాలు, ఆర్థికచేర్పు, మార్కెట్ అనుసంధానం ప్రధాన దృష్టిగా మారుతున్నాయి. డిజిటల్ విద్య, ఆన్‌లైన్ మార్కెట్ యాక్సెస్ పెరగడం వల్ల మహిళ వ్యాపారాలు స్థానిక స్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయికి విస్తరించే అవకాశాలు ఉన్నాయి. మొత్తంగా చూస్తే మహిళల స్వయం ఉపాధి పెరుగుదల ఒక సామాజిక మార్పు సూచికగా నిలుస్తోంది. ఇదిమహిళల వ్యక్తిగత ఆర్థిక స్వాతంత్ర్యాన్ని పెంచడమే కాకుండా కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తోంది. సవాళ్లు కొనసాగుతున్నప్పటికీ సరైన విధాన మద్దతు, శిక్షణ, మార్కెట్ అవకాశాలు పెరిగితే స్వయం ఉపాధి మహిళలకు స్థిరమైన జీవనోపాధిగా మారే సామర్థ్యం కలిగి ఉంది. మహిళలు ఉద్యోగ సృష్టికర్తలుగా మారుతున్న ఈ మార్పు దేశ ఆర్థిక భవిష్యత్తును ప్రభావితం చేసే ముఖ్యమైన దిశగా పరిగణించవచ్చు.

### సమస్యల పరిష్కారానికి
# మహిళలు ఉద్యమించాలి

సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం చైతన్యవంతంతో ఉద్యమించాలని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. మంగళవారం జిల్లాకేంద్రంలోని సిపిఐ గిరిప్రసాద్ భవన్‌లో జిల్లా మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో దండి సురేష్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికలకు ముందు మహిళలకు ప్రత్యేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన పాలకులు వాటిని విస్మరించారన్నారు. మహిళల సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యారన్నారు. మహిళలపై జరుగుతున్న దాడులను ఆపడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారన్నారు. మహిళల భద్రత కోసం ప్రత్యేక చట్టాలను రూపొందించాలన్నారు. మహిళా బిల్లు అమలులో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. మే 16న వైరాలో జరిగే రాష్ట్ర మహిళా సమాఖ్య ఖమ్మం జిల్లా 22వ మహాసభలను విజయవంతం చేయాలని దండి సురేష్ కోరారు. సమావేశంలో మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పోటు కళావతి, ఏపూరి లతాదేవి, తాటి నిర్మల, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొండపాటి రమేష్, తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే హక్కుల రక్షణ

ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** పోరాటాలతోనే హక్కుల రక్షణ సాధ్యమని, మేడే స్ఫూర్తితో హక్కుల రక్షణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎఐటియుసి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి అనుబంధ కార్మిక సంఘాల సమావేశం ఇందిరాల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగింది. సమావేశంలో శ్రీనివాస్‌యాదవ్ పాల్గొని మాట్లాడారు. ప్రపంచ కార్మికులకు పండుగ రోజైన మే 1న మేడే ఉత్సవాలు ఘనంగా జరుపుకోవాలని, వాడవాడలో కార్మికుల అడ్డాల వద్ద ఎర్రజెండాలు ఎగురవేసి ర్యాలీలు ప్రదర్శనలో పాల్గొన్నాలని కోరారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల పోరాటాల ద్వారా సాధించుకున్న 44 కార్మిక చట్టాలు, నాలుగు కోడ్‌లుగా విభజించి చట్టం చేసిందని, మేడే స్ఫూర్తితో అన్ని కార్మిక సంఘాలు ఏకమై తమ హక్కుల కోసం సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెట్టి ప్రసాద్, ఎలక్ట్రికల్ యూనియన్ పట్టణ కార్యదర్శి దగ్గుబాటి సత్యానందం, సివిల్ సప్లై యూనియన్ మేస్త్రీ బెల్లంకొండ రామ్మూర్తి, రామిశెట్టి సుబ్బారావు, పంకజ్, రమేష్, జక్కుల రమణ తదితరులు పాల్గొన్నారు.

### మోదీ పాలనలో
# హరిస్తున్న కార్మిక హక్కులు

సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు

**ప్రజాపక్షం/ఖమ్మం :** దేశంలో మోదీ పాలనలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయని, హక్కుల పరిరక్షణకు పోరాటమే మార్గమని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు పేర్కొన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సిపిఐ నగర సమితి సమావేశం మంగళవారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మహ్మద్ సలాం అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన హేమంతరావు మాట్లాడుతూ మునుపెన్నడు లేని రీతిలో కార్మిక వర్గంపై దాడి జరుగుతుందన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్ర ప్రభుత్వం కాలరాసి నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించిందన్నారు. కార్మికులకు నష్టం కలిగిస్తూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు కార్మికులు ఉద్యమించాలన్నారు. మేడే స్ఫూర్తితో పోరాటాలు సాగించాలని తెలిపారు. మేడే కేవలం వేడుక మాత్రమే కాదని కార్మికుల పోరాట స్ఫూర్తికి, హక్కుల సాధనకు ప్రతీక అని తెలిపారు. గ్రామ, మండల స్థాయిలో కార్మిక చైతన్యాన్ని చాటిచెప్పేలా మేడే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. మేడే సందర్భంగా మే ఒకటిన శుక్రవారం ఖమ్మం నగరం



లోని పాత బస్టాండ్ వద్ద సభ జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలో ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. మేడే వేడుకల్లో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా, రాష్ట్ర సమితి సభ్యురాలు ఏపూరి లతాదేవి, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, తాటి వెంకటేశ్వర్లు, సిహెచ్ సీతామలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, తాటి నిర్మల, గాదె లక్ష్మినారాయణ, మోహన్‌రావు, జాకీర్, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

### కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న
# మోదీ ప్రభుత్వం

ఎఐటియుసి జనగామ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్

**ప్రజాపక్షం/జనగామ :** కేంద్రంలో మోదీ ప్రభుత్వ తీసుకొచ్చిన కొత్త లేబర్ కోడ్‌లతో కార్మికులకు కష్టాలు తప్పవని ఎఐటియుసి జనగామ జిల్లా కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం జనగామలోని గబ్బెట గోపాల్‌రెడ్డి భవన్ సిపిఐ కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా సమితి సమావేశం చామకూర యాకూబ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో ఆకుల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కుల్ని హరిస్తూ కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్నారని, 42 చట్టాలను నాలుగు కోడ్‌లుగా మార్చారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేస్తుందన్నారు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, హమాలీ, బీడి, ఆటో, ఆర్‌టిసి కార్మికులు జిల్లా వ్యాప్తంగా మేడే సందర్భంగా ఎర్రజెండాలను ఎగరవేసి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎఐటియుసి నాయకులు గుడెల్లి రాజు, లింగాల రాములు, గోలకొండ నాగరాజు, మరికుక్కల సాయిలు, రావుల సదానందం, మోటే సిద్దిరాములు తదితరులు పాల్గొన్నారు.




# నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకు పోరాటాలు

ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ మేడే వేడుకలు జరుపుకోవాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు యూసఫ్ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన మేడే పోస్టర్స్ విడుదల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మేడే వేడుకలు జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్,బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు ఎం.ఎ.గౌస్, పూసాల రమేష్, అటికేటి రాజు, ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**హనుమకొండ టౌన్ :** ఎఐటియుసి ఆధ్వర్యంలో మేడే




పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం హనుమకొండ జిల్లా బాలసముద్రంలోని సిపిఐ కార్యాలయంలో జరిగింది. కార్యక్రమంలో ఎఐటియుసి హనుమకొండ జిల్లా సమితి అధ్యక్షుడు వేల్పుల సారంగపాణి యాదవ్, జిల్లా నాయకులు దర్మల రాంమూర్తి, ఏల్పుల ధర్మరాజు, లంక దాసరి అశోక్ , రీల్ పూర్ణచందర్, దామెర రాజు, తాటిపెళ్లి రవీందర్‌రెడ్డి, కుమార్‌స్వామి పాల్గొన్నారు.

**మహబూబాబాద్:** పపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించాలని ఎఐటియుసి మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్ పిలుపునిచ్చారు. మంగళవారం మేడే పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెలుగు శ్రావణ్, చింతకుంట్ల వెంకన్న, మంద శంకర్, కేదాసు రమేష్, ఎండి మహమూద్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

**ఎల్‌బి నగర్ :** మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్ట్ వ్యవస్థను పూర్తిగా రద్దు చేసి, వారిని తక్షణమే ప్రభుత్వ ఉద్యోగులుగా పర్మినెంట్ చేయాలని ఎఐటియుసి రంగారెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సామిడి శేఖర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వనస్థలిపురంలోని డీజీఎస్ మహేశ్వరం జనరల్ ఆసుపత్రిలో మెడికల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవ అధ్యక్షులు దాసరి కిరణ్ ఆధ్వర్యంలో మేడే పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మేడే ఉత్సవాలను విజయవంతం చేయాలని కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మెడికల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ యూనియన్ నాయకులు గోల్కొండ నాగరాజు, పటేటి శేఖర్, భాగ్యమ్మ, శ్యామల, స్టాలిన్, లావణ్య, పద్మ, సునిత, శారద, పద్మ, ప్రభావతి, సుబ్బాని, రవి, రాజు, సుబ్బరావు తదితరులు పాల్గొన్నారు.








# మహిళలు, పిల్లల భద్రతపై అవగాహన



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** జిల్లా ఎస్పీ డి. జానకి ఆదేశాల మేరకు మహబూబ్ నగర్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో మహిళలు, పిల్లల భద్రత, అలాగే మత్తు పదార్థాల వాడకం వలన కలిగే అనర్థాలపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు, జేపీఎన్సీ కళాశాలలో, మహబూబ్ నగర్ వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ అజాజుద్దీన్, అక్షర జూనియర్ కళాశాలలో, మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి, బాలానగర్ ఎస్సై లెనిన్ తదితరులు తమ తమ పోలీస్ స్టేషన్ పరిధిలో విద్యార్థులు, మహిళలు, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, మహిళలు బాలల భద్రత సమాజంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్నారు. చిన్నారులు తమ పై జరిగే మంచి చెడు స్పర్శ గురించి అవగాహన కలిగి ఉండాలని, ఎలాంటి అనుమానాస్పద పరిస్థితులు ఎదురైన వెంటనే తల్లిదండ్రులు లేదా గురువులకు తెలియజేయాలని సూచించారు. మహిళలు తమ భద్రత పై అప్రమత్తంగా ఉండి, ఏదైనా ఇబ్బందికర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు పిల్లల పై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి భద్రతకు కట్టుబడి ఉండాలని ఆయన సూచించారు. అనంతరం మత్తు పదార్థాల గురించి మాట్లాడుతూ, వాటి వాడకం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, ఆరోగ్యపరంగా, అర్థికపరంగా, సామాజికంగా తీవ్ర నష్టాలను కలిగిస్తుందని తెలిపారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి, మంచి అలవాట్లు అలవరచుకోవాలని యువతకు పిలుపునిచ్చారు. స మాజంలో మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, టూ టౌన్ ఇన్‌స్పెక్టర్ అజాజుద్దీన్, మహబూబ్ నగర్ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గాంధీ నాయక్, జడ్చర్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మహేష్, మహమ్మదాబాద్ ఎస్సై శేఖర్ రెడ్డి, బాలానగర్ ఎస్సై లెనిన్, భరోసా డబ్ల్యుఎస్ఐ అరుణ, భరోసా సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం భట్టితో.. ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి భేటీ

ఎస్‌డిఎఫ్, ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులు మంజూరు చేయాలని అభ్యర్థన



**ప్రజాపక్షం/ జడ్చర్ల :** ఉదండాపూర్ భూనిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం మొదటి విడతలో ప్రకటించిన మొత్తం రూ. 350 కోట్ల పరిహారం భాగంగా గత నెలలో రూ. 150 కోట్లు విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మిగిలిన రూ.200 కోట్లను తక్షణమే విడుదల చేయాలని జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి , రాష్ట్ర డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కని సచివాలయంలో కలిసి కోరారు. అలాగే నియోజకవర్గ అభివృద్ధి పనులు వేగవంతం కావాలంటే ఎస్‌డిఎఫ్, ఎస్‌సి సబ్ ప్లాన్ నిధులను కూడా వెంటనే మంజూరు చేయాలని మంత్రిని అభ్యర్థించారు. దీని పై మంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించి, అంశాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌ల విడుదల కోసం పాదయాత్ర




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.8వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డి ఇంటి వరకు ఎఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తులో ప్రభుత్వం చెలగాటమాడుతోందని, బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలలు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే బకాయిలు విడుద ల చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించా రు.

# స్వయం ఉపాధి రుణాల సద్వినియోగం

కల్వకుర్తి ఎంపిడిఒ వెంకట్‌రాములు



**ప్రజాపక్షం/కల్వకుర్తి:** స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగ యువత రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంకట్‌రాములు తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్వయం ఉపాధి రుణాలకు దరఖాస్తు చేసుకున్న యువతకు బ్యాంకు సిబ్బందితో కలిసి ఎంపిడిఓ వెంకట్ రాములు ఇంటర్వ్యూ చేశారు. రుణాలకు 142 మంది దరఖాస్తు చేసుకోగా 117 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపీడీవో తెలిపారు.

# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ మక్తల్ :** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో ఫ్రీజ్ లు, మందుల డబ్బాలు, కార్యాలయ ఆవరణలో ఉండట చూసిన కలెక్టర్ కార్యాలయంలో ఉన్న ప్రోగ్రామ్ అధికారిని ప్రశ్నించగా ఫ్రిజ్ లు తిరగి పంపించాల్సి ఉందని, మందులు పిహెచ్‌సి లకు సరఫరా చేయాల్సి ఉందని వివరణ ఇచ్చారు. నిబంధనల ప్రకారం మందులను ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# దేవమ్మను పరామర్శించిన సిపిఐ జిల్లాకార్యదర్శి ఫయాజ్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్:** అనారోగ్యంతో నాగర్‌కర్నూల్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న దేవమ్మను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌ఎండి ఫయాజ్ పరామర్శించారు. సిపిఐ కోడేరు మండల పార్టీ కార్యదర్శి డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ తప్ప కిరణ్ కుమార్ తల్లి దేవమ్మ చికిత్స పొందుతుండడంతో ఆసుపత్రికి వెళ్ళి పలకరించి ఆసుపత్రి డాక్టర్లతో ఆమె ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఉన్నతాధికారులతో ఆమెకు మెరుగైన వైద్యం అందించేలా చూడాలని కోరారు. కిరణ్ కుమార్ తో పాటు సోదరుడు పార్టీ నాయకులు తప్పేట శివకుమార్ చెల్లెలు జ్యోతి కిరణ్ కుటుంబ సభ్యులు , కుమార్తెలు ఉన్నారు.

# విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు

**ప్రజాపక్షం/వెల్దండ:** మండల పరిధిలోని లింగారెడ్డిపల్లి గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు గ్రామ సర్పంచ్ మహ్మద్ అన్వర్ పాషా ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో మూడవ వైర్ ఏర్పాటు పనులు ప్రారంభించడంలో పాటు విద్యుత్ స్తంభాలు నాటడం జరిగింది. గ్రామ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కల్పించేందుకు త్వరలోనే మరిన్ని స్తంభాలు, వైర్లు ఏర్పాటు చేసి ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో ఉన్న విద్యుత్ సమస్యలను పూర్తిగా పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు మహ్మద్ జావీద్, వట్టేపు అల్లాజీ, మల్లేపాకుల లాజర్, పబ్బు శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడి నియామకం

**ప్రజాపక్షం/ దామరగిద్ద :** వికలాంగుల హక్కుల సాధనే ధ్యేయంగా పని చేస్తున్న వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నారాయణపేట జిల్లా నూతన అధ్యక్షుడిగా గజ్జలప్ప నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని సంఘం కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్, రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేసి, అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ అధ్యక్షుడు తుడుం రాజేందర్ మాట్లాడుతూ... వికలాంగుల ఆత్మగౌరవ రక్షణ కోసం, చట్టబద్ధమైన హక్కుల సాధన కో సం నూతన కమిటీ రాజీలేని పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. అ నంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షుడు గజ్జలప్ప మాట్లాడు తూ... తన పై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన జాతీయ, రాష్ట్ర నా యకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యంగా జులై 15 న హైదరాబాద్ వేదికగా లక్ష మంది దివ్యాంగులతో నిర్వహించబోయే " దివ్యాంగుల ఆత్మగౌరవ బహిరంగ సభ " ను విజయవంతం చేసేందుకు నారాయణపేట జిల్లా నుండి పెద్ద ఎత్తున దివ్యాంగులను సమీకరిస్తామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.జిల్లాలోని ప్రతి గ్రామం నుండి దివ్యాంగులను చైతన్యపరిచి, వారి హక్కుల పోరాటంలో భాగస్వాములను చేస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు దైనంపల్లి మల్లికార్జున్ మాట్లాడుతూ... రాబోయే బహిరంగ సభ వికలాంగుల చరిత్రలో ఒక మైలురాయిగా నిలుస్తుందని, జిల్లా కమిటీలు సమన్వయంతో పనిచేసి సభను దిగ్విజయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లకు ఇసుక సరఫరా చేయాలి

తూముకుంట ఇసుక రీచ్‌ను వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు తక్షణం ఇసుకను సరఫరా చేయాలని కోరుతూ కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాధకృష్ణ మాట్లాడుతూ పేదల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందని తెలిపారు.అయితే ఇప్పటికే కొన్ని ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభమైనప్పటికీ ఇసుక కొరత కారణంగా మధ్యలోనే పనులు నిలిచిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండల పరిధిలో తూముకుంట ఇసుక రీచ్ ఉన్నప్పటికీ, ఆన్‌లైన్ సరఫరా వ్యవస్థ సరిగా లేకపోవడంతో లబ్ధిదారులు దూర ప్రాంతాల నుండి అధిక వ్యయంతో ఇసుక తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. ఆర్థికంగా బలహీన వర్గాలకు చెందిన పలువురు లబ్ధిదారులు అధిక ధరలకు ఇసుక కొనుగోలు చేయలేక తమ ఇండ్ల నిర్మాణాలను నిలిపివేయాల్సి వచ్చిన పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. అందువల్ల, స్థానిక ఇసుక రీచ్‌లను తక్షణమే ప్రారంభించి, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మొదటి ప్రాధాన్యతగా సరిపడా ఇసుకను అందించాలని కోరారు. ఈ వినతి పై స్పందించిన మండల తహసిల్దార్ ఖాజా మైనుద్దీన్ సమస్యను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ మండల కార్యదర్శి మురళీ, నాయకులు రామకృష్ణ తో పాటు ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు నరసింహ, రఘు, శివ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వేసవి సెలవుల్లో పిల్లల సురక్షతపై అప్రమత్తత

జిల్లా ఎస్పి డి. జానకి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ :** చోరీలు, పిల్లలు వేసవిలో ప్రమాదకరమైన ప్రాంతాలలో ఈత అలవాటుపై ప్రజలకు మహబూబ్ నగర్ జిల్లా ఎస్పి డి. జానకి కీలక సూచనలు చేశారు. వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలు తమ ఇళ్లకు తాళాలు వేసి స్వగ్రామాలకు లేదా విహారయాత్రలకు వెళ్తున్న సందర్భంలో, అలాగే ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పి డి. జానకి ఒక ప్రకటనలో ప్రజలను అప్రమత్తం చేశారు. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు ప్రకటించడంతో చాలామంది కుటుంబాలతో కలిసి బయటకు వెళ్తుండగా, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని దొంగలు చోరీలకు పాల్పడే అవకాశం ఉందని హెచ్చరించారు. ఇంటికి తాళం వేసి వెళ్లేవారు నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అదేవిధంగా ఇంటి చుట్టుపక్కల సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని మొబైల్ ఫోన్లకు అనుసంధానం చేసుకోవడం ద్వారా ఎప్పటికప్పుడు నిఘా ఉంచవచ్చని తెలిపారు. నమ్మకమైన పొరుగువారికి లేదా బంధువులకు తమ ప్రయాణ వివరాలు తెలియజేయడం, ఇంటి వద్ద అప్పుడప్పుడు చూడమని అభ్యర్థించడం మంచిదని పేర్కొన్నారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వాహనాలు కనిపించినప్పుడు వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్ కు సమాచారం ఇవ్వాలని కోరారు. వేసవి కాలంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల పట్ల కూడా ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సీ సూచించారు. పిల్లలు సరదా కోసం చెరువులు, కుంటలు, కాలువల వద్దకు వెళ్లి ఈత కొట్టే ప్రమాదకర అలవాటు ఉన్నందున, తల్లిదండ్రులు వారి పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, తెలియని లోతైన నీటిలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. పిల్లలను ఒంటరిగా నీటి వనరుల వద్దకు పంపకూడదని, ఎల్లప్పుడూ పెద్దల పర్యవేక్షణలోనే ఉండేలా చూడాలని సూచించారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటుందని, అయినప్పటికీ ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి పై సూచనలు పాటిస్తే చోరీలు, ప్రమాదాలను నివారించవచ్చని ఎస్పీ డి. జానకి పేర్కొన్నారు.

# బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

ఎస్ఐ ఆచారి



**ప్రజాపక్షం/ మక్తల్ :** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని మక్తల్ ఎస్ఐ ఆచారి తెలిపారు. 99 రోజుల " ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక " కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు మక్తల్ అయ్యప్ప డిగ్రీ కళాశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని, అలాంటి వివాహాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అలాగే లింగ వివక్షత నిర్మూలన, మహిళల పై జరుగుతున్న నేరాల నివారణ, పిల్లల హక్కుల పరిరక్షణ పై సమగ్ర అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఆచారి మాట్లాడుతూ... ప్రస్తుత సమాజంలో బాల్యవివాహాలు ఇంకా చోటు చేసుకోవడం ఆందోళనకరమని, ఇది బాలల భవిష్యత్తును దెబ్బతీస్తే తీవ్రమైన సమస్య అని తెలిపారు. బాల్య వివాహాల వల్ల బాలికల ఆరోగ్యం, విద్య, భవిష్యత్తు తీవ్రంగా ప్రభావితమవుతుందని చెప్పారు. చట్టపరంగా అమ్మాయిల వివాహ వయస్సు 18 సంవత్సరాలు, అబ్బాయిలకు 21 సంవత్సరాలు అని స్పష్టం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలను చిన్న వయస్సులో వివాహం చేయకుండా, వారి చదువు భవిష్యత్తు పై దృష్టి పెట్టాలని సూచించారు. పిల్లలను ప్రోత్సహిచి ఉన్నత విద్యను అభ్యసించేలా చేయాలని, వారి ఆశయాలను గౌరవించాలని పేర్కొన్నారు. అలాగే వృద్ధ తల్లి దండ్రులను గౌరవంగా చూసుకోవాలని, కుటుంబ విలువలను కాపాడాలని తెలిపారు. మహిళలపై వేధింపులు, గృ హ హింస, మానవ అక్రమ రవాణా వంటి నేరాల పై అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద సంఘటనలు గ మనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మహిళలు, బాలికలు ఎలాంటి సమస్యలు ఎదురైన భయపడకుండా ముందుకు వచ్చి పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఈ సందర్భంగా మహిళా భద్రత కోసం ప్రభుత్వం అందుబాటులో ఉంచి న హెల్ప్ లైన్ నంబర్లను వినియోగించుకోవాలని సూచించారు. షీటీమ్ నెంబర్ : 8712670398.అత్యవసర పోలీస్ సేవలు 100/112, మహిళా హెల్ప్ లైన్ 1091, మహిళల సహాయ కేంద్రం 181, బాలల హెల్ప్‌లైన్ 1098 సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎస్ఐ శంకరయ్య, పిసి నరేష్, హోమ్ గార్డ్ శ్రీవారి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** నారాయణపేట మండలం సింగారం వరి కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక పరిశీలించారు. కేంద్రానికి ఇంతవరకు ఎన్ని క్వింటాళ్ల ధాన్యం వచ్చిందని, తేమ శాతం సరిగ్గా ఉంటుందా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తేమ శాతాన్ని ఆమె చెక్ చేశారు. నిన్న సాయంత్రం కురిసిన తేలిక పాటి వర్షానికి కేంద్రంలోని ధాన్యం ఏమైనా తడిసిందా అని ఆరా తీశారు. ధాన్యం సేకరణకు అవసరమైన తేమ శాతం కొలిచే యంత్రాలు, టార్పాలిన్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలని, ఇంకా అవసరమైన వాటి కోసం ఇండెంట్లు పెట్టి తెప్పించుకోవాలని ఆమె సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలింప చేయాలన్నారు. ఒకరిద్దరు రైతులతో మాట్లాడి కేంద్రానికి ఎప్పుడు వచ్చారు? ఎన్ని బస్తాల ధాన్యం తీసుకువచ్చారని వాకబు చేశారు. కేంద్రంలో కొనుగోలు చేసిన సన్నరకం, దొడ్డు రకం వడ్లను వేరువేరుగా నిల్వ చేసి మిల్లులకు తరలించాలని ఆదేశించారు. జిల్లాలో ఉన్న రైస్ మిల్లులు, కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యం బస్తాలను ఆయా మిల్లులకు తరలించే ప్రక్రియ గురించి రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో ఎస్. ప్రసాద్ రావు, అసిస్టెంట్ డీసీవో ఆంజనేయులు, సివిల్ సప్లై అధికారి సైదులు, స్థానిక సింగిల్ విండో కార్యాలయ సీ.వో. పళ్ళ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలి: జెడ్‌పి సిఇఒ




**ప్రజాపక్షం/ వంగూర్ :** మండల పరిధిలోని కొండ రెడ్డి పల్లి గ్రామంలో పెండింగ్ లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పి సీఈవో దేవ సహాయం అన్నారు. మంగళవారం గ్రామపంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ సిసి రోడ్లు, డ్రైనేజీలు ప్రభుత్వ కార్యాలయాలను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మాచారి, సర్పంచ్ వెంకటయ్య, ఉప సర్పంచ్ వేమారెడ్డి, గ్రామస్తులు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలం

సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.జి. రామచందర్




**ప్రజాపక్షం/ అమరచింత :** ప్రజా సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలం చెందాయని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.జి. రామచందర్ ఆరోపించారు. మంగళవారం అమరచింత మండల కేంద్రంలోని మార్క్స్ భవనంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా శాఖ కార్యదర్శుల జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి రామ్ చందర్ హాజరై మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యారని ఆయన ప్రభుత్వల పై ధ్వజమెత్తారు. నిరుద్యోగలకు ఉద్యోగాలు కల్పించడంలో, రైతులకు ఎంఎస్‌పి ధరలను కల్పించడంలో, నాణ్యమైన విత్తనాలను రైతులకు సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఆయన విమర్శించారు. ప్ర భుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు దారా దత్తం చేస్తూ ప్రజాధనాన్ని అప్పనంగా కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్తూ ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కార్మిక హక్కులను కాలరాస్తూ మోదీ ప్రభుత్వం నిరంకుశత్వంగా పాలన సాగిస్తున్నదని విమర్శించారు. దేశంలో మతాలను, కులాలను పెంచి పోషించి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఇప్పటివరకు నెరవేర్చకుండా అమలు చేయడంలో విఫలం చెందారని కె.జి.రామచందర్ రాష్ట్ర ప్రభుత్వంపై ధ్వజమెత్తారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల కోసం ఉద్యమాలు చేపట్టేందుకు మాస్ లైన్ పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రామచందర్, ఉమ్మడి జిల్లా నాయకులు వెంకటేష్, హనుమంతు, సాంబశివుడు జ నరల్ బాడీ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, గణేష్, రాజన్న, మసల మణి తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ యువతను అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం

ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకి రెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ప్రజాపక్షం/ కల్వకుర్తి :** నేటి నిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సిఓఓ, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఎస్ఐ, కానిస్టేబుల్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి నిరుద్యోగ అభ్యర్థులను రేపటి అధికారులుగా చూడాలన్నదే నా సంకల్పం అని గ్రామాల్లో ప్రతిభ ఉంది , కానీ అవకాశాలు కొరత కూడా ఉందని, ఆ అవకాశాల కొరతను భర్తీ చేయడానికే ఈ ఉచిత శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, మీరు నేడు ఆర్థిక పరిస్థితులతో ఇబ్బందులు పడుతున్న అభ్యర్థులు, కానీ రేపు మిమ్మల్ని అధికారులుగా మలిచేందుకే ఈ ప్రయత్నమని, మన గ్రామీణ ప్రాంత నిరుద్యోగుల పరిస్థితి ఎలా ఉంటుందో స్వయంగా ఎదుర్కొన్న వ్యక్తిగా మీలో ఒకడిగా ఆలోచించి, పట్టుదల ఉన్న యువతకు పరిస్థితులు అడ్డంకి కాకూడదనే ప్రతి మండల కేంద్రంలో గ్రామీణ ప్రాంత నిరుద్యోగులకు అందుబాటులో ఉచిత శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నామని, ప్రభుత్వ ఉద్యోగం ఒక నియామకం మాత్రమే కాదని, అది కుటుంబ గౌరవం, సమాజంలో గుర్తింపు, సేవా బాధ్యత అని తెలిపారు. ఉచిత శిక్షణ కేంద్రాల ఏర్పాటుతో పాటు అవసరమైన వసతులు అందిస్తూ గ్రామీణ నిరుద్యోగ యువతకు మరింత అండగా నిలుస్తామన్నారు. గ్రామీణ యువతకు అందుబాటులో అవకాశాల వేదికలను సృష్టిస్తున్న సుంకిరెడ్డి కృషి అభినందనీయమని, సుంకిరెడ్డి చేపడుతున్న ఈ కార్యక్రమం కేవలం శిక్షణ కేంద్రం మాత్రమే కాదు, గ్రామీణ యువత జీవితాలను మార్చే గొప్ప కార్యక్రమమని, " ఫీజులు కట్టలేక కలలు వదులుకునే పేదింటి విద్యార్థులు ఇలాంటి ఉచిత శిక్షణ కేంద్రాలు భవిష్యత్ ఆశాకిరణలుగా నిలుస్తున్నాయని, " చాలా మంది అవకాశాల లేమితో వెనకబడుతున్నారు. ఇలాంటి కార్యక్రమాలు వారిలో ఆత్మ విశ్వాసం నింపుతున్నాయి. సుంకిరెడ్డి సేవా దృక్పథం రాజకీయాలకు అతీతమని, యువత భవిష్యత్తు పై బాధ్యతతో చేస్తున్న కృషి నిజంగా అభినందనీయమని సుంకిరెడ్డి సేవలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రసూన కొనియాడారు. ఈ కార్యక్రమంలో శ్రుతిలయ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళా పెట్రోల్ బంక్ నిర్వహణ భేష్

కలెక్టర్ సి.హెచ్. ప్రియాంక



**ప్రజాపక్షం/నారాయణపేట :** నారాయణపేట జిల్లా కేంద్రంలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్న మహిళా పెట్రోల్ బంక్‌కు రాష్ట్రంలో మంచి పేరు ఉందని, బంక్ లాభాల బాటలో నడుస్తుందని, ఐ అండ్ పిఆర్ కమిషనర్ గా తాను మహిళా పెట్రోల్ బంక్ నిర్వహణ గురించి పలు పత్రికలలో పాజిటివ్ కథనాల ప్రచురింపచేయించిన విషయాన్ని ఈ సందర్భంగా కలెక్టర్ గుర్తు చేశారు. ఇప్పుడు తానే నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా వచ్చానని, జిల్లాలో కొత్త కొత్త ఆలోచనలతో పెట్రోల్ బంక్ లా మరిన్ని కొత్త వ్యాపారాలకు శ్రీకారం చుడదామని కలెక్టర్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ భవనంలో జిల్లా మహిళా సమాఖ్య ఈసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సమావేశంలో గత నెల నిర్వహించిన సమావేశంపై సమీక్ష, ఎస్‌హెచ్‌జీల పనితీరు, జిల్లా సమాఖ్య, పెట్రోల్ బంక్ లావాదేవీలు, బ్యాంకు లింకేజీ, స్త్రీనిధి తదితర అంశాల గురించి చర్చించారు. ఈ సమావేశంలో డీఆర్డీవో మొగులప్ప, సేర్ఫ్ పి.ఎం.బాలస్వామి, డి.పి.ఎం.గోవింద్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు అరుంధతి, సుజాత, కోశాధికారి అంజమ్మ, సిబ్బంది ఉన్నారు.




## సమాచార హక్కు చట్టం పౌరుడి చేతిలో వజ్రాయుధం

సిఐసి చంద్రశేఖర్ రెడ్డి : 10 నెలల్లో 15 వేల కేసులు పరిష్కారం

**ప్రజాపక్షం/నల్లగొండ** : ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత, బాధ్యత కోసం సమాచార హక్కు చట్టం పౌరుడి చేతిలో వజ్రాయుధంలా పనిచేస్తుందని రాష్ట్ర సమాచార కమిషన్ ప్రధాన కమిషనర్ డాక్టర్ జి.చంద్రశేఖర్ రెడ్డి అన్నారు.మంగళవారం నల్గొండ కలెక్టరేట్‌లో పౌర సమాచార అధికారులు, అధికార యంత్రాంగానికి ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ప్రజాస్వామ్యంలో సమాచారం అందిస్తేనే ప్రజలకు ఉపయోగమని, పారదర్శకంగా సేవలు అందించేందుకు ఆర్టీఐ ఉపయోగపడుతుందని తెలిపారు.సెక్షన్ 4(1)(బి) ప్రకారం అధికారులు స్వచ్ఛందంగా సమాచారం ఇవ్వాలని,వెబ్‌సైట్‌లో రిజిస్టర్లు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు.రాష్ట్రంలో ఆర్టీఐ కింద 1.20లక్షల దరఖాస్తులు రాగా లక్ష మందికి సమాచారం అందించామని,గత 10 నెలల్లో 15 వేల కేసులు పరిష్కరించామని వెల్లడించారు. సమాచారం ఇవ్వని 15మంది పీఐవోలపై చర్యలు తీసుకున్నామని,మే 15 నాటికి రెవెన్యూ, మున్సిపల్ మినహా మిగతా అన్ని కేసులు పరిష్కరిస్తామని చెప్పారు.జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ,జిల్లాలో ఆర్టీఐ దరఖాస్తులు,అప్పీళ్లను ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరిస్తున్నామని తెలిపారు.ఈసదస్సులో ఎస్పిశరత్‌చంద్ర పవార్, అదనపు కలెక్టర్లు జె.శ్రీనివాస్, వై.అశోక్ రెడ్డి,డీఎఫ్‌వో రాజశేఖర్,ఆర్డీవోలు,జిల్లా అధికారులు, పీఐవోలు పాల్గొన్నారు.

## రోజుకు కనీసం 10 లారీల ధాన్యం అన్‌లోడ్

నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశం



**ప్రజాపక్షం/చిట్యాల**: రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా రబీ ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ ఆదేశించారు.మంగళవారం ఆయన చిట్యాల మండల కేంద్రంలోని ఉదయ్ రైస్ మిల్,వెంకటేశ్వర రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.రైస్ మిల్లు యజమానులతో ఆయన మాట్లాడుతూ ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు.రోజుకు కనీసం 10 లారీల ధాన్యాన్ని అన్‌లోడ్ చేయాలని, పనిని తగ్గించకుండా పూర్తి సామర్థంతో కొనసాగించాలని చెప్పారు. అలాగే హమాలీల సంఖ్యను పెంచి ధాన్యం సేకరణ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు.వర్షాలు పడే సూచనలు ఉన్న నేపథ్యంలో ధాన్యం తడవకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. అన్లోడింగ్ తొందరగా చేయకపోతే సంబంధిత మిల్లులకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.అవసరమైతే రా రైస్ మిల్లు నుంచి హమాలీలను తీసుకొచ్చి వారితో అన్‌లోడింగ్ చేయించాలని,ఆదేశించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని మిల్లు యజమానులను కలెక్టర్ ఆదేశించారు.రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్,పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డిఎం రాంపతి నాయక్,తహసిల్దార్ విజయ్,పౌర సరఫల డిటి ప్రదీప్,మిల్లు ఓనర్లు రమేష్,నరేష్.జిపిఓ జ్యోతి తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## బిసిల ద్రోహుల పార్టీ బిజెపి

జనగణనలో బిసి కులగణన చేపట్టకుంటే మోదీ పర్యటన అడ్డుకుంటాం: జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్**: బీసీ కులగణనపై కేంద్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వకుండా జాతీయ జనగణనలో స్వచ్ఛందంగా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు ఇవ్వడం బీసీలను నమ్మించి మోసం చేయడమేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు.మంగళవారం బీసీ నాయకుడు సుంకరి మల్లేష్ గౌడ్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2025 ఏప్రిల్ 30న ఢిల్లీలో జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో ఈసారి జరిగే జనగణనలో సమగ్ర కులగణన చేపడతామని నిర్ణయం తీసుకున్నప్పటికీ, నిన్నటి నుంచి ప్రారంభమైన జనగణనలో బీసీ కుటుంబాలను లెక్కించకుండా కేంద్రం పచ్చి మోసం చేస్తోందని మండిపడ్డారు.బీసీ కులాలను లెక్కించకుండా ఎన్నిసార్లు జనగణన చేపట్టినా బీసీలకు ఒరిగేదేమీ లేదని, బీసీలకు ప్రయోజనం లేని జనగణన ఎవరి కోసమని నిలదీశారు.బీసీ కులగణనపై బీజేపీ సమాధానం ఇవ్వకుంటే మే 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేపట్టబోయే తెలంగాణ పర్యటనను అడ్డుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్,సాయిబాబా ముదిరాజ్, గూడూరు భాస్కర్,జెల్లా ఆదినారాయణ,హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్‌లో స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి




**ప్రజాపక్షం/వలిగొండ** : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నేడు జరుగు హలో విద్యార్థి చలో సీఎం ఇంటికి కార్యక్రమానికి తరలి వెళ్లనున్న విద్యార్థులను పోలీసులు తెల్లవారి నుండి అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్ మాట్లాడుతూ విద్యార్థులకు రావాల్సిన ఫీజు బకాయిలు విడుదల చేయమంటే అక్రమ అరెస్టు చేసి విద్యార్థి ఉద్యమాన్ని అణిచివేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుట్రలు చేస్తుందని వారు అన్నారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకపోతే విద్యార్థులను, యువత ఏకం చేసి రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. తక్షణమే పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వారితో పాటు ఏఐవైఎఫ్ మండల అధ్యక్షులు మారోజు నరసింహా చారి, కార్యదర్శి సుద్దాల సాయికుమార్‌లను కూడా అరెస్టు చేశారు.

# ఇట్లా ఇంధనం వచ్చే... అట్లా అయిపోయే!

పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనం

నల్లగొండ జిల్లా కేంద్రంలో డీజిల్, పెట్రోల్ కొరతతో వాహనదారుల ఆందోళన



**ప్రజాపక్షం/నల్లగొండ** :జిల్లాలో డీజిల్,పెట్రోల్ కొరతతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత రెండు,మూడు రోజులుగా ఇంధన కొరత తీవ్రం కావడంతో పలు పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి.ఉదయం నుంచి రాత్రి వరకు బంకుల వద్ద వాహనాలు బారులు తీరాయి.గంటల తరబడి వేచి చూసినా ఇంధనం లభించకపోవడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్‌విజయవాడ జాతీయ రహదారి65పై చిట్యాల,దేవరకొండ,మిర్యాలగూడ, నల్లగొండ తదితర ప్రాంతాల్లోని బంకుల వద్ద వాహనదారులు భారీగా గుమిగూడారు.ముఖ్యంగా డీజిల్ కోసం లారీలు,ట్రాక్టర్లు,ఆటోలు పెద్ద సంఖ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. కొన్నిచోట్ల బంకు సిబ్బందితో వాహనదారులు వాగ్వాదానికి దిగారు.ఇంధనం కోసం గంటల తరబడి ఎదురుచూసినా స్టాక్ అయిపోయిందిఅని చెప్పడంతో పలువురు వాహనదారులు రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు.దీంతో కొంతసేపు వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి.సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు.ముందస్తు సమాచారం లేకుండా ఇంధన సరఫరా నిలిచిపోవడంతో అత్యవసర పనులు కూడా చేయలేకపోతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ పనులకు రైతులు, సరుకు రవాణాకు రవాణాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఇంధన సరఫరాలో అంతరాయం ఎందుకు ఏర్పడిందనే దానిపై స్పష్టత లేకపోవడంతో ప్రజల్లో ఆందోళన నెలకొంది. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డీజిల్,పెట్రోల్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## వడగండ్ల వానతో తడిసి ముద్దయిన ధాన్యం..

**ప్రజాపక్షం/నాంపల్లి:** మండల వ్యాప్తంగా మంగళవారం ఈదురు గాలులతో కురిసిన వడగండ్ల వాన నాంపల్లి కేంద్రంతో పాటు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల వద్ద ఉంచిన వరి ధాన్యాన్ని తడిపేసింది.ఆరుగాలం కష్టపడి పండించిన కొద్దిపాటి దిగుబడినైనా అమ్ముకొని సొమ్ము చేసుకుందామని రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చారు.భారీ వడగండ్ల వానకు ధాన్యం పూర్తిగా తడిసి ముద్దవ్వడంతో పాటు వరదలో కొంత కొట్టుకుపోయింది.పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి నేలకొరగడంతో గింజలు రాలిపోయాయి. దీంతో అన్నదాతలకు అపార నష్టం వాటిల్లింది. తడిసిన ధాన్యాన్ని కేటాయించిన గిట్టుబాటు ధరకే ప్రభుత్వం కొనుగోలు చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.ఈదురు గాలుల దాటికి పలు చోట్ల భారీ వృక్షాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పలుచోట్ల ఇళ్లపై కప్పులు కూలిపోయాయి.

## మిర్యాలగూడలో సీనియర్ జర్నలిస్ట్ మధు అంత్యక్రియలు





హాజరైన శాసనమండలి చైర్మన్, మంత్రి, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ జర్నలిస్టులు, ప్రముఖులు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ**: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క సీపీఆర్‌వో, సీనియర్ జర్నలిస్ట్ మారబోయిన మధుసూధన్(51) అంత్యక్రియలు మిర్యాలగూడలో మంగళవారం ముగిశాయి. సోమవారం హైద్రాబాద్‌లో గుండెపోటుతో మృతిచెందిన మధుసూదన్‌ను స్వగ్రామమైన మిర్యాలగూడకు తీసుకొచ్చారు. కన్నీటి వీడ్కోలు నడుమ అంత్యక్రియలు ముగిశాయి. మృతదేహాన్ని శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, డిప్యూటీ చైర్మన్ బాలునాయక్, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, వేముల వీరేశం, ఎమ్మెల్సీలు కెతావత్ శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యేలు నల్లమోతు భాస్కర్‌రావు, జూలకంటి రంగారెడ్డి, తిప్పన విజయసింహారెడ్డి, చిరుమర్తి లింగయ్యలు, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేత, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు బండా నరేందర్‌రెడ్డి, నల్లగొండ మున్సిపల్ ఛైర్మన్ చైతన్య శ్రీనివాస్‌రెడ్డి, మిర్యాలగూడ మున్సిపల్ ఛైర్మన్ చిలుకూరి సుధాబాలకృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకురాలు పాదూరి కరుణ, ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శ్రీనివాస్, హైద్రాబాద్, నల్లగొండకు చెందిన సీనియర్ జర్నలిస్టులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి అంతిమ యాత్రలో పాల్గొన్నారు.

**రూ.5లక్షల ఆర్థిక సహాయం...** మధుసూదన్ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ తరుపున రూ.5లక్షల ఆర్థిక సహాయాన్ని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కుటుంబసభ్యులకు అందించారు. కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మధుసూదన్ అకాల మృతి బాధాకరమని, ఆయన జర్నలిస్టుగా అనేక ప్రజా సమస్యలపై కథనాలు రాసి ప్రజలకు చైతన్యం కలిగించారని అన్నారు. ఆయన మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటన్నారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం నివాళి** : డిప్యూటీ సీఎం సీపీఆర్‌వో మధుసూదన్ మృతిపట్ల ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సంతాపం తెలిపారు. ఆయన మృతదేహాన్ని ఆయన సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. అదేవిధంగా ప్రజాపక్షం దినపత్రిక నల్లగొండ జిల్లా ప్రతినిధి జిల్లా యాదయ్య మధుసూదన్ కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలిపి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మీడియా రంగంలో మారబోయిన మధుసూదన్ నిర్వర్తించిన సేవలు చిరస్మరణీయమన్నారు.

**నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు...**
మధుసూదన్ మృతదేహాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు, ఆయన తనయుడు నల్లమోతు సిద్ధార్థలు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంత్యక్రియలో పాల్గొని పాడె మోసి ఔదార్యాన్ని చాటారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్, బిఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ఉన్నారు.






## 4 లేబర్ కోడ్‌లను రద్దు చేసి 44 కార్మిక చట్టాలను కొనసాగించాలి

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ** : మేడే ఉత్సవాలను గ్రామగ్రామాన, కార్మిక వాడల్లో అధిక సంఖ్యలో కార్మికులు హాజరై ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు.మంగళవారం ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో మేడే వాల్‌పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ధ్వజమెత్తారు.కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి,4లేబర్ కోడ్‌లుగా మార్చి కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా తయారుచేశారని విమర్శించారు. ఆకోడ్‌లను వెంటనే విరమించుకొని, సామాన్య కార్మికులకు ఉపయోగపడే 44 కార్మిక చట్టాలను యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేశారు.కనీస వేతనాలు అమలు చేయాలని, కాంట్రాక్టు, థర్డ్ పార్టీ,అవుట్‌సోర్సింగ్ విధానాలకు స్వస్తి పలికి ప్రతి ఒక్కరినీ పర్మినెంట్ ఉద్యోగులుగా నియమించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు కె.ఎస్.రెడ్డి,విశ్వనాథుల లెనిన్,గుండె రవి,ఎండీ జానీ,పెద్ది నాగరాజు,సత్యనారాయణ,బసాని వెంకటయ్య, కే. నారాయణ,కలామ్,నరేందర్ రెడ్డి,నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## డేటా సక్రమంగా వచ్చేలా వివరాలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు** : స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు జనాభా లెక్కల శిక్షణా కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి కాలంలో సర్వే నడుస్తున్నది కాబట్టి ఉదయం పూట త్వరగా వచ్చి వివరాలను సేకరించాలని, డేటా సక్రమంగా వచ్చేలా సక్రమంగా పనిచేయాలని, అన్ని వివరాలను ప్రజలనుండి సేకరించాలని తెలియజేశారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. డాక్టర్‌తో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, స్టాఫ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ సక్రమంగా వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని, ఇప్పుడు ఉన్న ఖాళీలలో సిబ్బందిని కేటాయిస్తామని తెలియజేశారు.

## నల్లగొండ స్మార్ట్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు

మేయర్ బుర్రి చైతన్య

ప్రతి డివిజన్‌కు రూ.10 లక్షలు..

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

మాస్టర్ ప్లాన్ లోపాలపై కార్పొరేటర్ల ఆవేదన



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నగరాన్ని స్మార్ట్ సిటీగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించి ఆదిశగా అడుగులు వేస్తున్నామని నల్లగొండ కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మేయర్ మాట్లాడుతూ, నగరాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తామని,ప్రతి డివిజన్‌లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.10 లక్షల చొప్పున నిధులు కేటాయించామని వెల్లడించారు. వేసవి కాలం ప్రారంభమై ఎండలు ముదురుతున్నందునప్రజలు ఇబ్బందులు పడకుండా తాగునీరు, విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా సమస్య తలెత్తితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కార్పొరేటర్లను కోరారు.15వ డివిజన్ కార్పొరేటర్ దొడ్డి రమేశ్ మాట్లాడుతూ విలీన గ్రామాలు,శివారు ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. అభివృద్ధి చెందిన డివిజన్లతో సమానంగా నిధులు ఇస్తే విలీన గ్రామాలు పోటీ పడలేవని అన్నారు. 24వ డివిజన్ కార్పొరేటర్ గోపగాని స్వాతీ రాజశేఖర్ మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను ఇష్టానుసారంగా రూపొందించడం వల్ల నివాస ప్రాంతాలను కూడా పబ్లిక్, సెమీ పబ్లిక్ జోన్లుగా కేటాయించారని,దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా 485, 488 సర్వే నంబర్లను మాస్టర్ ప్లాన్ నుంచి తొలగించాలని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ బచ్చలకూరి శరత్ చంద్ర,డిప్యూటీ మేయర్ అష్రఫ్ అలీ, కార్పొరేటర్లు అలకుంట్ల ఝాన్సీ నాగరత్నంరాజు, మారగోని భవానీ గణేష్,కుందురు దీపికా ప్రవీణ్‌కుమార్ రెడ్డి,పెరిక యాదయ్య,పేర్ల మల్లేశ్వరి అశోక్,రత్నపురం తారకమ్మ శ్రీనివాస్,బణావత్ దీప్లా నాయక్, మహ్మద్ ఇబ్రహీం,మారగోని నవీన్ గౌడ్, ఇటికాల మంగమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

సూర్యాపేట జిల్లా ఎస్‌పి కె. నరసింహ




**ప్రజాపక్షం/సూర్యాపేట** : చెడును ఆదిలోనే అంతమొందించాలని, తాత్కాలిక అందాన్ని, సుఖాన్ని ఇచ్చేది కష్టాలను తెచ్చి పెడుతుందని, చెడు అలవాట్లకు, మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని జిల్లా ఎస్‌పి కె. నరసింహ విద్యార్థులకు సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న భద్రత, డ్రగ్స్ నిర్మూలనలో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని నారాయణ జూనియర్ కళాశాల నందు పట్టణ పోలీసులు, షీ టీం బృందం, మానవ అక్రమ రవాణా నిరోధక బృందం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు సామాజిక అంశాలు, మహిళల, విద్యార్థుల భద్రత, డ్రగ్స్ దుష్ప్రభావం, మంచి ప్రవర్తన, చెడు ప్రవర్తన, పట్టుదల, ఉన్నత లక్ష్యాలు, శ్రమ, కష్టం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీసు శాఖ ప్రజల భద్రత, రక్షణ, శాంతి భద్రతల రక్షణలో అనుక్షణం కృషి చేస్తుందన్నారు. చదువుకునే వయస్సులో చెడు అలవాట్లకు దూరంగా ఉండి కష్టపడి చదువుకుంటే జీవితంలో మంచి విజయాన్ని సాధిస్తారని హితవు పలికారు. స్వల్పకాలిక అందం కోసం వెళ్తే భవిష్యత్తులో సమస్యలు వస్తాయన్నారు. సోషల్‌మీడియా ప్రభావానికి గురై చదువులను, లక్ష్యాలను అశ్రద్ధ చేయవద్దన్నారు. సోషల్ మీడియా ద్వారా మంచిని నేర్చుకోవాలి, చెడు సావాసాలు, స్నేహాలకు గురికావద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. కష్టపడే వయస్సులో సమయం వృధా చేసుకోవద్దు, విద్యతోనే అన్ని సాధించవచ్చని చెప్పారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి, డ్రగ్స్‌కు బానిసలైతే భవిష్యత్తు అంధకారం అవుతుందని తెలిపారు. బాలికలు స్వీయ రక్షణ కలిగి ఉండాలన్నారు. 18 సంవత్సరాలలోపు బాలికలను వేధింపులకు గురిచేసినట్లయితే అలాంటి వారిపై ఫోక్సో చట్టాల ప్రకారం కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకట్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్, ఎస్‌ఐలు, షీ టీం బృందం, మానవ అక్రమ రవాణా నిరోధక బృందం, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## యుద్ధంతో ప్రపంచానికి ముప్పు

సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు




**ప్రజాపక్షం/నల్లగొండ** : యుద్ధం వల్ల ప్రపంచ మానవాళికి ప్రత్యక్షంగా,పరోక్షంగా ముప్పు ఉందని సిపిఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు బివి రాఘవులు పేర్కొన్నారు.మంగళవారం నల్గొండ నగరంలోని స్టే ఇన్ హోటల్‌లో టీఎస్‌యూటీఎఫ్,సీఐటీయూ,పీపుల్స్ ప్రోగ్రెస్ ఫోరం ఆధ్వర్యంలో ఇరాన్‌పై ఇజ్రాయెల్,అమెరికా యుద్ధం, ప్రపంచ శాంతికి విఘాతం అనే అంశంపై సెమినార్ నిర్వహించారు.సెమినార్‌ను ప్రారంభించిన రాఘవులు మాట్లాడుతూ చమురు నిల్వలపై ఆధిపత్యం కోసమే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరాన్‌పై యుద్ధానికి దిగారని ఆరోపించారు.61 రోజులుగా సాగుతున్న ఈయుద్ధాన్ని అమెరికా ప్రజలే వ్యతిరేకిస్తున్నారని,కార్పొరేట్ల కోసమే ట్రంప్ యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు.ప్రధాని మోదీ ఆర్‌ఎస్ భావజాలంతో అమెరికా చెప్పుచేతల్లో కీలుబొమ్మలా వ్యవహరిస్తున్నారని, విశ్వగురు కాదు విశ్వ బానిసగా మారారని విమర్శించారు.రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు,మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ యుద్ధాల వల్ల గ్యాస్,పెట్రోల్,డీజిల్, ఎరువుల ధరలు పెరిగి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, శాంతి కోసం అందరూ ఆలోచించాలని పిలుపునిచ్చారు.ఈ సెమినార్‌లో ఈ సెమినార్ లో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మల వీరారెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి,ఆవాజ్ జిల్లా కార్యదర్శి సయ్యద్ హషం,ఎండి సలీం,పాలడుగు ప్రభావతి,కందాల ప్రమీల, పెరమళ్ళ వెంకటేశం,రాజశేఖర్ రెడ్డి,పాలడుగు నాగార్జున, మాల్లం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/తుర్కపల్లి** : తుర్కపల్లి మండలంలోని గంధమల్ల గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సబ్ స్టేషన్ కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య శంకుస్థాపన చేశారు.గంధమల్ల గ్రామంలో విద్యుత్ సరఫరాను మెరుగుపరచే లక్ష్యంతో నిర్మించనున్న సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. రైతులకు మద్దతుగా పై ఏ సీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ చర్యల ద్వారా స్థానిక రైతులకు తక్షణ సౌకర్యాలు లభిస్తాయని పేర్కొన్నారు. వీరారెడ్డిపల్లి, తిరుమలపూర్, తుర్కపల్లి, ముల్కలపల్లి గ్రామాల్లో పై ఏ ఏస్ వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, రైతుల పంటలకు న్యాయమైన ధరలు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది, విలేకరులకు ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని రక్షణార్థం తెల్ల టోపీలను పంపిణీ చేశారు.

ప్రజాపక్షం
Telugu National Daily
మహబూబ్‌నగర్
బుధవారం
29-04-2026
www.prajapaksham.in

"అక్కినేని నాగార్జున 100వ మైల్ స్టోన్ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు రా. కార్తిక్ ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది."

# రీల్

## జులై 24న 'ది ఇండియా స్టోరీ' రిలీజ్



కాజల్ అగర్వాల్, శ్రేయస్ తల్పడే నటించిన సోషియోనేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' జూలై 24న థియేటర్లలో విడుదలకు సిద్ధమైంది. చేత్తన్ డికె దర్శకత్వంలో, సాగర్ బి షిండే నిర్మించి రచించిన ఈ చిత్రం దేశంలోని సమకాలీన అంశాలతో రూపొందించారు.'ది ఇండియా స్టోరీ' ('ది ఇండియా స్టోరీ: స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్) ప్రధానంగా రసాయనాల దుర్వినియోగం, పురుగుమందుల సాగు, సంబంధిత కుంభకోణాల నేపథ్యంలోని కథ. ఒక కుటుంబం ఎదుర్కొనే కష్టాలకే పరిమితం కాకుండా, దేశవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే పెద్ద సంక్షోభాన్ని ఈ కథ చూపించబోతోంది. సిస్టమ్‌లోని లోపాలు, కఠినమైన నియంత్రణల అవసరం వంటి అంశాలను కూడా ఈ చిత్రంలో ఇంపాక్ట్‌ఫుల్‌గా వుంటాయి. ఈ చిత్రం గురించి నిర్మాత సాగర్ బి షిండే మాట్లాడుతూ.. ఇది మన దేశంలో చాలా మందిని ప్రభావితం చేస్తున్న వాస్తవ సమస్య. రసాయనాల దుర్వినియోగం కేవలం పర్యావరణ సమస్య కాదు, అది మానవ సంక్షోభం. ఈ సినిమా ద్వా రా అవగాహన కలిగించి, బాధ్యతపై చర్చలు ప్రారంభించాలనుకుంటున్నాం. దర్శకుడు చేత్తన్ డికె మాట్లాడుతూ.. ఈ కథను నిజాయితీగా చూ పించేందుకు టీమ్ మొత్తం ఎంతో కష్టపడ్డారు. కాజల్, శ్రేయస్ ఇద్దరూ తమ పాత్రలను ఎంతో నిబద్ధతతో పోషించారు. వారి నటన సినిమాకు మరింత బలం చేకూర్చింది. వినోదంతో పాటు ప్రభావవంతమైన కథనాన్ని అందించడానికి ప్రయత్నించాంఈ చిత్రానికి సుమిత్ బగాడే, అనితా జాద వ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి సహనిర్మాతలు. డిఒపి నిశాంత్ భగవత్, సంగీత దర్శకుడు మంగేష్ ధక్డే, ఎడిటర్ ఆశిష్ మహాత్రే, గీత రచయిత షకీల్ అజామీ, సౌండ్ డిజైనర్ అన్మోల్ భావేల పనితీరుతో ఈ చిత్రం మరింత ఉన్నత స్థాయికి చేరింది. ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషలలో విడుదల కానుంది. జీ స్టూడియోస్ ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేస్తుంది.

## 'బాబీ' సినిమా కోసం చిరు సిద్ధం



మెగాస్టార్ చిరంజీవి మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ బాబీ కొల్లితో కలిసి మెగాస్టార్ చేస్తున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కె.వి.ఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె.నారాయణ నిర్మిస్తున్నారు. చిరు బాబీ2 చిత్రానికి సంబంధించిన లుక్ టెస్ట్ విజయవంతంగా పూర్తయింది. ఈ లుక్ టెస్ట్‌కు సంబంధించి చిరంజీవి ఫేస్ కనిపించకుండా బ్లాక్ అండ్ వైట్‌లో ఒక ఫోటోను మీడియాకు రిలీజ్ చేశారు. చిరంజీవి కొత్త షేడ్‌లో కనిపించనున్నట్లు పోస్టర్ హింట్ ఇచ్చింది. 'వాల్తేర్ వీరయ్య' బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో వస్తున్న రెండో చిత్రం కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. మాస్ ఎంటర్టైన్మెంట్‌ను తనదైన స్టైల్‌లో అద్భుతంగా అందించే బాబీ కొల్లి, ఈసారి మెగాస్టార్ కోసం మరింత ఇంటెన్స్ క్యారెక్టర్‌ను డిజైన్ చేశారు. చిరంజీవి స్క్రీన్ ప్రెజెన్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా స్క్రిప్ట్ సిద్ధమౌతోంది. ఈ కాంబో నుంచి హైఆక్టేన్ ఎంటర్‌టైన్‌మెంట్ ప్యాకేజ్ రాబోతుంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన ముహూర్తం, రెగ్యులర్ షూటింగ్ వివరాలను మేకర్స్ ప్రకటించనున్నారు.

తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి చేసిన సినిమా 'గాయపడ్డ సింహం'. ఈ సినిమాలో ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మే 1వ తేదీన థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. గాయపడ్డ సింహం సినిమాలో నేను ఒక మంచి క్యామియో రోల్ చేస్తున్నాను. నా పాత్ర పేరు శాలిని. తను ఒక వ్లాగర్. ఇందులో తరుణ్‌తో ఒక రొమాంటిక్ ట్రాక్ కూడా ఉంటుంది. డైరెక్టర్ కశ్యప్ చాలా డిఫరెంట్‌గా రాశారు. ఆయన క్రియేట్ చేసిన యూనివర్స్, క్యారెక్టర్స్ అన్నీ చాలా హిలేరియస్ గా వచ్చాయి. మల్టిపుల్ లేయర్స్‌లో జరిగే కథ ఇది. ప్రతి పాత్రకి ప్రాముఖ్యత ఉంటుంది. నా క్యారెక్టర్‌లో కామెడీ ఎలిమెంట్ ఎక్కువగా ఉంటుంది. క్యారెక్టర్ రైటింగ్ చాలా ఫన్నీగా ఉంది. సినిమా చూసిన ఆడియన్స్ కి మళ్లీ చూడాలని అనిపిస్తుంది. కథ విన్నప్పుడు నచ్చితే తప్పకుండా చేస్తాను. ఈ సినిమా కథ చాలా క్రేజీగా ఉంటుంది. తరుణ్ భాస్కర్ చాలా సరదాగా ఉంటారు. ఆయన కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ఆయనతో సీన్స్ చేస్తున్నప్పుడు చాలా ఎంజాయ్ చేశాను. ఆయన చిన్న ఎక్స్‌ప్రెషన్ ఇచ్చినా నాకు నవ్వు వచ్చేస్తుంది. ఇందులో శ్రీ విష్ణు క్యారెక్టర్ చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది. ఆ పాత్రను చాలా బాగా డిజైన్ చేశారు. ఆడియన్స్ ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు. ఈ సినిమాలో యాక్షన్, రొమాన్స్, కామెడీ ఇలా అన్ని ఎలిమెంట్స్‌ను కలిపి హిలేరియస్‌గా తెరకెక్కించారు.

## వచ్చే ఏడాది డైరెక్షన్ చేస్తా

### హీరోయిన్ ఫరియా అబ్దుల్లా



ఈ సినిమాలోని అన్ని పాటలు నాకు చాలా ఇష్టం. 'బ్రైడ్ పాట, 'జింగాల' పాట నా ఫేవరెట్స్. తరుణ్, జెడి , పవన్& ఇలా ఇందులో చాలా మంది దర్శకులు ఉన్నారు. వారితో కలిసి పని చేయడం మంచి అనుభవం. 'సత్య' నుంచి 'పెళ్లి చూపులు' వరకు ఎన్నో విషయాలు మాట్లాడుకునేవాళ్లం. జేడీ చాలా ఆసక్తికరమైన విషయాలు చెబుతారు. అందరూ కశ్యప్‌పై ఫుల్ కాన్ఫిడెన్స్‌తో పని చేశారు. ఇందులో కొన్ని సీన్స్‌ను రీక్రియేట్ చేశాం. అవన్నీ చాలా హిలేరియస్‌గా ఉంటాయి. దుల్కర్‌తో ఫుల్ లెంగ్త్ సినిమా చేయాలని ఉంది. కొత్తగా చేస్తున్న సినిమాలు 'భగవంతుడు' రాబోతోంది. అలాగే 'సిగ్మా' చేస్తున్నాను. మరో రెండు సినిమాలు స్టార్ట్ అవబోతున్నాయి. సత్యదేవ్ గారితో ఒక సినిమా చేస్తున్నాను.

## థియేటర్‌లో ఏసి లేకపోయినా ..సినిమా చల్లగా ఉంటుంది

### రాజీవ్ కనకాల



సుమంత్ ప్రభాస్, సుభాష్ చంద్ర, అభినవ్ రావు, సురెడ్ పప్పెట్ ప్రొడక్షన్స్ 'గోదారి గట్టుపైన' బ్యూటిఫుల్ లవ్ స్టోరీ, రూరల్ ఫ్యామిలీ డ్రామా ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ చిత్రం మే 8న థియేటర్స్ లోకి వస్తోంది. ఈ ట్రైలర్ రిలీజ్‌లో రాజీవ్ కనకాల మాట్లాడుతూ.. థియేటర్‌లో ఏసి లేకపోయినా ఈ సినిమా చుస్తున్నపుడు చల్లగా అనిపిస్తుంది. ఇది గ్యారెంటీ. ట్రైలర్ చాలా బాగుంది. సుభాష్ మంచి పాత్ర ఇచ్చారు. అభినవ్ రావు మంచి నిర్మాత. ఈ ప్రొడక్షన్ హౌస్ పెద్ద స్థాయికి వెళ్లాలని కోరుకుంటున్నాను అని అన్నారు. హీరో సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ మేము 'ఫేమస్' సినిమాకు మీరు ఎంతో సపోర్ట్ ఇచ్చారు. ఈ సినిమాకి కూడా అలాగే ఆదరణ ఇవ్వాలని కోరుకుంటున్నాను. నేను పుట్టి పెరిగింది తెలంగాణ. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా గోదారి యాస నేర్చుకుని మాట్లాడాను. ప్రతి డైలాగ్‌ను సహజంగా చెప్పడానికి ప్రయత్నించాను. గోదావరి ప్రాంతం చాలా అందంగా ఉంటుంది. అక్కడి లొకేషన్స్ నాకు కేరళ కంటే అందంగా అనిపించాయి. మే8న మీ ఫ్యామిలీతో కలిసి ఈ సినిమాను చూడండి. ఈ సమ్మర్ లో సినిమా అందరికీ కూల్ వైబ్ ఇస్తుంది. డైరెక్టర్ సుభాష్ చంద్ర మాట్లాడుతూ ఈ ట్రైలర్ మీకు నచ్చడం చాలా ఆనందంగా ఉంది. తరాలు మారినా ప్రేమ మాత్రం మారదు. ఇందులో ప్రేమికుల ప్రేమతో పాటు తండ్రికూతురు ప్రేమను చూపించాం. సినిమా చూస్తున్నప్పుడు ప్రేక్షకుడి ముఖంలో చిరునవ్వు ఉంటుంది. మా 'గోదారి గట్టుపైన' ఈ వేసవిలో ఒక చలివేంద్రంలాంటిది. ప్రొడ్యూసర్ అభినవ్ రావు మాట్లాడుతూ ఈ ఈవెంట్‌కి వచ్చిన అందరికీ థాంక్స్. సుభాష్ చాలా అద్భుతంగా సినిమా తీశాడు. అవుట్‌పుట్ విషయంలో చాలా హ్యాపీగా ఉన్నాను. సుమంత్ అద్భుతంగా నటించాడు. చివరి 40 నిమిషాలు చాలా భావోద్వేగంగా ఉంటాయి. హీరోయిన్ నిధి ప్రదీప్ మాట్లాడుతూ.. ఈ సినిమా నా జీవితంలో ఎప్పటికీ గుర్తుండిపోయే అనుభవం. 'మాయ' పాత్ర అందరికీ నచ్చుతుంది. జగపతిబాబు, లైలా, సుమంత్‌తో పని చేయడం చాలా ఆనందంగా అనిపించింది. ఇది ఒక నీట్ అండ్ క్లీన్ ఫిల్మ్. ఈ సమ్మర్‌లో మీ మూడ్‌ను కూల్ చేస్తుంది. ఈ కార్యక్రమంలో రేణు, దేవి ప్రసాద్, రాజ్‌కుమార్ కసిరెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

## మళ్ళీ తెరపై నాగార్జున-టబు జోడీ



అక్కినేని నాగార్జున 100వ మైల్ స్టోన్ సినిమాను అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. దర్శకుడు రా. కార్తిక్ ఈ చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. ఇప్పటికే ఈ సినిమా చిత్రీకరణ వేగంగా కొనసాగుతోంది.ఈ ప్రాజెక్ట్‌కు మరింత క్రేజ్ తెచ్చేలా నటి టబు కీలక పాత్రలో జాయిన్ అయ్యారు. ఆమె ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. నాగార్జున, టబులది సూపర్ హిట్ కాంబినేషన్. ఈ జోడీ మళ్లీ తెరపై కనిపించనుండటం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది.నాగార్జున–టబు కాంబినేషన్ లో 'నిన్నే పెళ్లాడతా', 'ఆవిడ మా ఆవిడే' వంటి విజయవంతమైన చిత్రాలు ప్రేక్షకులని అలరించాయి. సిసింద్రి సినిమాలో కూడా ఆమె ప్రత్యేకంగా కనిపించారు. ఇప్పుడు నాగార్జున 100వ సినిమాలో మరోసారి ఆ మ్యాజిక్‌ను రిపీట్ కానుంది. ఈ చిత్రానికి సంబధించిన నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాలు త్వరలోనే వెల్లడించనున్నారు.

## బెక్కెం వేణుగోపాల్ తాజా చిత్రం 'ప్రాజెక్ట్ 15ఎం'



మేం వయసుకు వచ్చాం, సినిమా చూపిస్త మావ, హుషారు వంటి పలు విజయవంతమైన చిత్రాలను అందించిన నిర్మాత బెక్కం వేణుగోపాల్. లక్కీ మీడియా బ్యానర్ పై దీవెల శ్రీనివాస రావు కలిసి నిర్మిస్తున్న సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'ప్రాజెక్ట్ 15ఎం'. ఈ చిత్రంతో సాయితేజను దర్శకుడిగా పరిచయం చేస్తున్నారు.ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకొని ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్‌లో ఉంది.త్వరలో హీరో, హీరోయిన్, మిగిలిన నటీనటుల వివరాలు మేకర్స్ తెలియజేస్తామని నిర్మాత బెక్కెం వేణుగోపాల్ చెప్పారు. ఈ చిత్రానికి సహ నిర్మాతలు: రాగూర్, నితీష్, నిఖిల్, డిఓపి: రవికిరణ్ బోయిడాపు, ఎడిటర్: శ్యామ్ వాడవల్లి, సంగీతం: శశాంక్ తిరుపతి, చీఫ్ అసోసియేట్ డైరెక్టర్: నాగేంద్ర వర్మ, సహ రచయిత: లక్ష్మణ్ విశ్వనాదుల.

---

తమిళనాడులో వరుసగా..

## రెండోవ ఏడాదీ రెండంకెల వృద్ధి

**చెన్నై :** తమిళనాడు 2025–26లో 10.83 శాతం వృద్ధిని నమోదు చేసి, వరుసగా రెండో ఏడాది కూడా రెండంకెల ఆర్థిక వృద్ధిని సాధించి రికార్డు సృష్టించింది. ఈ విజయం ఆరంభం మాత్రమే అని, ప్రజల మద్దతుతో మరిన్ని విజయాలు సాధిస్తామని ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ పేర్కొన్నారు. 'సాధన'కు తమిళనాడు పర్యాయపదంగా నిలిచిందని, ద్రావిడ నమూనా ప్రత్యేకమైనది, ఎందుకంటే అది చెప్పినదానిని గణాంకాలతో సరిపోల్చుతుందని ఆయన అన్నారు. 'డిఎంకె పాలనలోని మొదటి మూడేళ్లలో పునాది వేసిన మేము, ఇప్పుడు వరుసగా రెండు సంవత్సరాలు రెండంకెల వృద్ధి రికార్డును సాధించాము. మా అద్భుతమైన పరిపాలనకు, కష్టానికి మద్దతు ఇచ్చిన తమిళనాడు ప్రజలకు ధన్యవాదాలు. ఇది ఆరంభం మాత్రమే. మీ మద్దతుతో, మేము మరెన్నో శిఖరాలను చేరుకుంటామని మాకు నమ్మకం ఉంది' అని ముఖ్యమంత్రి ఎక్స్ ఛానెల్‌లో అన్నారు. శ్రేష్ఠతను సాధించే క్రమంలో తమిళనాడుకు ఇతర భారత రాష్ట్రాలతో పోటీ లేదని, దక్షిణాసియాలో తమిళనాడు ఒక అగ్రగామి రాష్ట్రంగా ఎదగాలని స్టాలిన్ ఉద్ఘాటించారు.

## పోలీస్ స్టేషన్లలో సిసిటివిల ఏర్పాటుకు... నిధుల వినియోగంపై సమావేశం

### అమికస్ క్యూరీని కోరిన 'సుప్రీం కోర్టు'

**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా పోలీస్‌స్టేషన్లలో సిసిటివిల ఏర్పాటు కోసం రాష్ట్రాలు నిధులు వినియోగించే అంశంపై చర్చించేందుకు మే 6న ఒక సమావేశం ఏర్పాటు చేయాలని మంగళవారం సుప్రీం కోర్టు ఆదేశించింది. పోలీస్ స్టేషన్లలో పనిచేయని సిసిటివిల కొరతకు సంబంధించినసుమోటో కేసులో అమికస్ క్యూరీగా తమకు సహాయం చేస్తున్న సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవేను మే 6న కేంద్రం, అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో ఒక సమావేశం నిర్వహించాలని న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం కోరింది.'గతంలో చేసినట్లుగానే, కేంద్ర ప్రభుత్వ హోం కార్యదర్శి, జాయింట్ లేదా అదనపు కార్యదర్శి హోదాకు తక్కువ కాని ఆయన నామినీ, రాష్ట్రాలు /కేంద్రపాలిత ప్రాంతాల హోం కార్యదర్శులు పాల్గొనే ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని మేం భావిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. రాష్ట్రాలు నిధులు వినియోగించుకునే అంశాన్ని అమికస్ క్యూరీ లేవనెత్తిన తర్వాత ఈ సమస్య తలెత్తింది.

## 'టిజిజెన్‌కో'కు ఐఎస్ఒ సర్టిఫికేషన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టిజిజెన్‌కో) నాణ్యత, సామర్థ్యం, నిరంతర మెరుగుదల పట్ల చూపుతున్న కట్టుబాటుకు అంతర్జాతీయ గుర్తింపు లభించింది. సంస్థ ప్రతిష్టాత్మకమైన ఐఎస్ఓ (క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్) సర్టిఫికేషన్‌ను సాధించింది. ఈ సర్టిఫికేషన్‌ను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క చేతుల మీదుగా ఎనర్జీ స్పెషల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి టిజిజెన్‌కో చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ హరీష్ అందుకున్నారు. ఒక స్వతంత్ర ఐఎస్ఓ ధృవీకరణ సంస్థ నిర్వహించిన సమగ్ర ఆడిట్ అనంతరం ఈ గౌరవం దక్కింది. ఈ తనిఖీల్లో భాగంగా ఆడిట్ బృందం టిజిజెన్‌కోలోని అన్ని విభాగాలు, కార్యకలాపాల విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించింది. ప్రధానంగా ఐఎస్ఓ పత్రాల అనుసరణ, విభాగాల వారీ పనితీరు, కార్యకలాపాల ప్రభావిత్వం, సంస్థ లక్ష్యాల సాధన, నాణ్యత నిర్వహణ వ్యవస్థల అమలును బృందం లోతుగా మూల్యాంకనం చేసింది. ప్రతి విభాగం అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉత్తమ పద్ధతులను పాటిస్తోందని నిర్ధారించిన అనంతరం ఈ సర్టిఫికేషన్ మంజూరుకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క మాట్లాడుతూ టిజిజెన్‌కో ఉన్నత నాణ్యత సేవలకు, బలమైన నిర్వహణ వ్యవస్థలకు ఈ గుర్తింపు ఒక నిదర్శనమని కొనియాడారు. ఈ అంతర్జాతీయ ధృవీకరణ సంస్థ కార్యకలాపాల సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడమే కాకుండా, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేలా బాధ్యతను పెంచుతుందని అధికారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్ పిడిసిఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐఎస్ఓ ప్రతినిధి శివయ్య పాల్గొన్నారు.

## 126% పెంపు

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల తర్వాత ధరలు పెరుగుతాయనే తప్పుడు పుకార్ల కారణంగా సాధారణ ప్రజలు భయపడి, అవసరానికి మించి కొనుగోలు చేయడమేని పౌర సరఫరా శాఖ వెల్లడించింది. ఈ సమస్యను పరిష్కరించడానికి పెట్రోల్, డీజిల్ కంపెనీలకు మార్కెట్లో సరిపడా నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని కమిషనర్ ఎం. స్టీఫెన్ రవీంద్ర ఆదేశాలు జారీ చేశారు. సరఫరాను వేగవంతం చేయడానికి, డీలర్ల నుంచి ముందుగానే ఆర్డర్లు తీసుకుంటూ, రాష్ట్రవ్యాప్తంగా 3,100 ఇంధన (ట్యాంకర్ల) వాహనాలను రంగంలోకి దించారు.పెట్రోల్ బంకుల్లో నిల్వలు అయిపోకముందే వాటికి ఇంధనం చేరేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రతి మూడు గంటలకోసారి బంకుల నుంచి నిల్వల వివరాలు తెప్పించుకోవడంతో పాటు, ఎప్పటికప్పుడు టెలికాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ముఖ్యంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా పెట్రోల్, డీజిల్ అందేలా చూడాలని కఠిన ఆదేశాలు ఇచ్చారు. దీని వల్ల పంట కోతలు, ధాన్యం కొనుగోళ్లకు ఎలాంటి ఆటంకం కలగకుండ చర్యలు తీసుకుంటున్నారు. ఈ నెల 27 నాటికి, రాష్ట్రవ్యాప్తంగా రోజువారీ డిజిల్ పంపిణీ 151శాతం పెరిగి 7,348 కిలో లీటర్ల నుంచి 18,449 కిలో లీటర్లకు పెరగడంతో రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ పంపిణీ కూడా దాదాపు రెట్టింపు చేశారు. హైదరాబాద్‌లో ఎలాంటి కొరత లేకుండ ఇంధన సరఫరాను 43 శాతంమేర పెంచారు. నగరంలో డీజిల్ నిల్వలను 46శాతం (3,393 నుంచి 4,957 కిలో లీటర్లకు), పెట్రోల్ నిల్వలను 40శాతం (3,908 నుంచి 5,466 కిలో లీటర్లకు) పెంచినట్లు వెల్లడించారు. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ ఏలాంటి కొరత లేదని ప్రజలు పుకార్లను నమ్మవద్దని, ఎప్పటిలాగే తమకు అవసరమైన మేరకే పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయాలని అధికారులుకోరారు.

రాష్ట్రవ్యాప్తంగా పలుచోట్ల పెట్రోల్, డీజిల్ కొరత నెలకొంది. హైదరాబాద్‌లోని పలు బంకుల్లో మూడో రోజూ నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. పెట్రోల్ ఉన్న బంకుల ముందు వాహనాలు బారులు తీరుతున్నాయి. చంపాపేట్, ఐఎస్ సదన్‌లో పెట్రోల్ బంకుల ముందు వాహనదారులు ఆందోళనకు దిగారు. గంటల తరబడి క్యూలో ఉండాల్సి వస్తోందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు పెట్రోల్ బంకుల వద్ద వాహనాలు రోడ్లపై నిలవడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడుతోంది. బంకుల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా ఉండేందుకు కొన్నిచోట్ల పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనదారులు బాటిల్స్, క్యాన్లలో ఇంధనం నింపుకోకుండా పహారా కాస్తున్నారు.

## తుదిదశ దంగల్

(మొదటి పేజీ తరువాయి)

పోలీసు పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించింది. పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించేందుకు 2వేల 321 కంపెనీల కేంద్ర బలగాలను మోహరించింది. అత్యధికంగా కోల్‌కతాలో 273 కంపెనీల బలగాలను మోహరించింది. పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించడానికి కెమెరాలతో కూడిన డ్రోన్‌లను కూడా ఉపయోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. బెంగాల్‌లో టిఎంసి, బిజెపి, కాంగ్రెస్, సిపిఐ(ఎం) బరిలో ఉండగా, తీవ్ర పోటీ మాత్రం టిఎంసి, బిజెపి మధ్య నెలకొంది. సిఎం మమత బెనర్జీ పోటీ చేస్తున్న భవానీపూర్ నియోజకవర్గానికి ఈ దఫాలోనే పోలింగ్ జరగనుంది. ప్రతిపక్ష నేత, బిజెపి నాయకుడు సువేందు అధికారి అదే స్థానం నుంచి పోటీ చేస్తుండటంతో పోరు హోరాహోరీగా జరిగే అవకాశం ఉంది. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ ఎంపి అధిర్ రంజన్ చౌధరి 25 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. బహరంపూర్ నుంచి ఆయన బరిలోకి దిగారు. అయితే 2021లో జరిగిన ఎన్నికల్లో టిఎంసి 123 స్థానాలను గెల్చుకోగా, బిజెపి కేవలం 18 స్థానాలను, ఐఎస్ఎఫ్ ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి. ఒక్క ఉత్తర 24 పరగణాలలోనే 33 సీట్లు, దక్షిణ 24 పరగణాలలో 31, హౌరాలో 16, నాదియాలో 17, హుగ్లీలో 18, పూర్వ బర్ధమాన్‌లో 16 సీట్లు ఉండగా, కోల్‌కతాలోని 11 సీట్లు ప్రతీకాత్మకంగా అత్యంత ప్రతిష్టాత్మకమైనవిగా నిలిచాయి. 2021లో, టిఎంసి కోల్‌కతాలోని మొత్తం 11 సీట్లను, హౌరాలోని మొత్తం 16 సీట్లను, దక్షిణ 24 పరగణాలలో 30, ఉత్తర 24 పరగణాలలో 28, హుగ్లీలో 14, నాదియాలో ఎనిమిదింటిని గెలుచుకుంది. బిజెపికి ప్రధాన లాభాలు ఉత్తర 24 పరగణాలు, నాదియా జిల్లాల్లో లభించాయి. మొదటి దశలో రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 93.19 శాతం పోలింగ్ నమోదైన తర్వాత, టిఎంసి ఇప్పటికే 100 సీట్ల మార్కును దాటిందని బెనర్జీ పేర్కొన్నారు. కానీ అసలైన పోరు ఓటర్ల జాబితాల విషయంలో జరుగుతోంది. ఓటర్ల జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (సర్) వల్ల, తొలగింపులు రెండవ దశలో బహుశా అత్యంత రాజకీయ సున్నితమైన అంశంగా మారాయి. ఉత్తర 24 పరగణాలలో 12.6 లక్షలకు పైగా, దక్షిణ 24 పరగణాలలో 10.91 లక్షలకు పైగా, కోల్‌కతాలో దాదాపు 6.97 లక్షలు, హౌరాలో సుమారు ఆరు లక్షలు, హుగ్లీలో 4.68 లక్షలు, నాదియాలో దాదాపు 4.85 లక్షల పేర్లు తొలగిపోయాయి. కనీసం 25 నియోజకవర్గాలలో తొలగించబడిన పేర్ల సంఖ్య గత విజయ మార్జిన్‌ను మించిపోయింది. మైనారిటీలు, వలసదారులు, పేద బెంగాలీ మాట్లాడే ఓటర్లను లక్ష్యంగా చేసుకుని ఈ తొలగింపులు జరిగాయని టిఎంసి ఆరోపిస్తోంది. నకిలీ పేర్లు, అక్రమ చొరబాట్ల వల్ల ఏళ్లుగా జాబితాలు వక్రీకరించబడ్డాయని బిజెపి వాదిస్తోంది. తొలగించబడిన పేర్ల కంటే ఓట్ల తేడా స్వల్పంగా ఉన్న చోట, సర్ కేవలం ఫలితాలనే కాకుండా, ఎన్నికల అనంతర కథనాన్నే మార్చగలదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. అయితే, ఆ పెద్ద పోరులో భబానీపూర్ అత్యంత ప్రతిష్టాత్మకమైన సీటుగా నిలిచింది. ఇది వాస్తవానికి నందిగ్రామ్‌లో జరిగిన పోరుకు పునరాగమనం లాంటిది. అక్కడ 2021లో అధికారి, బెనర్జీని ఓడించారు. ఐదేళ్ల తర్వాత, ఈ పోరు టిఎంసి అధినేత్రి సొంత కంచుకోటకు మారింది. ఇదిలా ఉండగా, తుది దశ ఎన్నికల్లో 142 మంది ఎమ్మెల్యేలను ఎన్నుకోవడమే కాకుండా, టిఎంసి తన దక్షిణ కంచుకోటను ఇంకా నిలుపుకుందా లేదా బిజెపి చివరకు రాష్ట్ర సచివాలయం నబన్నాకు మార్గాన్ని కనుగొందా అనే విషయాన్ని కూడా తేల్చనుంది.

## విద్యార్థి నేతల అరెస్ట్

(మొదటి పేజీ తరువాయి)




వి.ఆంజనేయులు, శాంతి కుమార్, కైలాష్, దత్తురెడ్డి, సాయి ఆజాద్, కుర్ర రాకేష్, అనిల్, హరీష్, లక్ష్మణ్, రాజశేఖర్, ఉదయ్, మరుపాక లోకేష్, అభిషేక్, బాలాజీ, కనకబాబు, శివ, కుషాల్, అరుణ్, లింగం, కిషోర్, గణేష్, శేఖర్, మహేష్ బాబు తదితరులు ఉన్నారు.

**100 రోజుల్లో ఫీజు రియంబర్స్‌మెంట్ అన్నారు**

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్‌ను 100 రోజుల్లోనే విడుదల చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లు గడుస్తున్న ఎందుకు విడుదల చేయడం లేదని పుట్ట లక్ష్మణ్ ప్రశ్నించారు. అందరికీ బకాయిలను ఇస్తున్న ప్రభుత్వం విద్యార్థులకు ఓటు హక్కు లేదని చిన్న చూపు చూస్తూ వారి జీవితాలతో చెలగాటమాడడం సరికాదన్నారు. విద్యాశాఖ బాధ్యతలను చూస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే విద్యార్థులకు సంబంధించి ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కసిరెడ్డి మణికంఠరెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి విద్యార్థులు సైతం ఎంతో కృషి చేశారన్నారు. అయినా విద్యార్థులు ప్రభుత్వంలో భాగస్వామ్యం అడగడంలేదని, తమ భవిష్యత్ కోసం ఫీజు రియింబర్స్‌మెంట్‌ను మాత్రమే అడుగుతున్నారన్నారు. కమిషన్ ఇస్తే తప్ప ప్రభుత్వం నిధులు విడుదల చేయదా అని ప్రశ్నించారు. ఆ కమిషనే కావాలంటే విద్యార్థులంతా జోలే పట్టి వసూళ్లు చేసి చెల్లిస్తామని ఆయన పేర్కొన్నారు.

**అక్రమ అరెస్టులపై తక్కళ్ళపల్లి ఖండన**

విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా సిఎం ఇంటికి పాదయాత్రగా వెళుతున్న ఎఐఎస్ఎఫ్ నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయం మంగళవారం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరిన విద్యార్థి నాయకులను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుని బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అన్యాయమన్నారు. వివిధ జిల్లాలలో కూడా ఎక్కడికక్కడ విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేశారని అన్నారు. విద్యార్థుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే, అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్, స్కాలర్‌షిప్‌ల బకాయిల చెల్లింపులో జాప్యం వల్ల ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు హాల్ టికెట్లు, మెమోలు, టీసీలు ఇవ్వకుండా వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ప్రత్యేక నిధులు కేటాయించి విద్యార్థులకు భరోసా కల్పించాలని, లేనిపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com